గురువారం 17-10-2019

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 206

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'సామాన్యులకు వైద్యం ఏనాడూ ఖరీదుగా ఉండకూడదు. అందుకే అందరికీ ఆరోగ్యశ్రీ'



**చేతక్ మళ్లీ వచ్చేసింది!!**

ఈసారి ఎలక్ట్రిక్ స్కూటర్ రూపంలో రూ. 1.50 లక్షల లోపు ధర -బిజినెస్‌లో



**యశస్వి 'డబుల్' యశస్సు...** -స్పోర్ట్స్‌లో

## న్యూస్‌రీల్

### ఆకలి భారతం



భారత్‌లో ఆకలి తీవ్రత పెరిగింది. 2019 గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌లో 117 ప్రపంచ దేశాల్లో మన దేశం 102వ స్థానానికి దిగజారిందని వెల్లడించింది. నేపాల్, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లకన్నా మనదేశం వెనుకబడి ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

- వివరాలు 13లో

### ఈ ఇంటిదొంగలను పట్టేద్దామా?!



మన ఇండ్లలోకి కొత్తరకం పాత్రలు వస్తున్నాయి. లోహం అయితే చాలా బరువుగా ఉండటం వల్ల ఈ తరహా పాత్రలు ఇప్పుడు వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. నిజానికి చాలా అందంగా కనిపించే ఈ బౌల్స్ ఆరోగ్యానికి మాత్రం సురక్షితం కాదు.

- ఫ్యామిలీలో

### అయోధ్య వాదనలు పూర్తి



అయోధ్యలోని రామజన్మభూమి– బాబ్రీ మసీదు స్థల యాజమాన్య హక్కులకు సంబంధించిన కేసు విచారణ సుప్రీం కోర్టులో ముగిసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గొగోయ్ నేతృత్వంలో గత 40 రోజులుగా ఈ కేసులో ఇరు వర్గాల తరఫు లాయర్లు వాదనలు వినిపించారు.

- వివరాలు 13లో

# నవ్వులు నాటిన 'నైరుతి'!



**6%** రాష్ట్రంలో అధికంగా నమోదైన వర్షపాతం

- కీలక సమయంలో వర్షాలతో ఊపందుకున్న ఖరీఫ్ సాగు
- నిండుకుండలా జలాశయాలు.. రబీ సాగుకు భరోసా.. గత పదేళ్లలో 5 సార్లు అధికం.. 5 సార్లు లోటు వర్షపాతం
- దేశవ్యాప్తంగా నైరుతి నిష్క్రమణ.. 'ఈశాన్యం' ప్రవేశం

సాక్షి, హైదరాబాద్

'నైరుతి'వెళ్లిపోయింది.. బుధవారం నైరుతి రుతుపవనాలు దేశవ్యాప్తంగా నిష్క్రమించాయి.. ఇటు ఈశాన్య రుతుపవనాలు మొదలయ్యాయి. జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో చివరి రెండు నెలలు నైరుతి రుతుపవనాలతో వర్షాలు కుమ్మేశాయి. ఈ సీజన్‌లో తెలంగాణలో సాధారణంగా 759.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 805.6 మిల్లీమీటర్లు నమోదైంది. సాధారణం కంటే 6 శాతం అధికంగా వర్షపాతం నమోదైంది. సాధారణానికి అటుఇటుగా వర్షం కురుస్తుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా వేయగా, అంతకుమించి వర్షం కురవడం గమనార్హం. 2016 తర్వాత ఈసారి తెలంగాణలో 6 శాతం అధికంగా వర్షపాతం నమోదైంది. 2016లో 19 శాతం అధికంగా వర్షం కురిసింది. అంతకుముందు 2013లో 26 శాతం, 2010లో 32 శాతం అధికంగా వర్షపాతం నమోదైందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం లెక్కలు చెబుతున్నాయి.

**జూన్‌లో లోటు.. సెప్టెంబర్‌లో అధికం**

గత పదేళ్లలో ఈ సీజన్‌తో కలిపి ఐదు సార్లు అధిక వర్షాలు నమోదు కాగా, మిగిలిన ఐదు సార్లు లోటు వర్షపాతం నమోదైంది. జూన్‌లో తెలంగాణలో 33 శాతం లోటు

మిగతా 3వ పేజీలో ▶

# జీతాలు ఎప్పుడిస్తారు?

## ఆర్టీసీ యాజమాన్యాన్ని ప్రశ్నించిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్

ఆర్టీసీ ఉద్యోగులు సెప్టెంబర్‌లో పని చేసిన కాలానికి జీతాలు ఎందుకు నిలుపుదల చేశారో.. ఎప్పటిలోగా జీతాలు చెల్లిస్తారో తెలియజేయాలని ఆర్టీసీ యాజమాన్యాన్ని హైకోర్టు ఆదేశించింది. ఆర్టీసీ ఉద్యోగుల సెప్టెంబర్ జీతాలు చెల్లించక పోవడాన్ని తప్పుపడుతూ తెలంగాణ ఆర్టీసీ జాతీయ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.హనుమంతు దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను బుధవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి విచారించారు. ఆర్టీసీ యాజమాన్య వివరణపై ఈ నెల 21న తదుపరి విచారణ జరుపుతామని న్యాయమూర్తి తెలిపారు. పిటిషనర్ తరఫు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదిస్తూ.. జీతాల మొత్తాన్ని హైకోర్టు రిజిస్ట్రీ వద్ద ఆర్టీసీ యాజమాన్యం డిపాజిట్ చేసేలా ఉత్తర్వులివ్వాలని కోరారు. రెండ్రోజుల్లో జీతాలు చెల్లించేలా ఆదేశాలివ్వాలని, జీతాల చెల్లింపు కోసం సిబ్బంది అవసరమైతే కార్మిక యూనియన్‌కు చెందిన 100 మంది పనిచేసేందుకు వస్తారని తెలిపారు. ఇప్పటికే ఏడుగురు కార్మికులు ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారని, అప్పు చెల్లించలేక ఒక కార్మికుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. పనిచేసిన కాలానికి జీతాలు చెల్లించకపోవడం చట్ట వ్యతిరేకమని, ఈ విధంగా చేయడాన్ని సుప్రీం కోర్టు కూడా పలు కేసుల్లో తప్పుపట్టిందని చెప్పారు. ఆర్టీసీ యాజమాన్యం తరఫు న్యాయవాది వాదిస్తూ.. జీతభత్యాలు చెల్లించే ఉద్యోగులు కూడా సమ్మెలో ఉన్నారని, అందుకే చెల్లింపులు ఆగిపోయాయని చెప్పారు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బుధవారం మెడకు తాళ్లతో వినూత్న రీతిలో నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

**ప్రైవేటీకరణపై దండెత్తుదాం**

- 'విలీనం'విషయంలో పట్టువిడుపులతో వ్యవహరిద్దాం
- ఆర్టీసీ పరిరక్షణే ప్రధాన ఎజెండా.. చర్చలకు పిలిస్తే అనుసరించాల్సిన వ్యూహంపై జేఏసీ భేటీ...

- వివరాలు 2లో

# చర్చలపై సర్కారు తర్జనభర్జన

**ఆర్టీసీ సమ్మె, రవాణాపై సీఎం సుదీర్ఘ సమీక్ష**

- హైకోర్టు వ్యాఖ్యలపై సమాలోచనలు
- చర్చల కోసం మంత్రుల కమిటీ ఏర్పాటుకు మొగ్గు
- ఆర్టీసీ ఎండీ నియామకంపైనా చర్చ

సాక్షి, హైదరాబాద్

ఆర్టీసీ జేఏసీతో చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకుని, కార్మికులు సమ్మె విరమించేలా చేయాలన్న హైకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో చర్చల పునరుద్ధరణపై రాష్ట్ర ప్రభుత్వం తర్జనభర్జన పడుతోంది. చర్చల ప్రసక్తే లేదని సీఎం కరాఖండిగా చెప్పడం, ఆ తర్వాత చర్చల ద్వారా సమస్య పరిష్కరించుకోవాలని హైకోర్టు సూచించడంతో ఏం చేయాలన్న దానిపై సీఎం కేసీఆర్ బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు 4 గంటలకు పైగా చర్చించారు. ఆర్టీసీ నేతలతో ఇప్పటికే ముగ్గురు అధికారులతో కూడిన బృందం తొలి దఫా చర్చలు విఫలమైన సంగతి తెలిసిందే. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో భవిష్యత్తు కార్యాచరణపై సమావేశంలో చర్చించారు. ప్రధానంగా ఆర్టీసీ కార్మిక జేఏసీ, రాష్ట్ర ప్రభుత్వం చర్చల దారా పరిష్కరించుకోవాలని హైకోర్టు సూచించిన

మిగతా 2వ పేజీలో ▶

## లక్షలు కాదు.. లైఫ్ ఉండాలె



- ప్యాషన్ కోసం బోధనవైపు ఐఐటీయన్ల అడుగులు
- లక్షల జీతాన్ని వదులుకుని టీచింగ్ ప్రొఫెషన్‌లోకి..
- ఒత్తిడి లేకుండా సృజనాత్మకతతో అభ్యర్థులకు శిక్షణ.. ఈ వృత్తే సంతృప్తిని ఇస్తోందంటున్న ఐఐటీయన్లు

- వివరాలు 5లో


NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE | Vencobb CHICKEN | సూచించిన నేటి గుడ్డు & చికెన్ హైదరాబాద్ జోన్ ధరలు

| | | | | |
|---|---|---|---|---|
| గుడ్డు రిటైల్ ధర ₹ 52 డజన్ | ఫారం దగ్గర లైవ్ బర్డ్ | 73 కిలో | డ్రెస్డ్ స్కిన్‌తో | 138 కిలో |
| | రిటైల్ లైవ్ బర్డ్ | 95 కిలో | స్కిన్‌లెస్ | 157 కిలో |

Conditions Apply






బుధవారం మింట్ కంపౌండ్‌లోని విద్యుత్ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహిస్తున్న విద్యుత్ కార్మికులు

- వివరాలు 5లో

# 'కరెంట్' కొలువులొచ్చేశాయి...

3లో

| 3,025 | 2,500 | 500 |
|---|---|---|
| పోస్టుల భర్తీకి టీఎస్ఎస్పీడీసీఎల్ ప్రకటన జారీ | జూనియర్ లైన్‌మెన్, 25 జూనియర్ పర్సనల్ ఆఫీసర్.. | జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు |

**ఖర్చు తక్కువ, పర్యావరణ హితం**

# బయో బ్రిక్స్

- వ్యవసాయ వ్యర్థాలతో ఇటుకలు
- ఐఐటీ హైదరాబాద్ పరిశోధకుల సృష్టి.. కేఐఐటీ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్‌తో కలసి పరిశోధనలు
- నిర్మాణ రంగంలో తక్కువ ఖర్చుకు అవకాశం: పీహెచ్‌డీ స్కాలర్ ఆర్.ప్రియాబ్రతా రౌత్రే

సాక్షి, సంగారెడ్డి: వ్యవసాయ వ్యర్థాలను ఉపయోగించి ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన పరిశోధకులు బయో ఇటుకలు తయారు చేశారు. ఇవి పర్యావరణ హితంగా, తక్కువ ఖర్చులో ఉంటాయని పరిశోధకులు చెబుతున్నారు. ఐఐటీ హైదరాబాద్ డిజైన్ డిపార్ట్‌మెంట్ పీహెచ్‌డీ స్కాలర్ ఆర్.ప్రియాబ్రతా రౌత్రే, కేఐఐటీ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ భువనేశ్వర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్.అవిక్‌రాయ్ బృందం బయో ఇటుకల తయారీపై పరిశోధనలు చేసింది. ఐఐటీ డిజైన్ విభాగం హెడ్ ప్రొఫెసర్ దీపక్ జాన్ మాథ్యూ, ఆస్ట్రేలియా స్విన్‌బర్న్ వర్సిటీ ఆఫ్ టెక్నాలజీ ప్రొఫెసర్ బోరిస్ ఐసెన్‌బార్ట్ మార్గనిర్దేశకంలో ఈ పరిశోధన ఫలితాలను అంతర్జాతీయ సదస్సులో నెదర్లాండ్‌లోని టీయూ డేల్ఫ్ వద్ద (ఐసీఈడీ–1019)

మిగతా 3వ పేజీలో ▶

## 44వేలకుపైగా దరఖాస్తులు

# 880 కోట్ల ఆదాయం



**మద్యం షాపులకు వెల్లువెత్తిన దరఖాస్తులు**

- ఒక్క చివరి రోజే 20 వేలకు పైగా..
- కిటకిటలాడిన ఎక్సైజ్ డీసీ కార్యాలయాలు..
- బందోబస్తు మధ్య దరఖాస్తుల స్వీకరణ..
- టెండర్లకు పొరుగు రాష్ట్రాల వ్యాపారుల తాకిడి

సాక్షి, హైదరాబాద్

రూ.2 లక్షల టెండర్ ఫీజు.. లాటరీలో అదృష్టం వరించకపోతే ఆ రూ.2 లక్షలు పోయినట్టే. అంటే కేవలం అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రూ.2 లక్షలు సమర్పించుకోవాలన్నమాట.. అయినా మద్యం వ్యాపారులు, లిక్కర్ వ్యాపారంలో అడుగుపెట్టాలనుకునే ఆశావహులు ఎక్కడా వెనక్కి తగ్గలేదు. రూ.2 లక్షలను కూడా ఖాతరు చేయలేదు. పోతే రూ.2లక్షలు.. వస్తే మద్యం దుకాణం అనే ధోరణిలో దరఖాస్తులు భారీగా సమర్పించారు. రాష్ట్రంలో మద్యం దుకాణాలకుగాను టెండర్ల స్వీకరణ గడువు ముగిసిన బుధవారం నాటి రాత్రికి ఎక్సైజ్ అధికారుల

మిగతా 4వ పేజీలో ▶



# టెండర్లొద్దు

**ఆర్థిక మాంద్యం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ కీలక నిర్ణయం**

**ప్రతిపాదిత, కొత్త ప్రాజెక్టులకు టెండర్లు వద్దని 'ఇంజనీరింగ్'కు ఆదేశాలు**

సాక్షి. హైదరాబాద్

మంచినీరు, ఇతర అత్యవసరాలు మినహాయించి కొత్తగా ఎలాంటి ప్రాజెక్టులు, ఇతర నిర్మాణ పనులకు టెండర్లు పిలవరాదని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అన్ని డిపార్టుమెంట్లలోని ఇంజనీరింగ్ విభాగాలకు అత్యవసర సందేశాలు పంపింది. ఆర్థిక మాంద్యం, సంక్షేమ పథకాలకు నిధుల లభ్యతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. మాంద్యం నుంచి బయట పడేదాకా కొత్త ప్రతిపాదనలేవీ ఆమోదించవద్దని ప్రభుత్వం ఆదేశించింది. తాజా ఆదేశాలతో సాగునీటి శాఖ, పంచాయతీరాజ్, రహదారులు, భవనాలు వంటి కీలక డిపార్ట్‌మెంట్లలో రూ.25 వేల కోట్ల విలువైన

- రోడ్లు, భవనాల శాఖలోనూ కొత్త రహదారులు లేదా విస్తరణ ప్రాజెక్టులకు స్టాప్
- సాగునీటి ప్రాజెక్టులకు పెండింగ్‌లో రూ.10,765 కోట్ల బిల్లులు

ప్రాజెక్టులు, పనులకు బ్రేక్ పడింది. సాగునీటి శాఖలో కాళేశ్వరం ప్రాజెక్టు విస్తరణ పనులు, మంజీరా నదిపై నిర్మించాలని ప్రతిపాదించిన ఎత్తిపోతల పథకం, రహదారులు, భవనాల శాఖ చేపట్టాలని భావించిన హైదరాబాద్–నాగార్జునసాగర్ 4 లేన్ల రహదారి, మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు రహదారుల విస్తరణ పనులు ఆగిపోనున్నాయి. గ్రామీణ రహదారులకు సంబంధించి రూ.150 కోట్ల విలువైన పనులకూ బ్రేక్ పడినట్లే.

**రూ.15 వేల కోట్ల పనులకు బ్రేక్..**

కాళేశ్వరం ఎత్తిపోతల్లో మిడ్‌మానేరు దిగువన మల్లన్నసాగర్ వరకు అదనపు మూడో టీఎంసీ నీటిని పైప్‌లైన్ వ్యవస్థ ద్వారా తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నీటి తరలింపునకు మూడు స్థాయిల్లో లిఫ్టులను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీనిలో మిడ్‌మానేరు నుంచి అనంతగిరి రిజర్వాయర్ వరకు పైప్‌లైన్ వ్యవస్థ నిర్మాణానికి రూ.4,142 కోట్లు, అనంతగిరి నుంచి మల్లన్నసాగర్ వరకు పైప్‌లైన్ నిర్మాణానికి 10,260 కోట్లు అవుతుందని అంచనా వేశారు. మొత్తంగా రూ.14,362 కోట్ల మేర

మిగతా 2వ పేజీలో ▶



ఇక రైతుబంధు, సన్నబియ్యం, ఆసరా పింఛన్లకు అధికంగా నిధులు ఖర్చవుతున్న నేపథ్యంలో సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో భారీగా బిల్లులు పెండింగ్‌లో పడిపోయాయి. ప్రస్తుత లెక్కల ప్రకారం.. రూ.10,765 కోట్ల బిల్లులు పెండింగ్‌లో

**పెండింగ్.. రూ.10వేల కోట్లు..**

ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో రూ.2వేల కోట్లు, పాలమూరు-రంగారెడ్డి పరిధిలో రూ.1,600 కోట్లు, మైనర్ ఇరిగేషన్ పరిధిలో రూ.700 కోట్ల మేర పెండింగ్‌లో ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

"మీ లైసెన్స్ రెన్యువల్‌కు చాలా ఇబ్బందులు ఉన్నాయి.. నాకు లంచం వద్దు.. అసలు మా వంశంలోనే ఎవరూ లంచం తీసుకోలేదు. కానీ, నా కూతురికి చిన్న గిఫ్ట్ ఇవ్వండి. అది కూడా ఓ నాలుగు లక్షల నెక్లెస్ అంతే"

"రూ.70 లక్షల బిల్లు మంజూరు చేస్తే నాకేంటి.. అలాగని నేను లంచం తీసుకునే మనిషిని కాదు.. కేవలం 5 శాతం కమీషన్. అంటే మూడు లక్షల యాభై వేలు ఇచ్చేస్తే మీ పని అయిపోతుంది. ఇందులో నాకేం మిగలదు.. నేనూ పైవారికి ఇచ్చుకోవాలి"

# దసరా మామూళ్లు.. నగలు, నెక్లెస్‌లు!



- డబ్బుకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వాధికారుల వసూళ్లు
- సెప్టెంబర్ 1 నుంచి ఏసీబీకి చిక్కిన 12 మంది
- ఆడియో, వీడియో సాక్ష్యాలతో పట్టుకుంటున్న ఏసీబీ
- ఈ ఏడాదిలో 130కి చేరిన అవినీతి కేసులు

సాక్షి, హైదరాబాద్: దసరా పండగ కోసం చాలామంది ప్రభుత్వాధికారులు లంచాల కోసం అడ్డదారులు తొక్కారు. ఈ క్రమంలో ఎక్కడా లంచం అన్న మాటే వాడలేదు. వాటికి బహుమతులు, కమీషన్లు ఇలా రకరకాల పేర్లు చెప్పి వసూలు చేశారు. వీరిలో పాతికేళ్ల సీనియర్ల నుంచి డ్యూటీలో చేరి పట్టుమని రెండు నెలలు కూడా పూర్తికాని వారుండటం గమనార్హం. ఒకరిని చూసి మరొకరు లంచాల వసూళ్లలో పోటీ పడ్డారు. గతంలో ఎప్పుడూ లేనిది ఈసారి అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ)కి దసరా ముందు అనేక మంది లంచాల పీడితులు తమగోడు వెళ్లబోసుకున్నారు. దీంతో వారందరికీ ఉచ్చు బిగించిన ఏసీబీ అధికారులకు సెప్టెంబర్ 1 నుంచి అక్టోబర్ 12 (దసరా) వరకు ఏకంగా 12 మంది చిక్కడం గమనార్హం. అంటే సగటున ప్రతీ నాలుగు రోజులకు ఒకరు చొప్పున ఏసీబీ వలలో చిక్కారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది ఏసీబీలో నమోదైన కేసుల జాబితా దాదాపు 130కి చేరింది.

### పకడ్బందీగా బుక్ చేస్తోన్న ఏసీబీ..

సాక్ష్యాధారాల సేకరణలో ఏసీబీ రూటుమార్చింది. తమ వద్దకు వచ్చిన బాధితుల విషయాలను ధ్రువీకరించుకునేందుకు కొంత సమయం తీసుకుంటోంది. తరువాత సదరు అధికారిని జాగ్రత్తగా ట్రాప్ చేస్తారు. అతని ఫోన్‌కాల్స్ సంభాషణలు, లంచం తీసుకుంటుండగా రహస్య వీడియో తీయడం వరకు అంతా పకడ్బందీగా వ్యవహరిస్తున్నారు. దీంతో నిందితుడికి న్యాయస్థానంలో కచ్చితంగా శిక్ష పడేలా ఆధునిక సాంకేతికత సాయంతో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ''గతంలో లాగ కాదు..ఇపుడు ఏసీబీ కేసులో చిక్కుకుంటే బయటపడటం దాదాపుగా అసాధ్యం'' అని ఓ ఏసీబీ ఉన్నతాధికారి చెప్పారు.

### నెక్లెస్ గిఫ్ట్‌గా..

ఇటీవల హైదరాబాద్‌లో ఓ బ్లడ్‌బ్యాంక్ లైసెన్స్ రెన్యువల్ విషయంలో అప్పటికే రూ.50 వేలు లంచం తీసుకున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మి.. మరింత లంచం కోసం గిఫ్ట్‌కింద రూ.1.10 లక్షల నెక్లెస్‌ని అడిగింది. దీంతో బాధితులు ఏసీబీని ఆశ్రయించడంతో, ఏసీబీ అధికారులు నెక్లెస్ షాపింగ్ మొత్తం ఆడియో, వీడియో సాక్ష్యాధారాలతో సహా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

### రెండు నెలలకే లంచం..

తుర్కయాంజాల్ వీఆర్వో శేఖర్ తన వద్దకు భూమి మ్యుటేషన్ కోసం వచ్చిన ఓ రైతు వద్ద రూ.లక్ష లంచం అడిగాడు. బాధితుడు ఏసీబీని ఆశ్రయించడంతో వారు వలపన్ని పట్టుకున్నారు. ఇక్కడ ఆసక్తికర అంశం ఏంటంటే.. నిందితుడు శేఖర్ వీఆర్వోగా చేరి అప్పటికి కేవలం రెండు నెలలే అయింది. తోటివారి అవినీతి చూసిన శేఖర్ అక్రమమార్గం పట్టినట్లు ఏసీబీ అధికారులు చెబుతున్నారు.

# దేశభక్తిని రగిలించే చిత్రం 'సైరా'

- 'సైరా నరసింహారెడ్డి'పై వెంకయ్య ప్రశంసలు
- కుటుంబసభ్యులు, చిరంజీవితో కలిసి చిత్రాన్ని వీక్షించిన ఉపరాష్ట్రపతి

సాక్షి, న్యూఢిల్లీ: దేశభక్తిని రగిలించే చిత్రాల కొరతను సైరా నరసింహారెడ్డి తీర్చగలుగుతుందని భావిస్తున్నట్టు ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ప్రశంసించారు. జాతీయ భావాన్ని పెంపొందించే చిత్రాలు తగ్గిపోయాయని, ఇలాంటి తరుణంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితం ఆధారంగా సైరా నరసింహారెడ్డి సినిమాను అందించడం సంతోషకరమన్నారు. వెంకయ్య నాయుడు బుధవారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో కుటుంబ సభ్యులు, మెగాస్టార్ చిరంజీవి, మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్‌తో కలిసి సైరా నరసింహారెడ్డి చిత్రాన్ని ప్రత్యేకంగా వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వలస పాలకుల దుర్మార్గాలను, అరాచకాలను చక్కగా తెరకెక్కించారని, అంతర్గత కలహాలు, స్వార్థం వల్లే గతంలో మనం స్వతంత్ర్యాన్ని కోల్పోయామన్న సందేశం చిత్రంలో ఇమిడి ఉందన్నారు. ఇంతటి మంచి చిత్రాన్ని నిర్మించిన నిర్మాత రామ్‌చరణ్, చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించిన దర్శకుడు సురేందర్‌రెడ్డిని అభినందించారు. ఈ చిత్రాన్ని వీక్షించిన అనంతరం 'మనమిద్దరం రాజకీయాలు వదిలేశాం.. ఇక ముందు మీరు ఇలాంటి మరెన్నో చిత్రాల్లో నటించి ప్రజలను రంజింపజేయాలి' అని చిరంజీవికి సలహా ఇచ్చినట్టు వెంకయ్యనాయుడు తెలిపారు.

### సంతోషంగా ఉంది

సైరా నరసింహారెడ్డి చిత్రం ప్రజల మన్ననలు పొందడం సంతోషంగా ఉందని మెగాస్టార్ చిరంజీవి అన్నారు. ఉపరాష్ట్రపతి ఈ చిత్రాన్ని వీక్షించడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని నరేంద్ర మోదీలను కూడా కలిసి 'సైరా'ను వీక్షించాలని చిరంజీవి కోరనున్నట్టు తెలిసింది.



బుధవారం ఢిల్లీలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడును కలసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మెగాస్టార్ చిరంజీవి. చిత్రంలో ఏపీ మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ తదితరులు

## క్లుప్తంగా...

### ఫార్మా రాజధానిగా హైదరాబాద్ : కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో హైదరాబాద్ స్థానాన్ని మరింత సుస్థిరం చేసేందుకు కృషి చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారకరామారావు అన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే '17వ బయో ఏషియా సదస్సు'వెబ్‌సైట్, థీమ్‌ను బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఓ సమావేశంలో కేటీఆర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 17వ బయో ఏషియా సదస్సును 'టుడే ఫర్ టుమారో'నినాదంతో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్‌ను ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాలకు రాజధానిగా మారుస్తామని చెప్పారు. టీఎస్ఐఐసీ, రిచ్, స్టేట్ ఇన్నోవేషన్ సెల్ వంటి పలు రాష్ట్ర ప్రభుత్వ సంస్థలతో పాటు పలు కేంద్ర సంస్థలు కూడా ఈ సదస్సు నిర్వహణలో భాగస్వామ్యం వహిస్తున్నట్లు తెలిపారు. బయో ఏషియా సమావేశానికి స్విట్జర్లాండ్ భాగస్వామి దేశంగా, జర్మనీ సంయుక్త భాగస్వామిగా ఉంటుందన్నారు. అసోం, కేరళ రాష్ట్ర ప్రభుత్వాలు 'రాష్ట్ర భాగస్వాములు'హోదాలో ఈ సమావేశానికి హాజరవుతాయని తెలిపారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, టీఎస్ఐఐసీ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి, తెలంగాణ లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ శక్తి నాగప్పన్ పాల్గొన్నారు.

### సమ్మె విరమణకు ప్రభుత్వం చొరవ చూపాలి

తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ కార్మికుల సమ్మె విరమణకు ప్రభుత్వం చొరవ చూపాలని తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ సంపత్‌కుమార్ స్వామి డిమాండ్ చేశారు. బుధవారం ఆర్టీసీ జేఏసీ నాయకులు అశ్వత్థామ రెడ్డి, రాజిరెడ్డి, సుధ తదితరులు తమ సమ్మెకు తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ మద్దతు అడిగినట్లు తెలిపారు. ఈనెల 13న జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్ణయం మేరకు వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం కలిసివస్తామని చెప్పినట్లు పేర్కొన్నారు. సమ్మె 12వ రోజుకు చేరిన నేపథ్యంలో ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా ఉండడం సరికాదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జి.నిర్మల, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం బాలస్వామి, రాష్ట్రకన్వీనర్ బత్తిని సుదర్శన్‌గౌడ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు భరత్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### పీఎం కిసాన్ సొమ్ము విడుదల

సాక్షి, హైదరాబాద్: ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్) పథకం మూడో విడత నిధులు బుధవారం విడుదలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 19,72,396 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లోకి రూ.2 వేల చొప్పున మూడో కిస్తీ డబ్బులు జమ చేశారు. వాస్తవానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూలు ప్రకారం గత ఆగస్టు నెల ఒకటో తేదీ నుంచి మూడో కిస్తీ చెల్లింపులు మొదలవ్వాలి. కానీ రెండున్నర నెలలు చెల్లింపుల్లో జాప్యం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో లబ్ధిదారుల సంఖ్య 33,59,852 మందికి చేరింది. 2019 మార్చి 31 వరకు మొదటి కిస్తీ, జూలై 31 నాటికి రెండో కిస్తీ పంపిణీ పూర్తి కావాలి. మొదటి విడతలో 33,14,292 మంది, రెండో విడతలో 31,70,784 మంది రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయి.

# పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తాం

- 30 రోజుల ప్రణాళికతో మంచి ఫలితాలు సాధించాం
- ముఖ్యమంత్రి కేసీఆర్



బుధవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గటిక అజయ్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తామని, గ్రామ పంచాయతీలతోపాటు మండల పరిషత్, జిల్లా పరిషత్‌లను క్రియాశీలకంగా మారుస్తామని సీఎం కె.చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. గ్రామ పంచాయతీ ట్రిబ్యునల్ సభ్యుడిగా నియమితుడైన వరంగల్ రూరల్ జిల్లా నెక్కొండకు చెందిన గటిక అజయ్‌కుమార్ బుధవారం ప్రగతిభవన్‌లో ఎంపీపీలు, జెడ్పీటీసీలు, స్థానిక ప్రజాప్రతినిధులతో పాటుగా ముఖ్యమంత్రిని కలిశారు. సీఎం మాట్లాడుతూ, ఇటీవల గ్రామాల్లో నిర్వహించిన 30 రోజుల ప్రణాళిక ఆశించిన ఫలితాలు సాధించిందని సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీల మాదిరిగానే మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు కూడా నిర్దిష్టమైన విధులు, నిధులు, బాధ్యతలు అప్పగించడానికి కసరత్తు చేస్తున్నట్లు వెల్లడించారు. త్వరలోనే ఎంపీపీలు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, జెడ్పీ చైర్మన్లతో హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు కేసీఆర్ చెప్పారు. ఆర్థిక సంఘం నిధులను ప్రతినెలా రూ.339 కోట్ల చొప్పున గ్రామ పంచాయతీలకు విడుదల చేస్తున్నామని, ఇదే తరహాలో మండల, జిల్లా పరిషత్‌లకు కూడా నిధులు విడుదల చేస్తామని చెప్పారు. ప్రజల విస్తృత భాగస్వామ్యం, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల నాయకత్వంలో పల్లెలు బాగు పడాలని సీఎం ఆకాంక్షించారు. దీనికి అవసరమైన ఆర్థిక ప్రేరణను ప్రభుత్వం అందిస్తుందని, గ్రామ స్థాయిలో ప్రజలు సమైక్యంగా ఉండి, గ్రామాలను బాగు చేసుకోవాలని, నిధులను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సీఎంను కలసిన వారిలో జెడ్పీటీసీ సరోజ హరికిషన్ నాయక్, ఎంపీపీ జాటోతు రమేశ్, టీఆర్ఎస్ నేతలు కొమ్ము రమేశ్ యాదవ్ తదితరులు ఉన్నారు.

# చర్చలపై సర్కారు తర్జనభర్జన

▶ మొదటి పేజీ తరువాయి

నేపథ్యంలో చర్చల పునరుద్ధరణపై సమాలోచనలు జరిపినట్లు తెలిసింది. చర్చలు జరపాల్సి వస్తే తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఆర్టీసీ ఎండీ పోస్టును సైతం తక్షణమే భర్తీ చేయాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో అందుకోసం సమర్థులైన అధికారిని నియమించేందుకు సమావేశంలో కసరత్తు చేశారు. సీనియర్ ఐపీఎస్‌లైన అకున్ సబర్వాల్, స్టీఫెన్ రవీంద్ర, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, శివధర్‌రెడ్డి పేర్లను ఆ పోస్టు కోసం పరిశీలించినట్లు సమాచారం. శుక్రవారం కొత్త ఎండీ నియామకానికి సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది. కొత్త ఎండీ ఆధ్వర్యంలో చర్చలు జరపాలా.. లేదా మంత్రుల కమిటీ ఏర్పాటు చేసి చర్చలు నిర్వహించాలా అన్న దానిపై చర్చ జరిగింది. అయితే చివరికి మంత్రుల కమిటీకే ప్రభుత్వం మొగ్గి చూపినట్లు తెలిసింది. హైకోర్టు ఆదేశిస్తే చర్చలకు సంసిద్ధత వ్యక్తం చేయాలన్న అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. సమ్మె నేపథ్యంలో ప్రస్తుతం రాష్ట్రంలో రవాణా పరిస్థితిని సీఎం సమీక్షించారు. సమావేశానికి రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ముఖ్య కార్యదర్శి సునీల్‌శర్మ తదితరులు హాజరయ్యారు.

# సర్కార్ వైఖరిలో మార్పు రావాలి: సీపీఎం

సాక్షి, హైదరాబాద్: హైకోర్టు జోక్యంతోనైనా ఆర్టీసీ సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిలో మార్పు రావాలని సీపీఎం ఆకాంక్షించింది. సీఎం పట్టుదలకు పోకుండా కార్మికులతో చర్చలు జర పాలని కోరింది. బుధవారం ఎంబీ భవన్‌లో జరిగిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ భేటీ.. ఆర్టీసీ కార్మికుల జీతాలపై హైకోర్టు చేసిన సూచనను స్వాగతించినట్లు సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. కార్మికులను లొంగదీసుకోవాలనే కుట్రలకు ప్రభుత్వం ముగింపు పలకాలని సూచించారు.



బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌కు వినతి పత్రం ఇస్తున్న కె. లక్ష్మణ్ తదితరులు

# ఆర్టీసీ సమ్మె విషయంలో జోక్యం చేసుకోండి

గవర్నర్ తమిళిసైకి బీజేపీ నేతల వినతి

హైదరాబాద్: టీఆర్ఎస్ ప్రభుత్వానికి కనీసం మానవత్వం కూడా లేదని, సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికుల్లో ఇద్దరు మృతి చెందినా పట్టించుకోలేదని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ మండిపడ్డారు. సమ్మె చేస్తున్న కార్మికులకు వేతనాలు చెల్లించాలని కోర్టు ఆదేశించినా పట్టించుకోవట్లేదని, సమ్మె వల్లే వేతనాలు ఇవ్వలేకపోయామంటూ కోర్టును కూడా తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసైని బీజేపీ బృందం కలసి వినతిపత్రం అందజేసింది. ఆర్టీసీ సమ్మె, రాష్ట్రంలోని తాజా పరిస్థితులను గవర్నర్‌కు వివరించామని లక్ష్మణ్ చెప్పారు. సమ్మె విషయంలో ప్రభుత్వంపై గవర్నర్ జోక్యం చేసుకోవాలని కోరగా.. గవర్నర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. 115 పాంతాల్లో ఆర్టీసీకి చెందిన భూములను సర్వీసు ప్రొవైడర్ల పేరుతో వారి అనుచరులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. గవర్నర్‌ను కలసిన వారిలో బీజేపీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు, ఎన్.ఇంద్రసేనారెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు ఆకుల విజయ ఉన్నారు.

# టెండర్లొద్దు

▶ మొదటి పేజీ తరువాయి

వ్యయం అవుతుండగా, ఈ పనులకు టెండర్లు పిలవాల్సి ఉంది. నిజాంసాగర్ కింద మంజీరా నదిపై పిట్లం, బిచ్కుంద మండలాల పరిధిలోని 21 గ్రామాల్లో 30,646 ఎకరాలకు నీరిచ్చేందుకు మల్లూర్ సమీపంలో రూ.476 కోట్లతో మంజీరా ఎత్తిపోతల పథకాన్ని చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2.90 టీఎంసీల సామర్థ్యంతో చేపట్టే ఈ పథకానికి టెండర్లు పిలవాల్సి ఉంది. ఇక గోదావరి జలాలను వినియోగించుకునేందుకు చేపట్టిన దేవాదుల ప్రాజెక్టులో అదనపు నీటి నిల్వలు పెంచేందుకు కొత్త రిజర్వాయర్ నిర్మాణం చేయాలని నిర్ణయించారు. అందుకు 10.78 టీఎంసీల సామర్థ్యంతో.. రూ.3,672 కోట్లతో వరంగల్ జిల్లా ఘనపూర్ మండలం లింగంపల్లి వద్ద దీన్ని నిర్మించాలని ప్రతిపాదించారు. గోదావరికి వరద ఉండే 3 నెలల కాలంలో ధర్మసాగర్ నుంచి నీటిని రిజర్వాయర్‌లోకి ఎత్తిపోసేలా దీన్ని డిజైన్ చేశారు. రెండున్నరేళ్లలో రిజర్వాయర్‌ను పూర్తి చేసేలా ఇటీవలి రాష్ట్ర ఎన్నికలకు ముందు ఈ పనులను రెండు ప్యాకేజీలుగా విభజించి టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులకు సిద్ధంగా కాగా వాటిని రద్దు చేశారు. ప్రస్తుత నిర్ణయంతో కొత్త టెండర్లు పిలిచే అవకాశం లేనట్లే. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో గ్రామీణ రోడ్లకు సంబంధించి కొత్త పనులకు మంజూరు ఇవ్వకపోగా, నిధుల లేమి కారణంగా ఇప్పటికే మంజూరైన రూ.150 కోట్ల పనులకు కూడా బ్రేక్ వేశారు. పంచాయతీ రాజ్ పరిధిలోని కొత్త గ్రామ పంచాయతీ కార్యాలయాల నిర్మాణాలతో పాటే ఇతర నిర్మాణ పనులు పక్కనపెట్టారు.

### డబుల్ రోడ్లకూ బ్రేక్...

జిల్లా కేంద్రాల నుంచి రాజధానికి నాలుగు వరుసల రోడ్లు, మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు డబుల్ రోడ్లు నిర్మించడానికి రూ.13 వేల కోట్లతో పనులు మొదలై ఇప్పటిదాకా ఉధృతంగా సాగాయి. ఇప్పుడు మాంద్యం వాటికి ముప్పుగా మారింది. రోడ్డు నిర్మాణ పనుల్లో దాదాపు ఏడాది కాలంగా బిల్లులు నిలిచిపోవడంతో చాలా చోట్ల కాంట్రాక్టర్లు పనులు నిలిపేశారు. పలు శాఖల్లో బిల్లులు పేరుకుపోవటంతో ముందుగా వాటిని క్లియర్ చేసిన తర్వాతనే కొత్త పనులు చేపట్టాలన్న విధానపర నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకుంది. రోడ్డు పనులకు దాదాపు రూ.వేయి కోట్లు చెల్లించాల్సి ఉంది. కొత్తగా ఏర్పడిన 54 మండల కేంద్రాల్లో డబుల్ రోడ్డు వసతి లేదు. వాటి నుంచి జిల్లా కేంద్రాలకు 687.95 కిలోమీటర్ల మేర రోడ్లను నిర్మించాల్సి ఉండగా, రూ.1205 కోట్లు ఖర్చవుతుందని అధికారులు డీపీఆర్‌లు రూపొందించారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసే వేళ మాంద్యం చుట్టుముట్టడంతో ఈ పనులకు బ్రేక్ పడింది.

### నాలుగు వరుసల రోడ్లూ అంతే...

జిల్లా కేంద్రాల నుంచి హైదరాబాద్‌కు నాలుగు వరుసల రోడ్లను నిర్మించే ప్రాజెక్టుకు కూడా కొంత గండిపడింది. ప్రస్తుతం రాష్ట్రంలో వనపర్తి, నాగర్‌కర్నూలు, గద్వాల, నారాయణపేట, ములుగు జిల్లా కేంద్రాల నుంచి హైదరాబాద్‌కు నాలుగు వరుసల రోడ్లు లేవు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఈ పనులూ పడకేసినట్టే. అయితే నాలుగు వరుసల రోడ్లను జాతీయ రహదారుల్లో భాగంగా అనుసంధానిస్తున్నందున, కొత్త జాతీయ రహదారుల నిర్మాణం ప్రారంభమైతే ఈ పనులు పూర్తయినట్టే.

# వంద శాతం బస్సులు నడపాలి

- అధికారులకు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆదేశం
- అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలుంటాయని హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్: సమ్మె మొదలై 12 రోజుల తర్వాత కూడా పూర్తి స్థాయిలో బస్సులు నడవకపోవటంపై రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే 100 శాతం బస్సులు అందుబాటులోకి తెచ్చి ప్రయాణికులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని ఆదేశించారు. బుధవారం ట్రాన్స్‌పోర్టు భవన్‌లోని తన కార్యాలయం నుంచి ఆర్టీసీ అధికారులు, డిపో మేనేజర్లతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. జిల్లాల్లో ఆర్టీసీ బస్సులు కొంత సంతృప్తికరంగానే నడుస్తున్నా, హైదరాబాద్‌లో మాత్రం 40 శాతం కూడా నడవట్లేదని అధికారులు ఆయన దృష్టికి తెచ్చారు. అవసరమైనంత మంది మెకానిక్‌లను కూడా తాత్కాలిక పద్ధతిలో ఏర్పాటు చేసుకుని, ఎప్పటికప్పుడు బస్సులు ఫిట్‌నెస్‌తో ఉండేలా చూసి రోడ్డెక్కించాలని ఆదేశించారు. అధికంగా చార్జీల వసూలుపై వస్తున్న ఫిర్యాదులపై ఆయన స్పందించారు. నిర్ణీత చార్జీలు మాత్రమే వసూలు చేయాలని, ఎక్కువ చార్జీలు వసూలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని పునరుద్ఘాటించారు. వెంటనే అన్ని బస్సుల్లో టిమ్స్ అందుబాటులోకి తెస్తే సమస్య పరిష్కారమవుతుందని పేర్కొన్నారు. టిమ్స్‌ను ఎలా వినియోగించాలో కండక్టర్లకు శిక్షణ ఇచ్చి వాటిని వాడేలా చూడాలని పేర్కొన్నారు. పెద్ద సంఖ్యలోనే బస్సులు తిరుగుతున్నా, అవి తిరుగుతున్న కిలోమీటర్ల పరిధి తక్కువగా ఉంటోంది. దీంతో ఆదాయం తగ్గుతోంది. దీన్ని రెట్టింపు చేయాలని మంత్రి సూచించారు.

### 64 శాతం తిరిగిన బస్సులు

బుధవారం కూడా బస్సులు కొంత పరిమితంగానే తిరిగినట్లు ఆర్టీసీ అధికారులు ప్రకటించారు. 6,365 బస్సులే తిప్పినట్టు వెల్లడించారు. ఇందులో 4,424 ఆర్టీసీ బస్సులు కాగా, 1,941 అద్దె బస్సులున్నట్టు తెలిపారు. వెరసి 64 శాతం సర్వీసులు తిప్పినట్టు పేర్కొన్నారు. వీటికి అదనంగా ప్రైవేటు విద్యాసంస్థలు, ఇతర మ్యాక్సీ క్యాబ్స్ వ్యాన్లు, ప్రైవేటు బస్సులు తిరగటంతో ప్రయాణాలకు పెద్దగా ఇబ్బంది లేదని వెల్లడించారు. కానీ హైదరాబాద్ సిటీలో బుధవారం కూడా సిటీ సర్వీసుల పరిస్థితి మెరుగుపడలేదు. దీంతో సిటీ వాసులకు ప్రయాణ కష్టాలు తప్పలేదు.

# ప్రైవేటీకరణ యోచనపై దండెత్తుదాం

- 'విలీనం'విషయంలో పట్టువిడుపులతో వ్యవహరిద్దాం
- ఆర్టీసీ పరిరక్షణే ప్రధాన ఎజెండా కావాలి
- చర్చలకు పిలిస్తే అనుసరించాల్సిన వ్యూహంపై జేఏసీ భేటీ



బుధవారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న అశ్వత్థామరెడ్డి, చాడ వెంకట్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: సమ్మె విషయంలో ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెను మరింత ఉధృతం చేయాలని ఆర్టీసీ జేఏసీ నిర్ణయించింది. తాము చర్చలకు సిద్ధమని మరోసారి తేల్చి చెప్పింది. హైకోర్టు స్పందన నేపథ్యంలో జేఏసీ ప్రతినిధులు బుధవారం అత్యవసరంగా భేటీ అయ్యారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయలేమని ప్రభుత్వం కోర్టుకు కూడా చెప్పడంతో.. ఈ విషయంపై అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఈ విషయంలో పట్టుపట్టకుండా, ఆర్టీసీ పరిరక్షణ కోణంలో డిమాండ్ చేయాలని కొందరు సభ్యులు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ప్రైవేటీకరణ, అద్దె బస్సుల సంఖ్య పెంపు విషయాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలని నిర్ణయించారు. అనంతరం మద్దతు కూడగట్టుకునేందుకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రాజకీయ జేఏసీ సమావేశంలో పాల్గొన్నారు.

### చర్చలకు ఆహ్వానించాలి..

కోర్టు సూచనల మేరకు చర్చలకు ఆహ్వానించి ఆర్టీసీ కార్మికుల సమ్మె పరిష్కరించాలని ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన అఖిల పక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ.. చిత్తశుద్ధి ఉన్నవారితో కమిటీ వేసి కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. కాగా, ఈ నెల 19న జరిగే ఆర్టీసీ కార్మికుల బంద్‌ను విజయవంతం చేయాలని టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం పిలుపునిచ్చారు. అఖిలపక్ష సమావేశం అనంతరం మాట్లాడుతూ.. ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, కర్షకులు సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేత రావుల చంద్రశేఖర్‌రెడ్డి, సీపీఐ నేతలు చాడ వెంకటరెడ్డి, సుధాకర్‌రెడ్డి, బీజేపీ నేత మోహన్‌రెడ్డి, సీపీఎం నేత డీజీ నర్సింహారావు, న్యూడెమోక్రసీ నేతలు రంగారావు, కె.గోవర్ధన్, కె.రమా, వనం సుధాకర్ పాల్గొన్నారు.

# నవ్వులు నాటిన ‘నైరుతి’!

▶ మొదటి పేజీ తరువాయి

వర్షపాతం నమోదైతే, జూలైలో 12 శాతం లోటు రికార్డయింది. ఇక ఆగస్టులో వర్షాలు ఊపందుకున్నాయి. ఆ నెలలో 11 శాతం అధిక వర్షపాతం నమోదు కాగా, సెప్టెంబర్‌లో రికార్డు స్థాయిలో ఏకంగా 83 శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఇక రాష్ట్రంలో మొత్తం 589 మండలాలుంటే, ఈ సీజన్‌లో ఇప్పటివరకు 359 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. 122 మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. జిల్లాల వారీగా చూస్తే కొమురంభీం, నిజామాబాద్, వరంగల్ అర్బన్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, మహబూబ్‌నగర్, ములుగు, నారాయణపేట జిల్లాలో అధిక వర్షపాతం నమోదైంది. మిగిలిన జిల్లాల్లో సాధారణ వర్షం కురిసింది.

**దేశంలో కూడా రికార్డు**

దేశవ్యాప్తంగా కూడా ఈ సీజన్లో అధిక వర్షపాతం నమోదైంది. మొత్తంగా 10 శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఇక్కడ వందేళ్ల రికార్డు దేశంలో ఒకటి నమోదైంది. సరిగ్గా వందేళ్ల క్రితం అంటే 1917 సెప్టెంబర్ నెలలో దేశవ్యాప్తంగా 165 శాతం వర్షపాతం నమోదైతే, మళ్లీ ఈ ఏడాది సెప్టెంబర్‌లో 152 శాతం వర్షపాతం నమోదైంది. వందేళ్ల తర్వాత ఆ స్థాయిలో వర్షపాతం నమోదు కావడం గమనార్హం.

**గణనీయంగా ఖరీఫ్ సాగు..**

నైరుతి రుతుపవనాలు తెచ్చిన భారీ వర్షాలతో ఈ ఏడాది ఖరీఫ్‌లో పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా నమోదైంది. ఖరీఫ్‌లో అన్ని పంటల సాధారణ సాగు విస్తీర్ణం 1.08 కోట్ల ఎకరాలు కాగా... ఇప్పటివరకు ఏకంగా 1.10 కోట్ల ఎకరాల్లో (102 శాతం) పంటలు సాగయ్యాయి. అందులో వరి సాధారణ సాగు విస్తీర్ణం 24.11 లక్షల ఎకరాలు కాగా, రికార్డు స్థాయిలో 31.47 లక్షల ఎకరాల్లో (131 శాతం) నాట్లు పడ్డాయి. ఇక పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 43.12 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు ఏకంగా 46.48 లక్షల ఎకరాల్లో (108 శాతం) సాగైంది. పప్పు ధాన్యాల సాగు సాధారణ విస్తీర్ణం 10.37 లక్షల ఎకరాలు కాగా... 9.42 లక్షల (91 శాతం) ఎకరాల్లో సాగైంది. రాష్ట్రంలో అత్యధికంగా మంచిర్యాల జిల్లాలో 128 శాతం, నారాయణపేట జిల్లాలో 122 శాతం పంటల సాగు నమోదైంది. అతి తక్కువగా జనగామ 83 శాతం, మెదక్, రంగారెడ్డి జిల్లాల్లో 86 శాతం పంటలు సాగయ్యాయి. ఇక రబీ సాగుకు కూడా ఈ వర్షాలు దోహదం చేశాయి. జలాశయాలు, చెరువులు, కుంటలు, వాగులు పొంగి పొర్లడంతో రబీలో అంచనాలకు మించి పంటల సాగు నమోదవుతుందని వ్యవసాయశాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

**రాష్ట్రంలో గత పదేళ్లలో నమోదైన వర్షపాతం**

| ఏడాది | సాధారణంతో పోలిస్తే |
|---|---|
| 2009 | -35 శాతం |
| 2010 | 32 శాతం |
| 2011 | -13 శాతం |
| 2012 | 4 శాతం |
| 2013 | 26 శాతం |
| 2014 | -34 శాతం |
| 2015 | -21 శాతం |
| 2016 | 19 శాతం |
| 2017 | -13 శాతం |
| 2018 | -2 శాతం |
| 2019 | 6 శాతం |

**ఈశాన్య రుతుపవనాల ప్రవేశం..**

ఈశాన్య రుతుపవనాలు బుధవారం రాష్ట్రంలోకి ప్రవేశించాయి. తమిళనాడు దాన్ని ఆనుకుని ఉన్న ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ ప్రాంతాల్లో ఈశాన్య రుతుపవన వర్షాలు ప్రారంభమయ్యాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దక్షిణ తమిళనాడు తీరానికి దగ్గరలో ఉన్న నైరుతి బంగాళాఖాతం నుండి పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకు ఉపరితల ద్రోణి ఏర్పడింది. ఈ ప్రభావంతో గురువారం అనేక చోట్ల ఉరుములు, మెరుపులతో పాటు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అలాగే ఒకట్రెండు చోట్ల భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. శుక్రవారం కొన్నిచోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సీనియర్ అధికారి రాజారావు వెల్లడించారు. ఇక గత 24 గంటల్లో మహబూబాబాద్‌లో 5 సెంటీమీటర్ల అధిక వర్షపాతం నమోదైంది.

# ‘కరెంట్’ కొలువులొచ్చేశాయి..

- 3,025 పోస్టుల భర్తీకి టీఎస్ఎస్పీడీసీఎల్ ప్రకటన జారీ
- 2,500 జూనియర్ లైన్‌మెన్, 25 జూనియర్ పర్సనల్ ఆఫీసర్..
- 500 జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు

**సాక్షి, హైదరాబాద్:** దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్) 2,500 జూనియర్ లైన్‌మెన్, 25 జూనియర్ పర్సనల్ ఆఫీసర్, 500 జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు కలిపి మొత్తం 3,025 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేసింది. సంస్థ వెబ్‌సైట్లు https://www.tssouthernpower.com లేదా https://tssouthernpower.cgg.gov.inలో ఈ నోటిఫికేషన్లను పొందుపరిచింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనుంది. కొత్త జిల్లాల ప్రాతిపదికన పోస్టుల భర్తీని చేపట్టింది. జిల్లా, రిజర్వేషన్ కేటగిరీల వారీగా ఖాళీల వివరాలను నోటిఫికేషన్‌లో చూడొచ్చు.

**అర్హత వివరాలు..**

- ➡ జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్, జూనియర్ పర్సనల్ ఆఫీసర్ పోస్టులకు బీఏ/బీకాం/బీఎస్సీ లేదా తత్సమాన విద్యార్హతతో పాటు 18–34 ఏళ్ల వయసు కలిగి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 5 ఏళ్లు, శారీరక వికలాంగులకు 10 ఏళ్ల వయోపరిమితి మినహాయింపు.
- ➡ జూనియర్ లైన్‌మెన్ పోస్టులకు 18–35 ఏళ్ల వయసుతో పాటు పదో తరగతితో పాటు ఎలక్ట్రికల్/వైర్‌మెన్ ట్రేడ్‌లో ఐటీఐ లేదా ఎలక్ట్రికల్ ట్రేడ్‌లో ఇంటర్మీడియట్ వొకేషనల్ కోర్సు పూర్తి చేసి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 5 ఏళ్ల వయోపరిమితి మినహాయింపు.



**ముఖ్య తేదీలు..**

**జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్**

| | |
|---|---|
| ఫీజుల చెల్లింపు ప్రారంభ తేదీ: | 30.10.2019 |
| దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం: | 31.10.2019 |
| ఫీజుల చెల్లింపునకు చివరి తేదీ: | 20.11.2019 (సాయంత్రం 5 వరకు) |
| ఆన్‌లైన్ దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ: | 20.11.2019 (రాత్రి 11.59 వరకు) |
| హాల్ టికెట్ల డౌన్‌లోడింగ్ ప్రారంభం: | 11.12.2019 |
| పరీక్ష తేదీ: | 22.12.2019 |

**జూనియర్ లైన్‌మెన్, జూనియర్ పర్సనల్ ఆఫీసర్**

| | |
|---|---|
| ఫీజుల చెల్లింపు ప్రారంభ తేదీ: | 21.10.2019 |
| దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం: | 22.10.2019 |
| ఫీజుల చెల్లింపునకు చివరి తేదీ: | 10.11.2019 (సాయంత్రం 5 వరకు) |
| ఆన్‌లైన్ దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ: | 10.11.2019 (రాత్రి 11.59 వరకు) |
| హాల్ టికెట్ల డౌన్‌లోడింగ్ ప్రారంభం: | 05.12.2019 |
| పరీక్ష తేదీ: | 15.12.2019 |



వ్యవసాయ వ్యర్థాలతో తయారు చేసిన ఇటుకలు

# బయో బ్రిక్స్

▶ మొదటి పేజీ తరువాయి

ప్రదర్శించారు. వ్యవసాయ వ్యర్థాల నుంచి బయో ఇటుకలను అభివృద్ధి చేసే ప్రయోగం గత కొంతకాలంగా జరుగుతోందని ఆర్. ప్రియాబ్రతా రౌత్రే చెప్పా రు. మట్టితో తయారుచేసే ఇటుకలను కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యం జరుగుతుందని వివరించారు. ఈ సమస్యను పరిష్కరించడానికి బయో ఇటుకల తయారీకి 1990లో ప్రయోగాలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. భారత్‌లో ఏటా 500 మిలియన్ టన్నులకు పైగా వ్యవసాయ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయని ప్రియాబ్రతా తెలిపారు. ఈ వ్యర్థాల్లో కొంత పశుగ్రాసంగా వాడుతున్నారని, దాదాపు 84 నుంచి 141 మిలియన్ టన్నులు బుడిద అవుతోందని, దీంతో తీవ్ర వాయు కాలుష్యం ఏర్పడుతోందని వివరించారు. వరి వ్యర్థాలు, గోధుమ వ్యర్థాలు (గడ్డి తదితరాలు), చెరుకు పిప్పి, కాటన్ ప్లాంట్ వంటి పొడి వ్యర్థాలన ఉపయోగించి తయారు చేస్తామని తెలిపారు. చెరుకు భాగస్సే (పిప్పి), సున్నం ఆధారిత ముద్ద తయారు చేయడం ద్వారా ఇటుక తయారీలో తొలి ప్రక్రియ అని తెలిపారు. ఈ మిశ్రమాన్ని అచ్చులో పోసి, ఒకట్రెండు రోజులు ఆరబెట్టాలని, ఆ తర్వాత ఇటుకలను 15 నుంచి 20 రోజులు ఆరబెట్టాలని పేర్కొన్నారు. ఆ తర్వాత వీటిని వినియోగించడానికి నెల రోజులు పడుతుందని తెలిపారు. ప్రొఫెసర్ అవిక్‌రాయ్ మాట్లాడుతూ.. బయో ఇటుకలు మట్టి ఇటుకల కన్నా ఎక్కువ కాలం మన్నికగా ఉంటాయని చెప్పారు. కాలిన మట్టి ఇటుకల్లా ఇవి బలంగా ఉండకపోయినా బరువు మోసే నిర్మాణాలకు ఉపయోగించలేమని తెలిపారు. చెక్క లేదా లోహ నిర్మాణాల్లో వాడితే తక్కువ ఖర్చుతో గృహాలు నిర్మించుకోవచ్చని పేర్కొన్నారు. భవనాల్లో తేమను నిరోధిస్తాయని చెప్పారు. మరింత మెరుగైన వాటిని తయారు చేసేందుకు ఇంకా పరిశోధనలు చేస్తామని, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్, పంచాయతీరాజ్ ఇటీవల నిర్వహించిన గ్రామీణ ఇన్నొవేటర్స్ స్టార్ట్ ఆఫ్ కాన్‌క్లేవ్‌లో స్థిరమైన హౌసింగ్ కోసం ఈ బయో బ్రిక్ ప్రత్యేక గుర్తింపు ట్రోఫీని అందుకుందని చెప్పారు.

# గోవు.. గొర్రె.. గేదె..



- 20వ పశుగణన నివేదిక విడుదల చేసిన కేంద్ర పశు సంవర్ధక శాఖ
- తెలంగాణలో గొర్రెలు, ఏపీలో కోళ్ల సంఖ్యలో పెరుగుదల
- ఏపీలో 53% పడిపోయిన గాడిదల సంఖ్య

## తెలుగు రాష్ట్రాల్లో పెరిగిన పశుసంపద

**సాక్షి, న్యూఢిల్లీ:** తెలుగు రాష్ట్రాల్లో గణనీయంగా పశుసంపద పెరిగిందని కేంద్రం వెల్లడించింది. దేశవ్యాప్తంగా 535.78 మిలియన్ల పశు సంపద ఉందని తాజాగా కేంద్ర పశు సంవర్ధక శాఖ విడుదల చేసిన నివేదిక తేల్చింది. 2012లో 19వ పశుగణనతో పోల్చితే ఈ 20వ పశుగణనలో పశుసంపద 4.6% పెరిగిందని వెల్లడైంది. ఇందులో గో సంపద 18% పెరగగా, గొర్రెల సంఖ్య 2012తో పోల్చితే 14.1% పెరిగి 74.26 మిలియన్లకు చేరింది. మేకల సంఖ్య 10.1% పెరిగి 148.88 మిలియన్లకు చేరింది. అశ్వసంపద 45.6% మేర తగ్గి 3.4 లక్షలకు పడిపోయింది. గాడిదల సంఖ్య ఏకంగా 61.23% మేర తగ్గి 1.2 లక్షలకు పడిపోయింది. ఒంటెల సంఖ్య 37.1% తగ్గి 2.5 లక్షలకు పడిపోయింది. కోళ్ల సంఖ్య మాత్రం 16.8% పెరిగి 851.81 మిలియన్లకు చేరింది. ఇందులో దేశీ కోళ్లు (పెరట్లో పెంచేవి) 317.07 మిలియన్లు. వీటి సంఖ్య 45.8% పెరిగింది. వాణిజ్య పౌల్ట్రీ కేవలం 4.5% పెరిగింది.

### ఏపీ, తెలంగాణలో పశు సంపద గణాంకాలు

2012లో తెలంగాణలో పశుసంపద 26.7 మిలియన్ల నుంచి 22.21% మేర పెరిగి 32.6 మిలియన్లకు చేరుకోగా, ఏపీలో 29.4 మిలియన్ల నుంచి ఇప్పుడు 15.79% మేర పెరిగి 34 మిలియన్లకు చేరుకుంది.

కోళ్ల సంఖ్య 2012లో తెలంగాణలో 80.8 మిలియన్లు ఉండగా..ఇప్పుడది 0.93% మేర తగ్గి 80 మిలియన్లకు పడిపోయింది. అయితే ఏపీలో 80.6 మిలియన్లు ఉండగా ఇప్పుడది 33.85% మేర పెరిగి 107.9 మిలియన్లకు చేరుకుంది.

తెలంగాణలో 2012లో 12.8 మిలియన్ల గొర్రెలు ఉండగా ఇప్పుడు ఏకంగా 48.51% పెరిగి వాటి సంఖ్య 19.1 మిలియన్లకు చేరుకుంది. ఇక ఏపీలో గొర్రెల సంఖ్య 2012లో 13.6 మిలియన్లు ఉండగా 30% పెరిగి ఇప్పుడు 17.6 మిలియన్లకు చేరుకుంది.

రాష్ట్రంలో గేదెల సంఖ్య 1.59% మేర పెరిగి 4.2 మిలియన్లకు చేరుకోగా, ఏపీలో 3.76 శాతం మేర తగ్గి 6.2 మిలియన్లకు చేరింది.

గాడిదల సంఖ్య ఏపీలో 2012లో 10 వేలు ఉండగా..53.22% తగ్గి ఇప్పుడు 5 వేల గాడిదలు మాత్రమే ఉన్నాయి.

## జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్‌గా శశిధర్‌రెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని పలువురు న్యాయాధికారులను బదిలీ చేస్తూ హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. తెలంగాణ జ్యూడీషియల్ అకాడమీ డైరెక్టర్‌గా శశిధర్‌రెడ్డిని నియమించింది. అక్కడ పనిచేస్తున్న సుజనను సిటీ స్మాల్ కాజెస్ కోర్టు చీఫ్ జడ్జిగా, సిటీ స్మాల్ కాజెస్ కోర్టు చీఫ్ జడ్జిగా ఉన్న రమేశ్‌ను నల్లగొండ ప్రిన్సిపల్ జడ్జిగా నియమించింది.






## నేల తల్లి నుదుట పచ్చని బొట్టు

వర్షాలు సమృద్ధిగా కురవడంతో రైతులు పంటల సాగుకు ఉపక్రమించారు. కొన్ని ప్రాంతాల్లో వరి నాట్లు పూర్తయ్యాయి. మరికొన్ని ప్రాంతాల్లో పంటలు చేతికి వస్తుండగా.. ఇంకొన్ని ఏరియాల్లో చివరి దశకు చేరుకున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం కొండపేట గ్రామ పంచాయతీ పరిధి కుంభంపల్లిలో సాగు చేసిన వరి పైరు భూమికి పచ్చని రంగేసినట్టుగా కనిపిస్తూ చూపరులను ఆకర్షిస్తోంది. ఈసారి వరిసాగు ఆశాజనకంగా ఉందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– మల్హార్



## రాసముద్రానికి జలకళ

మిషన్ కాకతీయ పథకంలో భాగంగా సీఎం కేసీఆర్ స్వయంగా వచ్చి పూడిక తీసిన నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామంలోని రాసముద్రం చెరువు నీటితో నిండి బుధవారం తెల్లవారు జాము నుంచి అలుగు పోస్తోంది. కాకతీయుల కాలంలో నిర్మించిన ఈ చెరువులో 2015 ఏప్రిల్ 26న సీఎం స్వయంగా పూడికతీత పనులను ప్రారంభించారు. ఈ చెరువు 415 ఎకరాల్లో లోతట్టు శిఖం భూమి కలిగి ఉంది. చెరువు దిగువన 315 ఎకరాల్లో ఆయకట్టు కలిగి ఉంది. ఇటీవల భారీ వర్షాలు కురవడం, ఎమ్మార్పీ కాల్వ నుంచి నీరు ఎగువన చెరువులు, కుంటల్లోకి రావడంతో దిగువన ఉన్న చందుపట్ల రాసముద్రం పూర్తిగా నిండి పొంగి పొర్లుతోంది.

## క్లుప్తంగా...

### ఉరేసుకుంటానంటూ రైతు హల్‌చల్

**భూమి ఇతరులకు మార్చారని నిరసన**

**నర్సింహులపేట:** రెవెన్యూ అధికారులు తన ప్రమేయం లేకుండానే భూమిని ఇతరుల పేరున మార్చారని, తనకు న్యాయం చేయాలంటూ మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం పడమటిగూడెంకు చెందిన రైతు బుద్ద భిక్షం బుధవారం తహసీల్ కార్యాలయం భవనం మొదటి అంతస్తు ఎక్కాడు. పక్కనే ఉన్న చెట్టుకు తాడు కట్టి ఉరి వేసుకుంటానంటూ హల్‌చల్ సృష్టించాడు. 1103 సర్వే నంబర్‌లోని 11.33 ఎకరాల తన భూమిని దాసరోజు సోమ నర్సయ్య పేరున మార్చారని, న్యాయం చేయాలని కోరితే తహసీల్దార్ ఇబ్బంది పెడుతున్నాడని వాపోయాడు. రెండు గంటల పాటు భవనం పైనే ఉన్నాడు. పోలీసులు ఆర్‌డీఓ ఈశ్వరయ్యతో ఫోన్‌లో మాట్లాడించారు. ఆయన హామీ ఇవ్వడంతో రైతు కిందకు దిగివచ్చాడు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఆ సర్వే నంబర్‌ను హోల్డ్‌లో పెట్టామని, జేసీ కార్యాలయంలో రైతు దరఖాస్తు చేసుకోగానే విచారణ జరిపి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

### తాగి బస్సు నడిపిన డ్రైవర్

- కారును ఢీకొట్టిన వైనం
- డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు

**కామారెడ్డి టౌన్:** మద్యం సేవించి ఆర్టీసీ బస్సును నడిపిన డ్రైవర్.. ఓ కారును ఢీకొట్టాడు. దీంతో స్థానికులు అతడికి దేహశుద్ధి చేశారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రామునిపేటకు చెందిన నరేశ్ సిద్దిపేట ఆర్టీసీ డిపోలో ఇటీవల తాత్కాలిక డ్రైవర్‌గా నియమితుడయ్యాడు. బుధవారం సిద్దిపేట నుంచి కామారెడ్డికి బస్సును నడుపుకుంటూ వచ్చాడు. సాయంత్రం కామారెడ్డి డిపో ముందు గల బార్‌లో మద్యం సేవించి, మళ్లీ సిద్దిపేటకు బస్సు తీసుకుని బయలుదేరాడు. పాతబస్టాండ్‌లోని ఇందిరా చౌక్ వద్ద ఓ కారును ఢీకొట్టాడు. ఈ క్రమంలో కారు యాజమానికి, బస్సు డ్రైవర్‌కు వాగ్వాదం జరిగింది. డ్రైవర్ తాగి డ్రైవింగ్ చేస్తున్నాడని గుర్తించిన స్థానికులు నరేశ్‌ను చితకబాదారు. అనంతరం పట్టణ పోలీసులకు అప్పగించారు. డ్రైవర్ నరేశ్‌పై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసును నమోదు చేశారు.

### మద్దిలేటి, కృష్ణకు రిమాండ్

**గద్వాల క్రైం:** మావోయిస్టులతో సంబంధాలు కలిగి ఉండటంతోపాటు, యువతను చట్టవ్యతిరేక పనులకు ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలపై అరెస్టు చేసిన టీవీవీ రాష్ట్ర అధ్యక్షుడు మద్దిలేటి, టీపీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నలమాస కృష్ణను రిమాండ్‌కు తరలించినట్లు గద్వాల ఇన్‌చార్జ్ ఎస్పీ అపూర్వరావు తెలిపారు. బుధవారం ఆమె గద్వాల పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యవహారంలో త్వరలో మరికొందరిని అరెస్టు చేస్తామని తెలిపారు. మద్దిలేటి, కృష్ణను మంగళవారం పోలీసులు హైదరాబాద్‌లో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. బుధవారం వీరిని గద్వాల కోర్టులో హాజరపరచగా రిమాండ్ విధించారు.

**అజ్ఞాతంలో మరో ఇద్దరు..**

జోగుళాంబ గద్వాలజిల్లా మల్దకల్ మండలం కుర్తిరావుల్‌చెర్వు గ్రామానికి చెందిన హరిజన భవాని, నారాయణపేట జిల్లా మక్తల్‌కు చెందిన ఉత్తిని అనిల్‌కుమార్ 2018 సెప్టెంబర్ నుంచి అజ్ఞాతంలోకి వెళ్లినట్లు ఎస్పీ వివరించారు. వీరు టీవీవీ ఆధ్వర్యంలో నిషేధిత మావోయిస్టు పార్టీకి సాయం అందిస్తూ, నిధులు సేకరిస్తున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు.

# 880 కోట్ల ఆదాయం

▶ మొదటి పేజీ తరువాయి

లెక్కల ప్రకారం 44 వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. బుధవారం ఒక్కరోజే 20 వేలకు పైగా దరఖాస్తులు సమర్పించారు. ఎక్సైజ్ డీసీ కార్యాలయాలు కిక్కిరిసిపోవడంతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి మరీ దరఖాస్తులు స్వీకరించాల్సి వచ్చింది. దీంతో అర్ధరాత్రి వరకు ఎక్సైజ్ అధికారులు ఈ టెండర్ల స్వీకరణ, పరిశీలనలో బిజీ అయిపోయారు. కేవలం దరఖాస్తుల ద్వారానే సర్కారుకు ఏకంగా రూ.880 కోట్లకు పైగా ఆదాయం కేవలం టెండర్ ఫీజు రూపంలోనే వచ్చింది. 2017లో 2,216 దుకాణాలకు టెండర్లు పిలవగా 41 వేలకు పైగా దరఖాస్తులు రాగా, ప్రభుత్వానికి రూ.410 కోట్ల ఆదాయం వచ్చింది. ఇప్పుడు కూడా షాపుల సంఖ్య పెరగక పోయినా దరఖాస్తులు ఎక్కువగా రావడంతో గతేడాది కన్నా రూ.470 కోట్లకు పైగా అదనపు ఆదాయం సమకూరనుంది.

**వరంగల్‌లో అత్యధికం..**

బుధవారం అర్ధరాత్రి 12 గంటల వరకు అందిన సమాచారం మేరకు. హైదరాబాద్ జిల్లాలో 173 మద్యం దుకాణాలకు గాను 1,319 దరఖాస్తులు వచ్చాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అధిక దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 261 దుకాణాలకు గాను, 7,534 దరఖాస్తులు వచ్చాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 278 దుకాణాలకు 6,963 దరఖాస్తులు వచ్చాయి. సూర్యాపేట జిల్లాలో సరాసరి ఒక్కో దుకాణానికి 30కి పైగా దరఖాస్తులు వచ్చాయి. సిద్దిపేట జిల్లాలో 70 దుకాణాలకు వెయ్యికి పైగా దరఖాస్తులు వచ్చాయి. వరంగల్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్, ఖమ్మం, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లోనూ ఆశావహుల పోటాపోటీగా దరఖాస్తులు సమర్పించారు. అయితే అధికారికంగా ఈ దరఖాస్తుల సంఖ్యపై ఇంకా ఎలాంటి అధికారిక సమాచారం అందలేదు.

**సరిహద్దులు దాటి..**

లిక్కర్ దందాపై ఏపీ ప్రభుత్వం నియంత్రణ విధించడంతో అక్కడి వ్యాపారులు తెలంగాణ బాట పట్టారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, గద్వాల, నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లోని షాపులపై కన్నేసిన పొరుగు రాష్ట్ర వ్యాపారులు భారీ సంఖ్యలో దరఖాస్తులు సమర్పించారు. ఊహించనిరీతిలో ఏపీ వ్యాపారులు తరలిరావడం.. పోటాపోటీగా దరఖాస్తులు సమర్పించడంతో ఏపీ, తెలంగాణ వ్యాపారుల మధ్య కొన్నిచోట్ల వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి. నాగోల్‌లో తోపులాట జరగడంతో పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితి చక్కదిద్దారు. రాజేంద్రనగర్, శంషాబాద్, శేరిలింగంపల్లి, ఎల్బీనగర్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మణికొండ తదితర ప్రాంతాల్లోని వైన్స్ షాపులకు భారీగా దరఖాస్తులు చేశారు. ఒకటే దరఖాస్తు సమర్పించాలనే నిబంధన ఉన్నా.. సిండికేట్‌గా మారి షాపులను కైవసం చేసుకునే ఎత్తుగడ వేశారు. మైలవరం, అనంతపూర్ (పట్టణ), గుంటూరు, సత్తెనపల్లి, మాచర్ల, కర్నూలు, విజయవాడ, నంద్యాల తదితర ప్రాంతాల వ్యాపారులు గ్రేటర్ శివార్లలోనే ఏకంగా 200 పైచిలుకు దరఖాస్తులు సమర్పించారంటే పరిస్థితి అంచనా వేసుకోవచ్చు.

**44 దరఖాస్తులు వేసిన లిక్కర్ డాన్**

మెదక్ జిల్లా హవేళిఘణపూర్ మండల పరిధిలోని సర్దన గ్రామానికి చెందిన జీకేఆర్ సంస్థల అధినేత సూరజ్ (లిక్కర్‌డాన్) ఏకంగా 3 షాపులకు గాను 44 దరఖాస్తులు వేశాడు. గతేడాది 22 దరఖాస్తులు చేసిన సూరజ్ లాటరీ పద్ధతిలో 3 దుకాణాలను దక్కించుకున్నాడు. విపరీతమైన పోటీ పెరగడంతో ఏకంగా 44 దరఖాస్తులు చేసుకున్నాడు. ఇందులో మెదక్‌లో 2 దుకాణాలు, పాపన్నపేట మండలం ఏడు పాయల దుకాణానికి ఏకంగా 44 దరఖాస్తులు వేశాడు.

**15 ఏళ్లుగా ఇదే వ్యాపారం**

**సాయికృష్ణ, మైలవరం**

'కృష్ణా జిల్లా మైలవరంలో గత 15 సంవత్సరాలుగా లిక్కర్‌షాపు నిర్వహిస్తున్నాను. మా రాష్ట్రంలో వైన్స్‌షాపులను ప్రభుత్వమే నిర్వహిస్తుండటంతో అనివార్యంగా ఇక్కడకు వచ్చాం. స్నేహితులు, బంధువులు కలిసి శంషాబాద్ యూనిట్ పరిధిలోని మణికొండ, రాజేంద్రనగర్, శంషాబాద్‌లోని దుకాణాలకు దరఖాస్తులు చేశాం. ఇక్కడ వ్యాపారం అనువుగా ఉండడమేగాకుండా.. గతంలో ఇక్కడ వ్యాపారం చేసిన అనుభవం ఉండడంతో మళ్లీ రావడానికి దారితీసింది.'

**వంద దరఖాస్తులు వేశాం**

**వెంకట్‌రావు ,అనంతపురం అర్బన్**

'1989 నుంచి మాది ఇదే వ్యాపారం. ఎక్కడైనా వ్యాపారమే కదా అని ఇక్కడకు వచ్చాం. మిత్రులు, కుటుంబసభ్యులు, బంధువుల పేరిట దరఖాస్తులు చేశాం'.



**ఉమ్మడి జిల్లాల వారీగా దాఖలైన మద్యం దరఖాస్తుల వివరాలు**

దరఖాస్తు గణాంకాలివీ..

- నోటిఫికేషన్ విడుదల చేసిన షాపుల సంఖ్య– 2,216
- వచ్చిన మొత్తం దరఖాస్తుల సంఖ్య– 44 వేలకు పైగా
- చివరి రోజు వచ్చిన దరఖాస్తుల సంఖ్య– 21,966
- టెండర్ ఫీజుల ద్వారా సర్కారుకు వచ్చిన ఆదాయం– రూ.880 కోట్లకు పైగా
- రెండేళ్ల క్రితం వచ్చిన ఆదాయం– రూ.410 కోట్లు
- అత్యధిక దరఖాస్తులు వచ్చిన జిల్లా– వరంగల్

| జిల్లా | షాపుల సంఖ్య | దరఖాస్తులు |
|---|---|---|
| ఆదిలాబాద్ | 163 | 2,803 |
| హైదరాబాద్ | 173 | 1,319 |
| కరీంనగర్ | 266 | 3,381 |
| ఖమ్మం | 165 | 7,024 |
| మహబూబ్‌నగర్ | 164 | 3,351 |
| మెదక్ | 193 | 2963 |
| నల్లగొండ | 278 | 6963 |
| నిజామాబాద్ | 131 | 1450 |
| రంగారెడ్డి | 422 | 6117 |
| వరంగల్ | 261 | 7534 |
| మొత్తం | 2,216 | 42,905 |

### హుజూర్‌నగర్ టీఆర్‌ఎస్‌దే: ఎర్రబెల్లి

**వరంగల్ రూరల్:** హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో టీఆర్‌ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి విజయం ఖాయమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే వార్ వన్‌సైడ్ అన్నట్టు ఎన్నిక ఏకపక్షం అవుతుందని చెప్పారు. టీఆర్‌ఎస్ అభ్యర్థి 20 వేలకు పైగా మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. తనకు హుజూర్‌నగర్‌పై పట్టు ఉండటంతోనే ఈ విషయాన్ని చెబుతున్నానని పేర్కొన్నారు. కాగా, హుజూర్‌నగర్ ఉప ఎన్నికపై ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె ప్రభావం ఉండదని మంత్రి స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికులందరూ తమ వైపే ఉన్నారని, కొందరు రాజకీయ పార్టీల నాయకులు తమ ప్రచారం కోసం ఆర్టీసీ కార్మికుల గురించి మాట్లాడుతున్నారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ కుటుంబ పెద్దలాంటి వారని.. ఈ సమస్యను పరిష్కరిస్తారన్నారు.

## సీఎం ఫాంహౌస్‌లో హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్య

**సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఘాతుకం**

**గజ్వేల్:** సీఎం కేసీఆర్ ఫాంహౌస్‌లో సెక్యూరిటీ ఇన్‌చార్జిగా విధులు నిర్వర్తిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు ఆత్మహత్య చేసుకున్నాడు. తన సర్వీస్ రివాల్వర్‌తో బుధవారం ఉదయం తల కణతికి కాల్చుకుని ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని సీఎం ఫాంహౌజ్‌లో భద్రత కోసం ఓ రిజర్వ్‌డ్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు రిజర్వ్‌డ్ ఎస్‌ఐల పర్యవేక్షణలో 50 మందికి పైగా పోలీస్ సిబ్బంది విధులు నిర్వహిస్తుంటారు. యాదాద్రి జిల్లా మూటకొండూరు మండలం ముత్తిరెడ్డిగూడెంకు చెందిన 12వ బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ ఎ.వెంకటేశ్వర్లు (పీసీ నంబర్ 1136) ఈ నెల 1న విధుల్లో చేరాడు. 14న ఇంటికి వెళ్లిన వెంకటేశ్వర్లు 15న తిరిగి విధుల్లో చేరాడు. అయితే బుధవారం ఉదయం టిఫిన్ చేసి సిబ్బందికి డ్యూటీలు వేశాక తన విశ్రాంతి గదిలో ఉదయం 10:30 గంటల ప్రాంతంలో సర్వీస్ కార్బన్ తుపాకీతో కుడి కణతపై కాల్చుకున్నాడు. దీంతో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మరణించాడు.

**మద్యానికి బానిసై..**

ఆస్పత్రికి వచ్చిన గజ్వేల్ ఏసీపీ నారాయణ, గజ్వేల్ రూరల్ సీఐ శివలింగం వివరాలు అడిగి నమోదు చేసుకున్నారు. వెంకటేశ్వర్లు విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించే వాడని ఏసీపీ నారాయణ తెలిపారు. డ్యూటీలో ఉండగానే మద్యం తాగేవాడని చెప్పారు. దీంతో కొద్ది రోజుల కింద నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రిలోని డీ ఎడిక్షన్ క్యాంపులో 45 రోజులు ఉన్నట్లు పేర్కొన్నారు. చికిత్స పూర్తయిన తర్వాత విధుల్లో చేరుతున్నట్లు గత నెల 29న రిపోర్ట్ చేశాడని, ఆ తర్వాత రెండ్రోజులు పోలీస్ అకాడమీలో విధులు నిర్వహించాడని చెప్పారు. అక్టోబర్ 1నుంచి సీఎం ఫాంహౌజ్‌లో విధుల్లో చేరాడని పేర్కొన్నారు. ఈ నెల 14న అనుమతి లేకుండానే బయటికి వెళ్లిపోయాడని తెలిపారు. తిరిగి 15న అతడి భార్య శోభతో కలసి వచ్చి సక్రమంగా డ్యూటీ చేస్తానని చెప్పడంతో పాటు ఆయన భార్య కూడా హామీ ఇవ్వడంతో విధుల్లోకి తిరిగి చేర్చుకున్నట్లు వెల్లడిం చారు. డ్యూటీ దగ్గర ఒకరితో ఇబ్బంది పడుతూ ఉండేవాడినని తరచూ చెప్పే వాడని మృతుడి భార్య శోభ ఆరోపించింది. కాగా, నిజానిజాలను తెలుసుకునేందుకు పోలీసులు విచారణ జరుపుతున్నారు.



### ఆగిన రైతు గుండె

**రెండేళ్లుగా అందని పాసుపుస్తకం**

**కోహీర్:** పట్టాదారు పాసు పుస్తకం కోసం వచ్చిన ఓ గిరిజన రైతు గుండె ఆగి మృతి చెందాడు. సంగారెడ్డి జిల్లా కోహీర్ తహసీల్ కార్యాలయం ఎదుట బుధవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. మండలంలోని మనియార్‌పల్లి మాణిక్యానాయక్ తండా నివాసి తుల్జానాయక్(72) గ్రామ శివారులోని సర్వేనంబర్ 41లో 5 ఎకరాల అసైన్డ్ భూమిని సాగు చేసుకొని జీవిస్తున్నాడు. భూరికార్డుల ప్రక్షాళనలో భాగంగా కొత్త పాసుపుస్తకం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. రెండేళ్లుగా పాసుపుస్తకం కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాడు. అయినా ఇంత వరకు పట్టాదారు పాసు పుస్తకం రాలేదు. పాసు పుస్తకం రాకపోవడంతో రైతుబంధు పథకం వర్తించకుండా పోయింది. బ్యాంకుల నుంచి రుణం సైతం లభించడం లేదు. ఎప్పటిలాగే పాసు పుస్తకం కోసం బుధవారం తహసీల్ కార్యాలయానికి వచ్చిన తుల్జానాయక్ తీవ్ర మనస్తాపానికి గురై ఛాతిలో నొప్పి వస్తోందని చెప్పి పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు.

తెలంగాణ ప్రభుత్వం
ప్రజారోగ్యం మరియు మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
NIT No. 38/Gajwel/TUFIDC/Unit-II/Development of Rajiv Park/2019-20 తేది:17.10.2019
పని పేరు: గజ్వేల్ నగర పంచాయతి – TUFIDC రుణ సహాయం క్రింద గజ్వేల్ నగర పంచాయతీలో రాజీవ్‌పార్క్ అభివృద్ధి. అంచనా కాంట్రాక్ట్ విలువ: రూ. 73,77,655.00. బిడ్ దాఖలు ముగింపు తేది: 24.10.2019 సా. 4.30 గం. తదుపరి వివరాలను 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ @ www.tender.telangana.gov.in లో చూడవచ్చును. సెల్ నం.: 9701385146
సం/– సూపరింటెండింగ్ ఇంజినీర్ (PH), TUFIDC, UNIT-II (FAC)
DIPR RO. No.1390-DP/CL/ADVT/1/2019-20, Dt: 16.10.2019

Dr. NTR UNIVERSITY OF HEALTH SCIENCES: A.P: VIJAYAWADA-8.
NOTIFICATION
The candidates who figured in the provisional list of applied candidates which was displayed in University website on 16.10.2019, are directed to attend the verification of original certificates for Admission into M.Sc., (N) and MPT Courses for the Academic Year 2019-20 in the State of Andhra Pradesh on 24.10.2019 and 25.10.2019 at Dr. NTR UHS, Vijayawada.
The detailed schedule, provisional list of applied candidates, procedure for verification of certificates and other details are available in the website of http://ntruhs.ap.nic.in and http://appgparamed.apntruhs.in
Dated: 16.10.2019
Sd/- REGISTRAR (FAC)

ANDHRA PRADESH STATE SKILL DEVELOPMENT CORPORATION (APSSDC)
Andhra Pradesh State Skill Development Corporation (APSSDC) invites RFP for Selection of Vendor to supply S7-1200 PLC Kits and Trainers to Siemens centers running under Andhra Pradesh State Skill Development Corporation (APSSDC).
For further details please look into: apeprocurement.gov.in and apssdc.in website. Any further updates will be posted in www.apssdc.in
MD & CEO, APSSDC,
Vijayawada
Dipr Ro.No.-182 PP/CL/ADVT/1/1/2019-20 Dt.16.10.2019

### బస్సు ఢీకొని మహిళ మృతి

**నిజామాబాద్ అర్బన్:** నగరంలోని ఎల్లమ్మగుట్టకు చెందిన హబీబా బేగం (45) ఇంటి నుంచి మార్కెట్ వైపు నడుచుకుంటూ వెళ్తోంది. అదే సమయంలో ఆర్టీసీ అద్దె బస్సు నందిపేట నుంచి నిజామాబాద్ వైపు వస్తోంది. ఎన్టీఆర్ చౌరస్తా వద్ద వెనుక నుంచి హబీబాను ఢీకొట్టడంతోఆమె అక్కడికక్కడే మరణించింది. కేసు దర్యాప్తులో ఉంది.

Infrastructure Corporation of Andhra Pradesh Ltd.
(Under the Control of Department of Industries, Infrastructure, Investment & Commerce)
GOVERNMENT OF ANDHRA PRADESH
Request for Proposal for Selection of Chartered Accountant Firm or LLP for conducting special audits / forensic audit for PPP Port(s) in the State of Andhra Pradesh
RFP Notice No. INCAP/P/Audit of PPP Ports/CA/17/2019 Dt. 17-10-2019
Infrastructure Corporation of Andhra Pradesh (INCAP) under the control of Department of Industries, Investment, Infrastructure & Commerce, Government of Andhra Pradesh Invites bids from RFP from interested Chartered Accountant Firm(s) or LLP for conducting special audits/forensic audit for PPP Port(s) in the State of Andhra Pradesh.
This RFP document can be downloaded from the website - www.incap.co.in interested Agencies are required to submit their proposals as per the schedule indicated below. Applicants may please note that all other details including any date extensions, clarifications, amendments, corrigendum etc., will be uploaded only on the above website and will not be published in News Papers.
Schedule :

| | |
|---|---|
| Availability of RFP document on website | 10.00 AM, 17-10-2019 (Thursday) |
| Last date and time for submission of bids | 3.00 PM, 24-10-2019 (Thursday) |
| Date & time for opening of bids | 4.00 PM, 24-10-2019 (Thursday) |

Contact :
General Manager (Technical), INCAP
O/o Infrastructure Corporation of Andhra Pradesh, A Block, I Floor, Sri Anjaneya Towers, Ibrahimpatnam - 521456.
Email : incap@incap.co.in, Mobile : 9440358973.
DIPR RO.No.181PP/CL/Advt/1/1/2019-20, Dt.16-10-2019
Sd/- General Manager (Technical), INCAP

# మరో మూడు ఎత్తిపోతలు

- కాళేశ్వర బ్యారేజీలపై మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లల కింద మూడు లిఫ్టులతో 79,470 ఎకరాల కొత్త ఆయకట్టు
- మరో 52వేల ఎకరాల స్థిరీకరణ
- చెన్నూర్ నియోజకవర్గానికి లబ్ధి..ఇంజనీర్లతో బాల్కసుమన్ చర్చలు

సాక్షి, హైదరాబాద్

కాళేశ్వరం ద్వారా ఒడిసిపట్టుకున్న గోదావరి నదీ జలాల సమర్ధ వినియోగం లక్ష్యంగా ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపట్టింది.ఇందులో భాగంగా కాళేశ్వరంలో నిర్మించిన మేడిగడ్డ (లక్ష్మి), అన్నారం (సరస్వతి), సుందిళ్ల (పార్వతి) బ్యారేజీల బ్యాక్‌వాటర్ జలాలపై ఆధారపడి మూడు ఎత్తిపోతల పథకాలను చేపట్టాలని నిర్ణయించింది. వీటి ద్వారా చెన్నూరు నియోజకవర్గంలోని 79వేల ఎకరాల కొత్తఆయకట్టుకు నీరందించాలని నిర్ణయించింది. ఈ ప్రతిపాదనలపై బుధవారం ప్రభుత్వ విప్ బాల్క సుమన్ నీటి పారుదల శాఖ అధికారులతో చర్చించారు.

**మరింత లబ్ధి..మరింత ఆయకట్టు..**

కాళేశ్వరంలో భాగంగా ఇప్పటికే నిర్మించిన బ్యారేజీలపై లిఫ్టులను ఏర్పాటు చేసి సమీప నియోజకవర్గాల్లో నీరందని ఆయకట్టుకు సాగు జలాలు పారించాలని సీఎం కేసీఆర్ గతంలోనే నిర్ణయించారు.దీనికి అనుగుణంగా ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. దీనిలో భాగంగా ఒక్కో బ్యారేజీ ఫోర్‌షోర్‌నుంచి ఒక్కో లిఫ్టును ప్రతిపాదించారు. ప్రాణహిత నదీ జలాలను మేడిగడ్డ బ్యారేజీ బ్యాక్‌వాటర్స్ నుంచి తీసుకునేలా మొదటి లిఫ్టును ఏర్పాటు చేయనున్నారు. దీని వేమునిపల్లి మండల పరిధిలోని మెంచపల్లి వద్ద ఏర్పాటు చేయనున్న ఈ లిఫ్టు ద్వారా 18,800 ఎకరాల ఆయకట్టుకు నీరందించేలా రూపొందించారు. రెండో లిఫ్టును అన్నారం ఫోర్‌షోర్‌లో ప్రతిపాదించగా, మద్దికల్ చెరువుకు నీటిని తరలించనున్నారు. దీనిద్వారా చెన్నూరు మండలంలో 17,895 ఎకరాల కొత్త ఆయకట్టు, 20,907 ఎకరాల స్థిరీకరణతో పాటు, కోటపల్లి మండలంలో 13,357 ఎకరాల కొత్తది, 9,584 ఎకరాల స్థిరీకరణ జరగనుంది. మొత్తంగా 61,743 ఎకరాలకు లబ్ధి చేకూర్చేలా దీన్ని డిజైన్ చేశారు.ఇక సుందిళ్ల వద్ద మరో లిఫ్టును ఏర్పాటు చేసి 31కి.మీ.ల దూరంలోని లింగాపూర్ చెరువుకు నీటిని తర లించనున్నారు. దీనిద్వారా జైపూర్ మండలంలో కొత్తది, స్థిరీకరణ కలిపి 26,436 ఎకరాలు, భీమవరం మండలంలో 12,901 ఎకరాలు, మందమర్రి మండలంలో 11,960 ఎకరాలకు నీరందనుంది. మొత్తంగా 51,297 ఎకరాలకు లబ్ధి చేకూరనుంది. మూడు లిఫ్టుల ద్వా రా 79,470 ఎకరాల కొత్త ఆయకట్టు, 52,370 ఎకరాల స్థిరీకరణ కలిపి మొత్తంగా 1,31,840 ఎకరాల ఆయకట్టుకు నీరందించేలా వీటిని ప్రతిపాదించారు. ఈ లిఫ్టుల ఏర్పాటు అంశమై బుధవారం ప్రభుత్వ విప్ బాల్క సుమన్ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ మురళీధర్, ఆదిలాబాద్ జిల్లా సీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఇతర ఇంజనీర్లతో ఇక్కడి జలసౌధలో చర్చించారు. పైప్ లైన్, పంప్‌హౌస్, ట్రాన్స్‌మిషన్ లైన్స్, ఇప్పటికే ఉన్న చెరువుల సామర్ధ్యం పెంపు తదితర అంశాలపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)లను రూ పొందించాలని సమావేశంలో నిర్ణయించారు. కొత్త ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యంగా నివేదిక రూపొందించాలని అధికారులు యోచిస్తున్నారు.

| లిఫ్టు | కొత్త ఆయకట్టు | స్థిరీకరణ | మొత్తం |
|---|---|---|---|
| లిఫ్టు1–మేడిగడ్డ వద్ద (మెంచపల్లి) | 18,800 | 0 | 18,800 |
| లిఫ్టు–2 అన్నారంవద్ద | 31,252 | 30,491 | 61,743 |
| లిఫ్టు–3 సుందిళ్ల వద్ద | 29,418 | 21,879 | 51,297 |
| మొత్తం | 79,470 | 52,370 | 1,31,840 |

epaper.sakshi.com

# లక్షలు కాదు.. లైఫ్ ఉండాలె

## ప్యాషన్ కోసం బోధనవైపు ఐఐటీయన్ల అడుగులు

### లక్షల జీతాన్ని వదులుకుని టీచింగ్ ప్రొఫెషన్‌లోకి..

సాక్షి, హైదరాబాద్: ఐఐటీయన్లు సరికొత్త పంథాను ఎంచుకుంటున్నారు. దేశంలోని పేరొందిన సాంకేతిక విద్యాసంస్థల నుంచి ఉన్నత చదువులు చదివిన ఎంతో మంది ఇప్పుడు సాఫ్ట్‌వేర్ సంస్థల్లో, బహుళ జాతి కంపెనీల్లో ఆఫర్లను వదులుకొని అధ్యాపక వృత్తిని ఎంపిక చేసుకుంటున్నారు. ప్రత్యేకంగా కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఐఐటీలో చదువుకున్న వారికి క్యాంపస్‌లోనే అద్భుత ప్యాకేజీలతో దేశ విదేశాల ఆఫర్లు వస్తాయి. అయితే ఈ ప్యాకేజీలు, ఆఫర్లు వారికి సంతృప్తినివ్వడం లేదు. రూ.లక్షల్లో జీతం వస్తున్నా తమ అభిరుచికి అనుగుణంగా టీచింగ్ ప్రొఫెషన్‌లోకి ప్రవేశిస్తున్నారు. హైదరాబాద్‌లో ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ ఇప్పుడు ఐఐటీ కోచింగ్ సెంటర్లకు హబ్‌గా మారింది. అశోక్‌నగర్, ఇందిరాపార్కు సివిల్స్ కోచింగ్ అడ్డా కాగా.. విద్యానగర్, నల్లకుంట ప్రాంతాలు ఐఐటీ కోచింగ్‌కు కేంద్రంగా మారాయి. ఐఐటీ కోచింగ్‌లో రాజస్తాన్‌లోని కోట తరువాత హైదరాబాద్ దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. ఐఐటీ ఇప్పుడు అన్ని వర్గాల్లో ఒక క్రేజ్‌గా మారింది. పది, ఇంటర్ నుంచే ఐఐటీ కోసం శిక్షణ ఇప్పిస్తున్నారు. ఆడుతూ, పాడుతూ ఐఐటీ శిక్షణ పొందాలనే లక్ష్యంతో శిక్షణనిస్తున్నారు కొందరు ఐఐటీయన్లు. అధ్యాపకుల్లా కాకుండా స్నేహితుల్లా పాఠాలు బోధిస్తున్నారు. 24 గంటల పాటు చదువే కాదు.. సినిమాలు, షికార్లు, సరదా కబుర్లు కూడా జీవితంలో భాగం కావాలని వీరు చెబుతున్నారు. దీనికి అనుగుణంగా శిక్షణలో వైవిధ్యం, వినూత్నం కనబరుస్తూ బోధన చేస్తున్నారు.



విక్రమ్ దాచేపల్లిది సూర్యాపేట జిల్లాలోని లింగాల గ్రామం. వెల్లూరు వీఐటీలో చేరి 2010లో బీటెక్ పూర్తి చేశారు. ఆ మరుసటి సంవత్సరమే ఒక బహుళ జాతి సంస్థలో ఉద్యోగం లభించింది. నెలకు రూ.1.5 లక్షల జీతం. అయితే విక్రమ్‌కు ఆ ఉద్యోగం సంతృప్తినివ్వలేదు.



**ఒక సాఫ్ట్‌వేర్ సంస్థలో నాలుగు గోడల మధ్య పని చేయడం నచ్చలేదు, నాకు మొదటి నుంచీ టీచింగ్ అంటే ఎంతో ఇష్టం. పైగా ఐఐటీ కోచింగ్‌లో తీవ్రమైన ఒత్తిడికి భిన్నంగా సృజనాత్మకమైన పద్ధతిలో శిక్షణనిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు అని అనిపించింది. అందుకే 2012లో ఐఐటీ అకాడమీని ఏర్పాటు చేశాం.**

**- విక్రమ్**

**నగరానికి చెందిన భరత్ ఖరగ్‌పూర్ ఐఐటీలో 2010లో ఎంటెక్ పూర్తి చేశారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌ను వదులుకొని టీచింగ్ ప్రొఫెషన్‌ను ఎంపిక చేసుకున్నారు.**



బహుళ జాతి సాఫ్ట్‌వేర్ సంస్థల్లో పని చేస్తే బోలెడంత జీతం ఇస్తారు. కానీ ఎలాంటి సంతృప్తి ఉండదు. జీవితం చాలా యాంత్రికంగా గడిచిపోతుంది. అలా రొటీన్‌గా గడపడం నాకు ఇష్టం లేదు. మనకు తెలిసిన జ్ఞానాన్ని, కొత్త విషయాలను బోధించడం వల్ల ఇప్పుడు టీచర్‌గా ఎంతో సంతోషంగా ఉన్నా. ఒక సాఫ్ట్‌వేర్ నిపుణుడితో పోల్చుకుంటే నా జీతం చాలా తక్కువే. కానీ ఈ జాబ్ చాలా క్రియేటివ్‌గా ఉంది.

**- భరత్**

**జస్వంత్‌ది వైజాగ్. ఖరగ్‌పూర్ ఐఐటీలో ఎంటెక్ పూర్తి చేశారు. నగరంలోని ఒక కోచింగ్ సెంటర్‌లో ఫిజిక్స్ బోధిస్తున్నారు.**



ఒక టీచర్‌గా పాఠం చెప్పి వెళ్లడం ఏ మాత్రం సరైన పద్ధతి కాదు. వాళ్లలో ఒక స్టూడెంట్‌గా కలిసిపోయి చర్చించడం వల్ల బోధన సృజనాత్మకంగా ఉండటమే కాకుండా ఆ చర్చలో ప్రతి స్టూడెంట్ భాగస్వామి అవుతాడు. లక్ష్యాన్ని నిర్దేశించుకుంటాడు. క్యాంపస్ ప్లేస్‌మెంట్ కాదనుకొని ఈ వృత్తికి వచ్చా. ఇది నాకు ఎంతో సంతృప్తినిస్తోంది.

**- జస్వంత్**

## మెడికల్ కాలేజీల్లో డిజిటల్ తరగతులు

### కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం కీలక నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ మెడికల్, డెంటల్ కాలేజీల్లో డిజిటల్ తరగతులను ఏర్పాటు చేయాలని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం కీలక నిర్ణయం తీసుకుంది. 9 మెడికల్ కాలేజీలు, ఒక డెంటల్ కాలేజీలో వీటిని ఏర్పాటు చేయనుంది. డిజిటల్ తరగతుల ఏర్పాటుకు ఒక్కో కాలేజీకి రూ.15 లక్షలు కేటాయించాలని నిర్ణయించింది. విశ్వవిద్యాలయం కార్యనిర్వాహక మండలి (ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్), ఫైనాన్స్ కమిటీల సమావేశం బుధవారం జరిగింది. దీనికి వైస్ చాన్స్‌లర్ కరుణాకర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. డిజిటల్ తరగతుల నిర్మాణంతో వైద్య విద్య ఆధునికత సంతరించుకోనుంది. దేశ, విదేశాల వర్సిటీల్లో జరిగే కీలకమైన ప్రొఫెసర్ల పాఠాలను కూడా వినొచ్చు. అక్కడి నుంచి లింక్ ఇస్తే అన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోనూ టూవే కమ్యూనికేషన్ పద్ధతిలో వీక్షించవచ్చు. కంటిన్యుయేషన్ మెడికల్ ఎడ్యుకేషన్‌ని (సీఎంఈ) కూడా విరివిగా నిర్వహించాలని మండలి నిర్ణయించింది. కాళోజీ భవన నిర్మాణ పనులను నవంబర్ చివరి నాటికి పూర్తిచేయాలని వీసీ కరుణాకర్‌రెడ్డి ఆదేశించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఫిజియోథెరపీ కోర్సులను ఏర్పాటు చేయాలని.. అందుకు రానున్న వైద్య విద్యా సంవత్సరం నుంచే సన్నాహాలు చేయాలని నిర్ణయించారు. అలాగే నేచురోపతి పీజీ కోర్సు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయుష్ డైరెక్టర్‌కు సూచించారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వైద్య విద్యా సంచాలకుడు డాక్టర్ రమేశ్‌రెడ్డి, ఆయుష్ డైరెక్టర్ అలుగు వర్షిణి తదితరులు పాల్గొన్నారు.

## రెండ్రోజుల్లో జిల్లాలకు ఎస్‌జీటీ జాబితాలు

సాక్షి,హైదరాబాద్: విద్యాశాఖలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో భాగంగా 3,325 సెకండరీ గ్రేడ్ టీచర్ (తెలుగు మీడియం) పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జిల్లాల వారీ జాబితాలు మరో రెండ్రోజుల్లోగా జిల్లాలకు పంపించేందుకు టీఎస్‌పీఎస్సీ ఏర్పాట్లు చేస్తోంది. ఇటీవల ఆ పోస్టులకు ఎంపికైన వారి జాబితాను ప్రకటించిన టీఎస్‌పీఎస్సీ తదుపరి కార్యాచరణను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా జిల్లాల వారీగా అభ్యర్థుల జాబితాను రూపొందించే పనిలో నిమగ్నమైంది. వచ్చే రెండ్రోజుల్లో జాబితాలను జిల్లాల వారీగా ఆయా జిల్లాల విద్యాశాఖాధికారులకు పంపించనుంది. ఆ తర్వాత పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు విద్యాశాఖ పోస్టింగ్‌లు ఇచ్చేందుకు కసరత్తు చేస్తోంది. జిల్లాల వారీగా అభ్యర్థుల జాబితా అందగానే పోస్టింగ్ ఇచ్చేందుకు కౌన్సెలింగ్ నిర్వహణకు చర్యలు చేపట్టాలని విద్యాశాఖ ఇప్పటికే నిర్ణయించింది. ఇందులో భాగంగా జాబితాలు తమకు అందిన వెంటనే కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను కూడా జారీ చేసేందుకు సిద్ధమవుతోంది. మొత్తానికి ఈ నెలాఖరు నాటికి పోస్టులకు ఎంపికైన 3,325 మందికి పోస్టింగ్‌లను ఇవ్వనుంది.

## క్లుప్తంగా...

### నవంబర్ 7లోగా వీడియోలు, కేస్‌స్టడీల స్వీకరణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పాఠశాలల ప్రిన్సిపాల్స్, హెడ్‌మాస్టర్లు తమ పాఠశాలల్లో లీడర్‌షిప్ క్వాలిటీపై అమలు చేసిన విధానాలను కేస్‌స్టడీలుగా, వీడియోలుగా నవంబర్ 7వ తేదీలోగా ncsl.csl@niepaకు మెయిల్ ద్వారా పంపించాలని రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ సంచాలకురాలు శేషుకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేస్ స్టడీలు, వీడియోలు హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ఉండాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఈ దరఖాస్తులను ఆహ్వానిస్తుందని తెలిపారు. అందులో బెస్ట్ ప్రాక్టీసెస్‌గా ఎంపికైన వారు 'పాఠశాలలో నాణ్యతకై నాయకత్వం' అనే అంశంపై వచ్చే ఏడాది జనవరి 15 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించే జాతీయ సదస్సులో తమ అనుభవాలను పంచుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు NCSL& NIEPA: http://ncsl.niepa. ac.in/ncsl.php లేదా www.scert.telangana.gov.in వెబ్‌సైట్‌లను సందర్శించాలని సూచించారు.

### నవంబర్‌లో అంబేడ్కర్ వర్సిటీ పీజీ పరీక్షలు

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం పీజీ పరీక్షలు నవంబర్ 19వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. పీజీ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎంఎల్ఐఎస్‌సీ, బీఎల్ఐఎస్‌సీ, అన్ని డిప్లొమా సర్టిఫికెట్ కోర్సుల విద్యార్థులకు ఈ పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. పరీక్షా రుసుములను టీఎస్, ఏపీ ఆన్‌లైన్ సెంటర్లలో డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారానే చెల్లించాలన్నారు. పరీక్షల ప్రారంభానికి రెండ్రోజుల ముందు వర్సిటీ పోర్టల్ నుంచి హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఈనెల 20 ఆఖరు తేదీ అని వివరించారు.

### 20న ఎస్సై అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

సాక్షి, హైదరాబాద్: ఆరో జోన్‌కు సంబంధించి ఇటీవల ఎస్సై (సివిల్)లుగా ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 20న అంబర్‌పేటలోని ఎస్ఏఆర్‌సీపీఎల్ గ్రౌండ్స్‌లో జరిగే సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలని నిజామాబాద్ రేంజ్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఇండిమినిటీ బాండ్, ఫొటో లు, విద్యార్హత సర్టిఫికెట్లు, రూ.15 వేల డిమాండ్ డ్రాఫ్ట్‌ను తమ వెంట తీసుకురావాలని సూచించారు.

### కోర్టు తీర్పు ప్రకారమే పీఈటీ నియామకాలు

సాక్షి, హైదరాబాద్: పీఈటీ ఉద్యోగ నియామకాలకు సంబంధించిన అంశం కోర్టు పరిధిలో ఉందని, ఈనెల 21న దీనిపై విచారణ జరగనుందని టీఎస్‌పీఎస్సీ తెలిపింది. కోర్టు తీర్పు ప్రకారం నియామక ప్రక్రియ చేపడతామని అభ్యర్థులు సహకరించాలని బుధవారం ఓ ప్రకటనలో కోరింది.

### 'ఆ నామినల్ రోల్స్ సకాలంలో పంపించండి'

సాక్షి, హైదరాబాద్: వచ్చే మార్చిలో పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులకు సంబంధించిన మ్యాన్యుస్క్రిప్ట్ నామినల్ రోల్స్ నిర్ణీత వ్యవధిలోనే తమకు పంపించాలని రాష్ట్రంలోని అన్ని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ సుధాకర్ ఆదేశాలు జారీ చేశారు.

# పేస్కేల్ లేకుండా రెగ్యులరైజేషనా?

- పలు డిమాండ్ల సాధనకోసం విద్యుత్ కార్మికుల మహా ధర్నా
- ప్రధాన కార్యాలయానికి తరలివచ్చిన వేలాదిమంది ఉద్యోగులు
- 23న వరంగల్ బహిరంగసభలో కార్యాచరణ ప్రకటిస్తామన్న నాయకులు

హైదరాబాద్: విద్యుత్ శాఖలో 24వేల మందిని రెగ్యులరైజ్ చేశామని ముఖ్యమంత్రి, మంత్రులు పదేపదే చెప్పుకుంటున్నారని, వేల మందికి పేస్కేల్ లేని రెగ్యులరైజేషన్ దేశంలోనే ఎక్కడైనా ఉందా అంటూ విద్యుత్ కార్మికులు ప్రశ్నిస్తున్నారు. డిమాండ్ల సాధనకోసం తెలంగాణ ఎలక్ట్రిసిటీ ట్రేడ్ యూనియన్ ఫ్రంట్ ఆధ్వర్యంలో బుధవారం మింట్ కాంపౌండ్‌లో కార్మికులు చేపట్టిన ధర్నాతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన విద్యుత్ ఉద్యోగులు ఎస్‌పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ధర్నాలో టీఈటీయూఎఫ్ చైర్మన్ పద్మారెడ్డి, కన్వీనర్ శ్రీధర్‌లు మాట్లాడుతూ, ఆర్టిజన్ ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులకు వర్తించే ఏపీఎస్ఈబీ సర్వీస్ రెగ్యులరైజేషన్‌ను అమలు చేయాలని, 2018 వేతన సవరణతో పాటు ఆర్టిజన్ కార్మికులకు ఇంక్రిమెంట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. 1999 తర్వాత ఉద్యోగంలో చేరిన వారందరికీ రివైజ్డ్ పెన్షన్ రూల్స్ వర్తింపజేయాలన్నారు. డిస్కంలో చాలా కాలంగా పనిచేస్తున్న అన్‌–మెన్ వర్కర్లను ఆర్టిజన్ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రస్తుతం సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్లను కాకుండా మిగిలిన వారిని ఇర్టిజన్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. చనిపోయిన ఆర్టిజన్ ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకం కల్పించాలని, విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగికి, ఆర్టిజన్ ఉద్యోగులకు సహజ, ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే వారికి జనరల్ ఇన్సూరెన్స్ ద్వారా కోటి రూపాయలు వారి కుటుంబ సభ్యులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. స్కేళ్ల వ్యత్యాసాన్ని సరిచేయాలని, ఆర్టిజన్ కార్మికులను స్వస్థలాలకు బదిలీ చేయాలని, ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఈ ధర్నాలో కో చైర్మన్ ఎం.ఎ.వజీర్, శ్రీధర్‌గౌడ్, కుమార్‌చారి, సాయిబాబు, మజీద్, గంబో నాగరాజు, రాధాకృష్ణ తదితరులతో పాటు పెద్దఎత్తున విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

### 23న వరంగల్‌లో బహిరంగ సభ

విద్యుత్ రంగంలో కార్మికుల పరిస్థితి దారుణంగా ఉందని, లేబర్ యాక్ట్ ప్రకారం నిబంధనలు అమలు చేయడం లేదని, మరోసారి ఉద్యమం ద్వారానే డిమాండ్లు సాధించుకోవాలని ధర్నాలో నాయకులు పిలుపునిచ్చారు. తెలంగాణలో ఈ రోజు విద్యుత్ కార్మికులు మాత్రమే సమస్యలతో సతమతమవడం లేదని ఆర్టీసీ, ఉద్యోగ సంఘాలు, రెవెన్యూ, ఎన్జీఓలు, రైతులు, కార్మికులు ఇలా అందరూ అసంతృప్తిగానే ఉన్నారని, ఎవరికి ఏ సమస్య వచ్చినా కలిసి పోరాడి సాధించుకుందామని పిలుపునిచ్చారు. వరంగల్ జిల్లాలో ఈ నెల 23న చేపట్టే బహిరంగ సభకు విద్యుత్ కార్మికులు నల్ల బ్యాడ్జీలు, నల్ల చొక్కాలు ధరించి పాల్గొనాలని, అక్కడే కార్యాచరణ ప్రకటిస్తామని నాయకులు ప్రకటించారు.

## ఉప ఎన్నిక ముగిశాకే కేజీబీవీ టీచర్ల బదిలీలు!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో (కేజీబీవీ) ఔట్‌సోర్సింగ్‌పై పని చేస్తున్న టీచర్ల బదిలీలకు హుజూర్‌నగర్ ఉప ఎన్నికల వల్ల తాత్కాలిక బ్రేక్ పడింది. బదిలీల కోసం దాదాపు 8 వేల మంది టీచర్లు మూడేళ్లుగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల మొదట్లోనే కేజీబీవీ టీచర్ల బదిలీలను చేపట్టాలని విద్యాశాఖ భావించింది. అయితే హుజూర్‌నగర్ ఉప ఎన్నికలకు నోటిఫికేషన్ రావడంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో టీచర్ల బదిలీలకు అనుమతినివ్వాలని పాఠశాల విద్యాశాఖ ఎన్నికల కమిషన్‌కు లేఖ రాసింది. పది రోజులు గడిచినా కమిషన్ నుంచి ఆమోదం లభించకపోవడంతో ఎన్నికల తర్వాతే టీచర్ల బదిలీలు చేపట్టాలన్న ఆలోచనకు విద్యాశాఖ వచ్చింది. వారంతా ఔట్‌సోర్సింగ్‌పై పని చేస్తున్న వారే కావడంతో ఎలాంటి సర్వీస్ రూల్స్ లేవు. దీంతో వారు కోరుకున్న స్థానాల్లోకి బదిలీ చేయనుంది. కాగా హుజూర్‌నగర్ ఉప ఎన్నికల పోలింగ్ ఈ నెల 21న జరగనుండగా.. ఫలితాలు 24న వెలువడనున్నాయి.

## 'బిగ్‌డేటా ప్రయోజనకరం'



సాక్షి, హైదరాబాద్: దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయం ఇప్పుడు సంక్షోభంలో ఉందని.. వీటిని అధిగమించేందుకు బిగ్‌డేటా వంటి ఆధునిక ఐటీ ఆధారిత టెక్నాలజీలు ఎంతో ఉపయోగపడతాయని రాష్ట్ర ప్రభుత్వ ఐటీ కార్యదర్శి జయేశ్ రంజన్ తెలిపారు. సమస్యల పరిష్కారంలో బిగ్‌డేటా ప్రాధాన్యతను ప్రభుత్వాలు కూడా గుర్తించి వాటిని పెద్ద ఎత్తున వాడుతున్నాయన్నారు. హైదరాబాద్ శివార్లలోని అంతర్జాతీయ మెట్ట ప్రాంత పంటల పరిశోధన కేంద్రం (ఇక్రిశాట్)లో వ్యవసాయంలో బిగ్‌డేటా అన్న అంశంపై అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. మూడ్రోజుల పాటు జరగనున్న ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన జయేశ్ రంజన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రజలకు మరింత సమర్థంగా చేరవేసేందుకు, ప్రభుత్వ పనితీరును మెరుగుపరుచుకునేందుకు బిగ్‌డేటా ఉపయోగపడుతోందన్నారు. వ్యవసాయంలోనూ బిగ్‌డేటాను వాడుకునేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ పీటర్ కార్‌బెరీ, సదస్సు సమన్వయకర్త బ్రియన్ కింగ్ తదితరులు పాల్గొన్నారు.

# యాభై లోపు పిల్లలున్న హాస్టళ్ల మూత!

- వసతి గృహాల్లో కనీసం వంద మంది పిల్లలుండాల్సిందే..
- అంతకు తక్కువున్న వాటిని సమీప హాస్టళ్లలో విలీనం
- పూర్తి వివరాలు సమర్పించాలని సంక్షేమ శాఖలకు ప్రభుత్వం ఆదేశం



సాక్షి, హైదరాబాద్: సంక్షేమ వసతి గృహాలను హేతుబద్ధీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పిల్లల సంఖ్య తక్కువగా ఉన్న వాటిని సమీప హాస్టళ్లలో విలీనం చేయాలని భావిస్తోంది. విద్యార్థులకు మెరుగైన వసతిని అందించే లక్ష్యంతో సంస్కరణలు చేపడుతోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల పరిధిలో దాదాపు 1,850 వసతి గృహాలున్నాయి. వీటిలో వెయ్యికి పైగా ప్రీ మెట్రిక్ హాస్టళ్లున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత విడతల వారీగా గురుకుల పాఠశాలలను అందుబాటులోకి తేవడంతో వసతి గృహాల్లో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గింది. ఈక్రమంలో పిల్లల సంఖ్య ఆదారంగా హేతుబద్ధీకరిస్తే.. మరింత మెరుగైన సేవలు అందించొచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను సమర్పించాలని సంక్షేమ శాఖాధిపతులను ఆదేశించింది.

**నిర్వహణ భారం ఎక్కువవుతున్న నేపథ్యంలో..**

ప్రభుత్వ సంక్షేమ వసతిగృహంలో కనీసం వంద మంది పిల్లలుండాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇంత మొత్తంలో పిల్లలుంటేనే నిర్వహణ సంతృప్తికరంగా ఉంటుంది. కానీ చాలాచోట్ల ప్రీమెట్రిక్ హాస్టళ్లలో పిల్లల సంఖ్య తక్కువగా ఉంది. కొన్నిచోట్ల 30 నుంచి 50 మంది వరకే ఉండటంతో నిర్వహణ భారమవుతోంది. ఈ నేపథ్యంలో 50 కంటే తక్కువ మంది విద్యార్థులున్న హాస్టళ్లను మూసేయాలని.. అక్కడున్న విద్యార్థులను సమీప హాస్టళ్లలో విలీనం చేయాలని ప్రాథమికంగా తేల్చారు. ఈ దిశగా హాస్టళ్ల వారీగా విద్యార్థుల వివరాలు.. తక్కువున్న హాస్టళ్లకు సమీపంలో ఉన్న వసతిగృహాలు.. ఇలా నిర్దేశించిన కేటగిరీలో సమాచారాన్ని సమర్పించాలని సంక్షేమ శాఖాధిపతులను ఆదేశించింది. ఈక్రమంలో అధికారులు వివరాల సేకరణకు ఉపక్రమించారు. ఎస్సీ అభివృద్ధి శాఖ ప్రాథమిక గణాంకాల ప్రకారం ఆ శాఖ పరిధిలో దాదాపు 40 వసతిగృహాల్లో యాభైలోపు పిల్లలున్నట్లు గుర్తించారు. ఈనెలాఖరులోగా పూర్తిస్థాయి సమాచారాన్ని సేకరించి ప్రభుత్వానికి నివేదించేందుకు సంక్షేమ శాఖాధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

## కేసీఆర్ సభ ఖర్చు కూడా టీఆర్‌ఎస్ అభ్యర్థి ఖాతాలోనే..

### సీఈవోకు టీపీసీసీ 'ఎన్నికల కమిటీ' వినతి

సాక్షి, హైదరాబాద్: ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా హుజూర్‌నగర్‌లో సీఎం కేసీఆర్ పాల్గొనే బహిరంగ సభకు లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని, ఆ ఖర్చునంతా టీఆర్‌ఎస్ అభ్యర్థి ఖర్చులోనే కలపాలని టీపీసీసీ ఎన్నికల సమన్వయ కమిటీ కోరింది. ఈ మేరకు కమిటీ చైర్మన్ మర్రి శశిధర్‌రెడ్డి, కన్వీనర్ జి.నిరంజన్‌ల నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఎన్నికల సంఘం సీఈవో రజత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. అనంతరం గాంధీభవన్‌లో శశిధర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఉప ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే సీఎం కేసీఆర్ స్వయంగా ప్రచారానికి వెళ్తున్నారని ఎద్దేవా చేశారు. ఆర్టీసీ కార్మికుల ఆత్మహత్యలకు కేసీఆరే బాధ్యత వహించాలని, సీఎం జాగ్రత్తగా పనిచేయాలంటే హుజూర్‌నగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతిరెడ్డిని గెలిపించాలని కోరారు. మంత్రులు మహమూద్ అలీ, జగదీశ్‌రెడ్డిలు కోదాడలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం ఎన్నికల కోడ్ ఉల్లంఘనేనని, మంత్రులపై కేసులు నమోదు చేయాలని శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# అధిక ధరలకు విద్యుత్ కొనుగోళ్లా..?

- రాష్ట్ర డిస్కంల తీరును ఆక్షేపించిన కేంద్ర విద్యుత్ శాఖ
- మూడేళ్లుగా నష్టాల్లోనే రెండు విద్యుత్ సంస్థలు
- పనితీరు ఆధారంగా విద్యుత్ పంపిణీ సంస్థలకు వార్షిక రేటింగ్‌లు
- టీఎస్‌ఎస్పీడీసీఎల్‌కు 'బీ+', ఎన్పీడీసీఎల్‌కు 'బీ' గ్రేడ్



**గ్రేడింగ్‌లు ఇలా**

| స్కోరు | గ్రేడ్ | డిస్కంల సంఖ్య | గ్రేడింగ్‌కు నిర్వచనం |
|---|---|---|---|
| 80–100 | ఏ+ | 7 | అత్యుత్తమ సామర్థ్యం |
| 65–80 | ఏ | 9 | ఉత్తమ సామర్థ్యం |
| 50–65 | బీ+ | 9 | మోస్తరు సామర్థ్యం |
| 35–50 | బీ | 8 | యావరేజీ సామర్థ్యం |
| 20–35 | సీ+ | 5 | సామర్థ్యం హీనం |
| 0–20 | సీ | 3 | సామర్థ్యం అతిహీనం |

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి విద్యుత్ సరఫరా చేసే దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్‌ఎస్పీడీసీఎల్), ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్‌ఎన్పీడీసీఎల్)లు అధిక ధరలు చెల్లించి విద్యుదుత్పత్తి కంపెనీల నుంచి విద్యుత్ కొనుగోళ్లు చేయడాన్ని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆక్షేపించింది. 2016–17తో పోల్చితే 2017–18లో టీఎస్‌ఎస్పీడీసీఎల్ కొనుగోలు చేసిన విద్యుత్ ధరలు కొంత మెరుగ్గా ఉన్నా, టీఎస్‌ఎస్పీడీసీఎల్ మాత్రం యూనిట్‌కు రూ.5.35 చొప్పున అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేయడాన్ని తప్పుబట్టింది. రెండు డిస్కంలు వరుసగా మూడేళ్ల నుంచి నష్టాలు కూడబెట్టుకుంటున్నాయని స్పష్టం చేసింది. ఎన్పీడీసీఎల్ నష్టాలు భారీగా పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వ రాయితీలు సకాలంలో అందడం లేదని, వార్షిక టారిఫ్ ప్రతిపాదనలను ఈఆర్సీకి డిస్కంలు గడువులోగా సమర్పించడం లేదని పేర్కొంది. విద్యుత్ కొనుగోళ్ల సంబంధించిన బిల్లులను చెల్లించేందుకు రెండు డిస్కంలు 220–225 రోజుల అధిక సమయాన్ని తీసుకుంటున్నాయని, దీనిని మెరుగుపరుచుకోవాలని సూచించింది. 2017–18లో రాష్ట్రాల విద్యుత్ పంపిణీ సంస్థల పనితీరు ఆధారంగా కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ వార్షిక రేటింగ్‌లు కేటాయించింది. దక్షిణ తెలంగాణలోని హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, నల్లగొండ, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాలకు విద్యుత్ సరఫరా చేసే టీఎస్‌ఎస్పీడీసీఎల్ 'బీ+'గ్రేడ్‌ను సాధించి మోస్తరు (మోడరేట్) పనితీరును చాటుకోగా, ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలకు విద్యుత్ సరఫరా చేసే టీఎస్‌ఎన్పీడీసీఎల్ 'బీ' గ్రేడ్ సాధించి యావరేజీ పనితీరును నిరూపించుకుంది.

**గ్రేడింగ్ కేటాయింపు ఇలా..**

కార్యశీలత, ఆర్థిక పనితీరు సామర్థ్యాల ఆధారంగా దేశంలోని అన్ని రాష్ట్రాలకు సంబంధించిన 41 డిస్కంలకు గ్రేడింగ్‌లు కేటాయించారు. డిస్కంల కార్యశీలత, సంస్కరణల అమలుకు 52, ఆర్థిక స్థితిగతులకు 33, ప్రభుత్వ సహకారం, రెగ్యులేటరీ వ్యవస్థలకు 15 మార్కులు కలిపి మొత్తం 100 వెయిటేజీ మార్కుల్లో సాధించిన స్కోరు ఆధారంగా గ్రేడ్లను కేటాయించారు.

**టీఎస్‌ఎస్పీడీసీఎల్, టీఎస్‌ఎన్పీడీసీఎల్‌ల ప్రధాన బలాలు**

- 89% పనితీరుతో బిల్లుల జారీ సంతృప్తికరం
- దీర్ఘకాలిక ఒప్పందాలతో 90 శాతం విద్యుత్ కొనుగోళ్లు. సంతృప్తికరం.
- 2018–19 టారిఫ్ ఆర్డర్ జారీ

**టీఎస్‌ఎస్పీడీసీఎల్ ప్రధాన బలహీనతలు**

- 2016–17తో పోల్చితే తగ్గినా 2017–18లో అధిక ధరలకు విద్యుత్ కొనుగోళ్లు
- నిర్దేశిత గడువులోగా 2019–20కు సంబంధించిన టారిఫ్ పిటిషన్‌ను దాఖలు చేయలేదు.

**టీఎస్‌ఎన్పీడీసీఎల్ ప్రధాన బలహీనతలు**

- ఉచిత విద్యుత్ సరఫరాకు సంబంధించి ప్రభుత్వ రాయితీలు రాకపోవడంతో 2016–17లో 16.35 శాతమున్న నష్టాలు 2017–18లో 24.74 శాతానికి పెరిగాయి.
- 2017–18లో యూనిట్‌కు రూ.5.35 చొప్పున అధిక ధరతో విద్యుత్ కొనుగోళ్లు.

సాక్షి

గురువారం, అక్టోబర్, 17

# ‘హోరాహోరీ’ వాదనలకు తెర

అయోధ్య వివాదంపై సర్వోన్నత న్యాయస్థానంలో దాదాపు 40 రోజులపాటు ఏకబిగిన కొనసాగిన వాదప్రతివాదాలు బుధవారం ముగిశాయి. వచ్చే మూడు రోజుల్లో లిఖితపూర్వక నివేదనలు దాఖలు చేయాలని అన్ని పక్షాలనూ అయిదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఆదేశించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ వచ్చే నెల 17న పదవీ విరమణ చేస్తున్నందువల్ల ఆలోగా తీర్పు వెలువడుతుంది. సహజంగానే ఆ తీర్పు కోసం దేశ ప్రజలంతా ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. 2.77 ఎకరాల నిడివి ఉన్న స్థలంపై ఈ వివాదమంతా కేంద్రీకృతమై ఉంది. రామజన్మభూమి అనేది ఈ దేశ పౌరుల విశ్వాసానికి సంబంధించిన అంశమని, దాన్ని న్యాయస్థానాలు ఇష్టానుసారం నిర్ణయిస్తామంటే కుదరదని హిందూత్వ సంస్థలు వాదించగా... అది బాబ్రీ మసీదు స్థలమనీ, దాన్ని తమకు అప్పగించాలని ముస్లిం వక్ఫ్ బోర్డు వగైరాలు వాదించాయి. అయితే ఇప్పుడు పరిస్థితి మారింది. న్యాయస్థానం ఏ తీర్పునిచ్చినా దానికి కట్టుబడి ఉంటామని దాదాపు అన్ని పక్షాలూ చెబుతున్నాయి. అయితే కోట్లాదిమంది భక్తుల విశ్వాసాలను పరిగణనలోకి తీసుకోవాలని ఒకరు, తమ అధీనంలో ఉండిన ప్రాంతం గనుక మళ్లీ తమకే అప్పగించాలని మరొకరు కోరుకుంటున్నారు. ఇది సహజమే. దేశ చరిత్రలో రాజ్యాంగ మౌలిక స్వరూపానికి సంబంధించి తీర్పు వెలువడిన కేశవానంద భారతి కేసు విచారణ తర్వాత ఇంత సుదీర్ఘకాలం విచారణ కొనసాగిన కేసు ఇదే.

అయోధ్య అనగానే కోట్లాదిమంది హిందువులకు రాముడు గుర్తుకొస్తాడు. భక్తకోటి హృదయాల్లో రాముడు, అయోధ్య అంతగా పెనవేసుకుపోయాయి. కానీ ఇరవైయ్యేడేళ్లుగా అయోధ్య అనగానే పెను వివాదం కూడా గుర్తుకురావడం మొదలైంది. కొందరిలో ఆవేశకావేశాలు కట్టుదాటి, ఉద్వేగాలు ఒక్కసారిగా పెల్లుబికి ఆ పట్టణంలోని బాబ్రీ మసీదును కూల్చటం ఇందుకు కారణం. వాస్తవానికి ఆ వివాదం అంతకు నాలుగు దశాబ్దాల క్రితానిదే అయినా, ఆ కూల్చివేత ఉదంతం వివాదాన్ని కీలక మలుపు తిప్పింది. అనంతరం దేశవ్యాప్తంగా పలుమార్లు జరిగిన విషాద ఘటనల పరంపర ఈ దేశ పౌరుల శ్రేయస్సును కోరేవారందరినీ కలవరపెట్టింది. పలువురిలో ఒక రకమైన నిర్లిప్తత, నిర్వేదం అలుముకున్నాయి. సామరస్యం మళ్లీ చివురిస్తుందా అన్న సందేహం ఏర్పడింది. రాజకీయ ప్రయోజనాలే పరమావధిగా పనిచేసే రాజకీయ నాయకులు ఈ పరిస్థితినుంచి లబ్ధి పొందుదామని చూశారు. బాధ్యతారహితంగా ప్రవర్తించారు. కానీ ‘కాలం మారుతుంది... చేసిన గాయాలు మాన్పుతుంది’ అని ఒక కవి అన్నట్టు అనంతరకాలంలో క్రమేపీ పరిస్థితి మారింది. సంయమనం వెల్లివిరియడం ప్రారంభమైంది. అయినప్పటికీ ఆ చేదు జ్ఞాపకాల నేపథ్యంలో అయోధ్యపై వివిధ కోర్టుల్లో తీర్పులు వెలువడిన ప్రతి సందర్భంలోనూ... ఇంకా చెప్పాలంటే ఆ తీర్పులు ఫలానా తేదీన వెలువడతాయని ప్రకటించిననాటినుంచీ ప్రభుత్వాలు అప్రమత్తం కావడం, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం రివాజుగా మారింది. అయితే అదృష్టవశాత్తూ ప్రజలెప్పుడూ సంయమనం తోనే ఉంటున్నారు.

దశాబ్దాల తరబడి న్యాయస్థానాల్లో నానుతూ మొదట్లో స్థానికంగా, అనంతరకాలంలో దేశవ్యాప్తంగా ఉద్రిక్తతలకు కారణమవుతున్న ఈ వివాదానికి న్యాయబద్ధమైన పరిష్కారం అన్వేషించాలని, దీనికొక ముగింపు పలకాలని సర్వోన్నత న్యాయస్థానం సంకల్పించడం మెచ్చుకోదగింది. అది ఎల్లకాలమూ వివాదంగానే మిగిలిపోవాలని ఆశిస్తున్న శక్తులకు ఈ ధోరణి నచ్చలేదు. దానికి తగినట్టే విచారణక్రమంలో సమస్యలూ ఎదురయ్యాయి. ఇలా ఎన్నో అవాంతరాలను, అభ్యంతరాలను అధిగమించి విచారణ పూర్తయింది. ఈ విచారణ సమయంలో భిన్న పక్షాల తరఫున వాదిస్తున్న సీనియర్ న్యాయవాదులు సైతం ఎలా సంయమనం కోల్పోయారో, కోపతాపాలు ప్రదర్శించారో అందరూ చూశారు. ఆఖరికి విచారణ తుది ఘట్టానికి వచ్చిందనుకున్న దశలో కోర్టు హాల్‌లో ఉద్వేగాలు చోటు చేసుకోవడంతో ఆగ్రహించిన ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ ఇలాగైతే తాము నిష్క్రమించాల్సివస్తుందని హెచ్చరించవలసి వచ్చింది. వివాదం అత్యంత సంక్లిష్టమైనది, జటిల మైనది అయినప్పుడు ఇవన్నీ సహజమే. వివాదంలో హిందువులంతా ఒకపక్కా, ముస్లింలంతా ఒకపక్కా ఉన్నారనుకోవడం పొరపాటు. రెండుచోట్లా వైరిపక్షాలున్నాయి. ఈ వివాదం తమదంటే, తమదని చెప్పుకునేవారున్నారు. ఈ వివాదంలో శ్రీశ్రీ రవిశంకర్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఖలీఫుల్లా వంటివారి ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వం కూడా నడిచింది. వారిచ్చిన నివేదికపై ధర్మాసనం పరిశీలించాల్సి ఉంది.

మొత్తానికి 1994లో పీవీ నరసింహారావు హయాంలో ఈ వివాదాన్ని రాష్ట్రపతి ద్వారా నివేదించినప్పుడు దాన్ని నిర్ద్వంద్వంగా తిరస్కరించిన సర్వోన్నత న్యాయస్థానం అనంతరకాలంలో జరిగిన పరిణామాల నేపథ్యంలో వివాదాన్ని స్వీకరించక తప్పలేదు. 2010లో అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ వివాదాస్పద స్థలాన్ని మూడు భాగాలు చేసి ముగ్గురికి పంచాలన్న వెలువరించిన తీర్పు ఏ ఒక్కరినీ సంతృప్తిపరచలేకపోయింది. కక్షిదారులెవరూ కోరని కొత్త కోణంలో ఈ తీర్పునిచ్చారంటూ సుప్రీంకోర్టు ఆక్షేపించి దాన్ని నిలిపేయడం అనంతర చరిత్ర. ఆ తర్వాత వివాదం సుప్రీంకోర్టు మెట్లెక్కింది. ఇరుపక్షాలూ పెద్ద మనసు చేసుకుని, ఇచ్చిపుచ్చుకునే ధోరణి ప్రదర్శించి ఉంటే ఈ వివాదం ఎప్పుడో ముగిసేది. కానీ లక్నో బెంచ్ న్యాయమూర్తి ఒకరు ఇచ్చిన తీర్పులో చెప్పినట్టు ‘ఇక్కడ దేవతలు సైతం నడయాడటానికి భయపడే స్థాయిలో చిన్న స్థలంలో భారీగా మందుపాతరలు న్నాయి’. తాము తీర్పు ఇవ్వడానికి చాలా ముందే అన్ని పక్షాలూ సామరస్యంతో వ్యవహరించి సమస్యను పరిష్కరించుకుంటాయని బలంగా ఆకాంక్షిస్తున్నట్టు అప్పట్లో సుప్రీంకోర్టు తెలిపింది. కానీ అది జరగలేదు. కాకపోతే ఉన్నంతలో ఉద్వేగాలు ఉపశమించాయి. ఇప్పుడు తీర్పు వెలువడ్డాక కూడా అదే సంయమనం అందరూ పాటించి, ఆ తీర్పును శిరసావహించగలవని దేశ ప్రజలంతా కోరు కుంటున్నారు.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు
ఆశ్వయుజ మాసం, తిథి బ.చవితి పూర్తి (24గంటలు)
నక్షత్రం కృత్తిక ప.2.54 వరకు, తదుపరి రోహిణి
వర్జ్యం... లేదు, దుర్ముహూర్తం ఉ.9.51 నుంచి 10.36 వరకు
తదుపరి ప.2.29 నుంచి 3.16 వరకు
అమృతఘడియలు... ప.12.12 నుంచి 1.54 వరకు.

సూర్యోదయం : 5.56
సూర్యాస్తమయం: 5.35
రాహుకాలం : ప.1.30 నుంచి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుంచి 7.30 వరకు

# సంక్షేమరాజ్య భావనకు నోబెల్ పట్టం

విశ్లేషణ



డి. పాపారావు

**ప్రపంచ పేదరిక సమస్యను పరిష్కరించే మార్గాలను అన్వేషించడంలో వినూత్న పద్ధతుల్లో ఆలోచించిన ముగ్గురు ఆర్థిక చింతనాపరులకు ఈ ఏడాది అర్థశాస్త్రంలో నోబెల్ బహుమతి ప్రకటించడం ముదావహం. ప్రపంచ పేదరిక సమస్య తాలూకు ప్రశ్నలను మరింత సరళమైన, నిర్దిష్టమైన రూపంలోకి వడకట్టి, తద్వారా పరిష్కారాన్ని సూచించే కృషిని చేశారనేది వారికి వస్తున్న ప్రశంస. భారత్ వంటి అభివృద్ధి చెందుతోన్న దేశాల ప్రభుత్వాలు, తమ పరిమిత వనరులను చీకట్లో రాయి విసిరినట్లు గుడ్డిగా తమకు తోచిన విధంగా పేదరిక నిర్మూలన కార్యక్రమాలకు ఖర్చు పెట్టడం కాకుండా, ఆ నిధులను కచ్చితమైన ఫలితాలను ఇచ్చే పద్ధతుల పైన వాడవచ్చు అని వీరి భావన. నిత్య జీవితంలో విద్య, వైద్యం వంటి రంగాల్లో తలెత్తుతున్న సమస్యల పరిష్కారం కోసం మనం అంతకుముందర ఆలోచించి ఉండని పరిష్కారాలను వారు ముందుకు తెచ్చారు.**

2019 సంవత్సరానికి ఆర్థిక రంగంలో నోబెల్ బహుమతిని ముగ్గురు ఆచార్యులు కలిసి గెలుచుకున్నారు. వారిలో భారత సంతతి అమెరికా జాతీయుడైన అభిజిత్ బెనర్జీ, ఆయన సహచరి ఎస్తర్ డఫ్లో, హార్వర్డ్ విశ్వవిద్యాలయ ఆచార్యుడు మైకెల్ క్రెమర్‌లు ఉన్నారు. అమర్త్యసేన్ తరువాత ఆర్థిక రంగంలో నోబెల్ బహుమతిని గెలుచుకున్న రెండవ భారతీయునిగా అభిజిత్ నిలిచారు. అయితే ప్రపంచ పేదరిక సమస్య పరిష్కారానికి అభిజిత్ సూచించిన పరిష్కారాలు మాత్రమే సరైన ఫలితాలను ఇస్తాయని భావించపనిలేదు. ఆర్థిక అసమానత్వంపై విస్తృత పరిశోధనలు చేసిన ప్రఖ్యాత ఆర్థికవేత్త థామస్ పికెట్టీ సూచించిన పరిష్కార మార్గాలు కూడా జోడిస్తే వ్యవస్థాగత మౌలిక మార్పులకు దోహదపడతాయి.

అర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందిన ఈ ముగ్గురి పరిశోధనలూ ప్రధానంగా ప్రపంచంలో పేదరికాన్ని నిర్మూలించేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని నోబెల్ అకాడమీ పేర్కొంది. ప్రపంచ పేదరిక సమస్యను అర్థం చేసుకుని, పరిష్కరించేందుకుగాను వీరు ఆ సమస్య తాలూకు ప్రశ్నలను మరింత సరళమైన, నిర్దిష్టమైన రూపంలోకి వడకట్టి, తద్వారా ఆ సమస్యకు పరిష్కారాన్ని సూచించే కృషిని చేశారనేది వారికి వస్తున్న ప్రశంస. అలాగే పేదరికానికి సంబంధించి ఈ సరళీకరించిన, నిర్దిష్ట ప్రశ్నలకు ప్రయోగాత్మక పద్ధతిలో పరిష్కారాలు కనుగొనేందుకు వీరు ప్రయత్నించారు.

ఈ పరిశోధనల కోసం తమ విశ్వవిద్యాలయం ఎమ్.ఐ.టి లో వీరు ‘పేదరిక (పరిష్కార) కార్యాచరణ ప్రయోగశాల’ను ఒకదానిని 2000 సంవత్సరం ప్రాంతంలో ఏర్పరిచారు. ఈ పరిశోధనలో వీరు తాము ఎంచుకున్న ఒక పేదరిక అంశానికి లేదా సమస్యకు పరిష్కార పద్ధతిని రెండు బృందాల ద్వారా పరీక్షించేవారు. వాటిలో ఒక బృందంపై ఈ పరిష్కార పద్ధతిని అమలు జరిపేవారు. రెండవ బృందాన్ని ఈ పద్ధతి నుంచి మినహాయించే వారు. అంటే ఇది ఒక రకంగా ఫార్మా రంగంలోని క్లినికల్ ట్రయిల్స్ ప్రయోగ పద్ధతి వంటిది. తద్వారా వారు ఒక నిర్దిష్ట పేదరిక సమస్యకు తాము సూచిస్తోన్న పరిష్కార పద్ధతి సామర్థ్యాన్నీ పరీక్షించేవారు.

ఈ విధంగా కనుగొన్న పరిష్కారం ద్వారా నిధుల కొరత అధికంగా ఉన్న భారత్ వంటి అభివృద్ధి చెందుతోన్న దేశాల ప్రభుత్వాలు, తమ పరిమిత వనరులను చీకట్లో రాయి విసిరినట్లు గుడ్డిగా తమకు తోచిన విధంగా పేదరిక నిర్మూలన కార్యక్రమాలకు ఖర్చు పెట్టడం కాకుండా, ఆ నిధులను కచ్చితమైన ఫలితాలను ఇచ్చే పద్ధతులపైన వాడవచ్చు అనేది ఈ ఆర్థికవేత్తల వాదన. ఈ విధంగా, ఎమ్.ఐ.టి.లోని ప్రయోగశాలలో అభిజిత్, ఎస్తర్‌లు జరిపిన పరిశోధనలూ, ఈ పరిశోధనా పద్ధతిని మైకెల్ క్రెమర్, కెన్యా దేశంలోని పాఠశాలలలో పరీక్షించడం ద్వారానూ కనుగొన్న పేదరిక నిర్మూలన పద్ధతులు కొన్నింటిని పరిశీలిద్దాం.

ఈ ప్రయోగ పద్ధతులను వారు ప్రధానంగా విద్య, వైద్య రంగాలలో కేంద్రీకరించారు. విద్యారంగంలో ఈ పద్ధతులను అనుసరించడం ద్వారా భారత్, ఆఫ్రికాలలో 60 లక్షలమంది పిల్లలకు మెరుగైన



విద్య ద్వారా ప్రయోజనం చేకూరిందనేది ఒక అంచనా. కాగా, వీరి సూత్రీకరణల ప్రకారంగా పాఠశాలల విద్యార్థులకు మరిన్ని పాఠ్య పుస్తకాలూ, ఉచిత భోజనాలను అందించడం కంటే, చదువులో వెనుకబడిన విద్యార్థులకు నిర్దిష్టంగా అదనపు ట్యూషన్ వంటి సాయం అందించడం ద్వారా, మరింత మెరుగైన ఫలితాలు వచ్చాయి. అలాగే, పిల్లలకు వారి కడుపులోని నులిపురుగులను నిర్మూలించే ఔషధాన్ని ఇవ్వడం అనే అతి చిన్న చర్య ద్వారా వారి ఆరోగ్యంలో మెరుగుదలా, వారి పాఠశాల హాజరును మెరుగుపరచడం సాధ్యం అయ్యాయని వారు చెబుతారు. ఇక తరగతి గదిలో ఒక ఉపాధ్యాయుడు బోధించాల్సిన విద్యార్థుల సంఖ్య, ఒక పరిమితిని మించితే దాని వలన విద్యా బోధన నాణ్యత పడిపోతుందనేది మనం నేటి వరకు నమ్ముతోన్న అంశం. కాగా, ఇది పూర్తిగా సరైనది కాకపోవచ్చుననీ, ఈ విధంగా విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తిని తగ్గించే యత్నం కంటే, విద్యార్థులకు మంచి గ్రేడ్‌లు వచ్చేలా బోధించగలిగితేనే, ఆ ఉపాధ్యాయునికి బోధనా కాంట్రాక్ట్‌ను పాఠశాల పొడిగించే విధానం మంచిదనేది ఈ నోబెల్ పరిశోధకుల తర్కం.

స్థూలంగా, ‘‘పరిమిత’’ వనరులు వున్న భారత్ వంటి దేశాలకు పేదరిక నిర్మూలనకుగాను ఈ లక్షిత పరిష్కార చర్యలు మంచి దనేది ఈ ఆర్థికవేత్తల తర్కం. కాగా, నేడు ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో అంతర్జాతీయ ద్రవ్య సంస్థల ఆదేశిత పొదుపు చర్యలు అమలు జరుగుతోన్న విషయం తెలిసిందే. ఈ చర్యలలో భాగంగా వివిధ ప్రభుత్వాలు తమ తమ దేశాల విదేశీ అప్పులను తీర్చగలిగేటందుకుగాను తమ దేశాలలోని సామాన్య ప్రజలకు కల్పించే సంక్షేమ పథకాలపై కోతలు పెడుతున్నాయి. అలాగే, వ్యయాల తగ్గింపులో భాగంగా ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్యను కుదించడం, కొత్తగా ఉద్యోగులను భర్తీ చేయకపోవడం, ఉద్యోగుల పింఛను సదుపాయం వంటి వాటిని కుదించడం వంటి చర్యలకు పాల్పడుతున్నాయి. ఇటువంటి చర్యలకు పెట్టిన పేరే ‘‘సంస్కరణలు’’.

కాగా, ఈ సంస్కరణలలో ఆయా దేశాల కార్పొరేట్లకూ, ధనవంతులకూ ఇచ్చే రాయితీలను పెంచుతూ పోవడం కూడా అంతర్భాగమే. ఉదాహరణకు, మన దేశంలో కూడా కార్పొరేట్లపై విధించే పన్నును తగ్గించడం... మరోవైపు, ద్రవ్య లోటును తగ్గించుకొనే పేరిట వంట గ్యాస్ సబ్సిడీ, కిరోసిన్ సబ్సిడీ, పంపిణీ వ్యవస్థ సబ్సిడీలు వంటి వాటిపై కోతలు వేస్తూ పోవడం వంటివన్నీ తెలిసినవే.

ఇటువంటి విధానాల ఫలితంగా నేడు మన దేశంలో ఆర్థిక సంక్షోభం నెలకొని వుంది. ఈ విషయాన్ని అభిజిత్ కూడా అనేక దఫాలు ప్రస్తావించారు. అలాగే గత వారం అమెరికాలోని బ్రౌన్ విశ్వవిద్యాలయంలో తాను చేసిన ఓ.పి జిందాల్ ఉపన్యాసంలో, భారత దేశంలో నెలకొన్న ఆర్థిక సంక్షోభ స్థితికి సూచించిన పరిష్కారాలలో ముఖ్యమైనవి ప్రజల చేతిలోకి డబ్బు చేరేలా చూడటం, జాతీయ ఉపాధి హామీ పథకంలో వేతనాలు పెంచడం, రైతులకు గిట్టుబాటు ధరను ఇవ్వడం వంటివన్నీ ఉన్నాయి. కాగా, ఈ పరిష్కారాలు అన్నీ ప్రస్తుతం అమలు జరుగుతోన్న పొదుపు చర్యలకు భిన్నంగా, ప్రభుత్వం మరింతగా వ్యయాలు పెంచడంతో కూడినవి.

అయితే అభిజిత్‌తోపాటు ఈ ఏడాది ఆర్థికరంగంలో నోబెల్ గ్రహీతలకు ఆ బహుమతిని తెచ్చిపెట్టింది, నేడాయన భారత ఆర్థిక వ్యవస్థలోని మాంద్య స్థితి పరిష్కారానికి సూచించిన పై స్థూల ఆర్థిక పరిష్కారాలు కాదు. అభిజిత్, ఆయన సహచరులు తమ దృష్టిని ప్రధానంగా ఆర్థిక రంగం తాలూకు.. అందులోనూ ముఖ్యంగా విద్య, వైద్యరంగాలలోని సూక్ష్మ అంశాలపై కేంద్రీకరించారు. అత్యంత కేంద్ర స్థాయిలో తరగతి గదిలో విద్యార్థులు నేర్చుకునే సమస్యలూ, వారి రోజువారీ పాఠశాల హాజరు, విద్యార్థుల విద్యార్జనపై వారి ఆరోగ్య ప్రభావం వంటి ప్రజల జీవితాల తాలూకు నిర్దిష్ట, అత్యంత సూక్ష్మ అంశాలపై వారు తమ పరిశోధనలను కేంద్రీకరించారు. తద్వారా, నిత్య జీవితంలో విద్య, వైద్యం వంటి రంగాల్లో తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించేందుకుగాను మనం అంతకుముందు ఎన్నడూ ఆలోచించి ఉండని పరిష్కారాలను వారు ముందుకు తెచ్చారు.

కాగా, ప్రభుత్వాల ఆర్థిక విధానాలూ, అవి ఆర్థిక వ్యవస్థ యాజమాన్యంలో అనుసరించే భిన్నమార్గాలు అనేవి అభిజిత్ ఆయన సహచరుల దృష్టిని కేంద్రీకరించిన సూక్ష్మస్థాయి అంశాలను ప్రభావితం చేసేవిగా ఉండగలవు. ఉదాహరణకు ప్రభుత్వ విధానాలు మారి, కార్పొరేట్లకు, ధనికులకు పన్నురాయితీలూ సబ్సిడీలు ఇవ్వడం కాకుండా వారిపై మరింతగా పన్నులు విధించడం వంటిది చేయగలిగితే ప్రభుత్వ ఖజానాకు అదనపు నిధులు సమకూరుతాయి.

ఆ స్థితిలో, నిధుల కొరత పరిస్థితుల్లో ఆమలు జరప వీలైనవిగా అభిజిత్, ఆయన సహచరులు చెప్పిన సూక్ష్మస్థాయి విధానాలకే ప్రభుత్వాలు పరిమితం కానవసరం ఉండదు. ప్రస్తుతం నెలకొన్న ఆర్థిక మాంద్యానికి, అభిజిత్ సూచించిన పైన పేర్కొన్న పరిష్కార మార్గాల అమలుకు కావల్సిన వనరులు ప్రభుత్వం వద్ద ఉంటాయి. కాబట్టి అభిజిత్‌కు నోబెల్ బహుమతిని తెచ్చిపెట్టిన విద్యా, వైద్య రంగాలలోని ప్రభావవంతమైన సూక్ష్మస్థాయి కార్యాచరణతోపాటుగా ప్రఖ్యాత ఆర్థికవేత్త, ప్రపంచంలోని ఆర్థిక అసమానతలపై విస్తృత పరిశోధనలు చేసిన థామస్ పికెట్టీ వంటి వారు సూచించిన, వ్యవస్థాగతంగానే మౌలిక మార్పులను తెచ్చే విధానాలు కూడా నేటి తక్షణ అవసరం.. ఆగత్యం కూడా..!!

వ్యాసకర్త ఆర్థికరంగ విశ్లేషకులు | మొబైల్ : 98661 79615

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### ఏం చేయాలి?



“నాకు చిన్నప్పటి నుంచీ కొందరు స్నేహితులున్నారు. 2014లో వాళ్లు ఫాసిస్టులకు దగ్గరవుతున్నారని అర్థమవడంతో మేం ఎవరి దారి వారు చూసుకున్నాం. కానీ, వారి తల్లిదండ్రులు ఇప్పటికీ నన్ను అభిమానిస్తుంటారు. అది నాకు చాలా ఇబ్బందికరంగా అనిపిస్తోంది. నేనేం చేయాలి?”

– మణిముగ్ధ శర్మ, క్విజ్ మాస్టర్

### ప్రశ్నలు



“ఇది నిజంగా భయంకరమైన విషయమే. ఒకవైపున కశ్మీర్‌లో కఠినమైన నిర్బంధం కొనసాగుతుంటే ఉగ్రవాదులు అక్కడ ఎలా చొరబడగలిగారు? సిటీలో ఎలా తిరగగలిగారు? ఈ ప్రశ్నలకు పోలీసులు, భద్రతా సిబ్బందీ సమాధానం చెప్పాల్సి ఉంది. ఆ బాధ్యత పూర్తిగా వారిపైనే ఉంది”

– మహబూబా ముఫ్తీ, పీడీపీ అధ్యక్షురాలు

### హిందూత్వ



“ప్రపంచ ఆకలి సూచికలో మన దేశం పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంకలకంటే దిగువకు పడిపోయింది. ఆ దేశాలతో పోలిస్తే భారత్‌లోనే ఆకలిగొన్న బాలలు ఎక్కువగా ఉన్నారు. పిల్లలూ, ఇక మీకు అచ్చే దిన్ వచ్చినట్టే, హిందూత్వను భుజించండి”

– మార్కండేయ కట్జూ, సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి

### రాగాలు



“గ్రామ సచివాలయ ఉద్యోగాలను సంపాదించుకున్న ఉత్సాహంలో ఉన్నారు టీడీపీ కార్యకర్తలు. వైఎస్ రైతు భరోసాలో లబ్ధిదారుల జాబితా వెలువడి గ్రామాల్లో పండగ వాతావరణం ఉంది. ఈయనేమో పులివెందుల పంచాయతీ, జె-ట్యాక్స్ అని ఏడుస్తుంటే క్షేత్ర స్థాయిలో తుపుక్కుమని ఊస్తున్నారు”

– విజయసాయిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

### తేడా



“నాకూ ట్రంప్‌కూ తేడాల్లో ఒకటేమిటంటే, తను అబద్ధాలు చెబుతాడు. నేను చెప్పను”

– బెర్నీ సాండర్స్, యూఎస్ సెనెటర్

### కక్షలు



“కర్ణాటక కాంగ్రెస్ నేత డీకే శివకుమార్ తల్లికీ, భార్యకీ కూడా సమన్లు జారీ చేశారు. అలాగే ప్రఫుల్ పటేల్ భార్యకు నోటీసులు ఇచ్చారు. 56 అంగుళాల ధైర్యశాలులైన దేశభక్తులు రాజకీయ కక్షలు తీర్చుకునే విధానం ఇదేనా?”

– వివేక్ తివారి, న్యాయవాది

### వెంటిలేటర్



“మన ఆర్థిక వ్యవస్థను ఈ ప్రభుత్వం ఐదేళ్లలో ఇంటెన్సివ్ కేర్‌కి పంపించింది. ప్రస్తుతం అది వెంటిలేటర్‌పై ఉంది. కానీ మన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. రఘురామ్ రాజన్‌నీ, మన్మోహన్ సింగ్‌నీ నిందిస్తారు. ఇంత పెద్ద అబద్ధాలు ఎలా చెబుతారో అర్థంకాక ఆశ్చర్యపోవాల్సిందే.”

– అజయ్ కామత్, వ్యాపారవేత్త

# ఉత్కృష్ట జీవన విధానమే హిందుత్వం

అభిప్రాయం



శ్యాంసుందర్ వరయోగి

*సర్వేజనాః సుఖినో భవంతు, సర్వే సంతు నిరామయ!..*
*సర్వే భద్రాణి పశ్యంతు, మాకశ్చిత్ దుఃఖ మాప్నియా!!*
*లోకః సమస్తా సుఖినో భవంతు...*

అంటే సర్వజనులు ఎలాంటి బాధలు లేకుండా సుఖశాంతులతో జీవించాలని హిందుత్వం అభిలషిస్తుంది. అంటే భారతీయులో, హిందువులో మాత్రమే సుఖశాంతులతో జీవించాలని హిందుత్వం కోరుకోవడం లేదు. ప్రపంచంలోని ప్రతి ఒక్కరూ ఆనందంగా జీవించాలనే విశాల దృక్పథాన్ని ప్రబోధించేది హిందుత్వం. కాబట్టే 1983లో చికాగో (అమెరికా)లో జరిగిన సర్వమత సమ్మేళనంలో స్వామి వివేకానంద హిందుత్వం గొప్పతనాన్ని చాటి చెప్పిన తర్వాత ఎంతోమంది క్రైస్తవ మత ప్రబోధకులు తమ అభిప్రాయాలను మార్చుకున్నారు. ఇటీవల సాక్షి దినపత్రికలో ప్రొ. కంచ ఐలయ్య రాసిన ‘మరి మతం మారితే అభ్యంతరమేల?’ అనే వ్యాసం (అక్టోబర్ 10, 2019) చదివిన తర్వాత ఆయన వైఖరి సమాజంలో భేద భావాలు పెంచే విధంగా ఉండటంతో నేను కొన్ని వాస్తవాలు తెలియజేయాలని ఈ వ్యాసం రాస్తున్నాను.

విదేశీయులెందరో ముఖ్యంగా పాశ్చాత్యులు హిందుత్వంలోకి మారి హిందూ ఆరాధనా పద్ధతులు ఆచరించడం, హిందూ దేవుళ్లను పూజించడం సాధారణమైంది. అందుకే ఆరెస్సెస్, విశ్వహిందూ పరిషత్, ఇస్కాన్ లాంటి సంస్థలెన్నో విదేశాల్లో ప్రాచుర్యం, ప్రజాదరణ పొందుతున్నాయి. ఎంతోమంది విదేశీయులు భారతీయ విధానంలో వివాహాలు చేసుకోవడం కూడా మనందరికీ తెలిసిందే. ఇలా ఆచరిస్తున్న వారెవ్వరినీ ఇంకెవరో ప్రలోభపెట్టో, మోసం చేసో, మరే విధంగానైనా ఒత్తిడి చేసో హిందుత్వ విధానాలు ఆచరింప జేయట్లేదనేది అక్షర సత్యం.

ఇక కంచ ఐలయ్య పేర్కొన్న ఆరెస్సెస్ పుస్తకం విషయానికి వస్తే అందులో అలాంటి విషయాలెన్నో ఉన్నా కేవలం క్రైస్తవ మహిళల అక్షరాస్యత అంశాన్ని మాత్రమే తీసుకొని తన భావాలకు అనుగుణంగా వక్రీకరించి రాయడం ఆయన హ్రస్వ దృష్టిని సూచిస్తోంది. హిందుత్వం ఎక్కడ మంచి ఉన్నా తనలో ఇనుమడింపజేసుకుంటుంది. అలాగే ఆరెస్సెస్ కూడా. అందుకే 1925లో విజయదశమి రోజు కేవలం 10–18 మంది చిన్నపిల్లలతో కలిసి డా. హెడ్గేవార్ నాటిన విత్తు క్రమపద్ధతిలో పెరిగి మొక్క అయి, వృక్షమై, ప్రస్తుతం వట వృక్షమై విశ్వవ్యాప్తమైంది. అలాంటి ఆరెస్సెస్ గతంలో కూడా ఎన్నో మంచి విషయాలను లోకానికి తెలియజేసింది. వాటిని కూడా ఆయన పేర్కొంటే బాగుండేది.

క్రిస్టియానిటీ స్త్రీ–పురుష అసమానత్వానికి చెందిన అనేక అడ్డంకులను దాటుకుంటూ వచ్చింది అని రాశారు. అందులో నూటికి నూరుపాళ్లు నిజం ఉంది. తప్పులేదు. కానీ హిందుత్వంలో స్త్రీ పురుష అసమానత్వం అనే ఆలోచనే లేదు. కాబట్టే ‘యత్ర నార్యస్తు పూజ్యతే రమంతే తత్రదేవతా’ అంటే ఎక్కడ నారీమణులు పూజింపబడతారో అక్కడే దేవతలు విహరిస్తారు అని హిందుత్వం స్పష్టంగా ప్రబోధిస్తుంది. త్రిమూర్తులే కాదు. భారతీయులంతా భూమిని భూదేవిగా, భారతమాతగా, గంగానదిని గంగామాతగా, ప్రకృతిని ప్రకృతి మాతగా పిలుస్తారు. అంటే స్త్రీని తల్లిగా భావించి గౌరవించడం, పూజించడం ఒక్క హిందుత్వంలోనే ఉంది. అంటే పురుషుడికంటే ఉన్నతమైన స్థానంలో అనాదిగా మహిళలు గౌరవింపబడుతున్నది భారతదేశంలోనే. అంతేకాదు సుప్రీం కోర్టు మాజీ




ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ రంగనాథ్ మిశ్రా ఒక సందర్భంలో భారత దేశంలో మహిళల పరిస్థితిని గురించి వివరిస్తూ, పురుషుల కంటే ఉన్నత స్థానంలో ఉన్నారని, కాబట్టి స్త్రీ పురుష అసమానత్వం అనేది భారతదేశంలోని మహిళలకు వర్తించదనడం భారత్‌లో మహిళలకు ఉన్న గౌరవ ప్రతిష్ఠలను తెలియజేస్తుంది. బ్రిటిష్ పరిపాలనకు పూర్వం భారత్‌లో అక్షరాస్యత అధికంగా ఉండేది. ప్రతి ఒక్కరికి గురుకులాలు అందుబాటులో ఉండేవి. బ్రిటిష్‌వారు ఇక్కడి విద్యా వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేశారు. వేద విజ్ఞానాన్ని నాశనం చేశారు. గణితంలో కీలకమైన ‘0’ (సున్నా)ని కనుగొన్నది భారతీయుడే. ప్రపంచంలో తొలిసారిగా ప్లాస్టిక్ సర్జరీ చేసింది శుశ్రుతుడు కాగా, ఆర్యభట్ట పేరు గడించిన ఖగోళ శాస్త్ర వేత్త అనే విషయం మనకు తెలిసిందే.

బ్రిటిష్ వారి కాలం నుంచి క్రిస్టియన్ మిషనరీలు భారతదేశంలో విద్యా వ్యవస్థను విచ్ఛిన్నం చేసి మత మార్పిడులకు పాల్పడ్డారు. వారి పాపకార్యం ఇప్పటికీ కొనసాగుతోంది. నిరక్షరాస్యులైన, అమాయకులైన దళితులను, గిరిజనులను, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి కష్టాల్లో ఉన్న వారిని వివిధ రకాలుగా ప్రలోభపెట్టి, మోస పూరిత విధానాలతో వారిని క్రైస్తవులుగా మారుస్తున్నది నిజం కాదా? భారత రాజ్యాంగంలో ప్రతిపౌరుడూ తనకి ష్టమైన మతాన్ని, పూజా విధానాన్ని ఆచరించే అవకాశం ప్రాథమిక హక్కుల్లో స్పష్టంగా పేర్కొంది. క్రైస్తవుల్లో అక్షరాస్యత ఎక్కువుంటే అందరూ క్రైస్తవులుగా మారితే తప్పేంటి? ఆరెస్సెస్ ఇందుకు అంగీకరించాలి. దేశంలో ఉన్న మత మార్పిడుల నిషేధ చట్టాలన్నీ తొలగించాలంటున్నారు. మతమార్పిడులకు ఆరెస్సెస్ ఎందుకు అనుమతించాలి. ఆరెస్సెస్ ప్రారంభం నాటి నుంచి నేటి వరకు స్పష్టమైన, భారతదేశానికి అవసరమైన విధానాలనే ఆచరిస్తుంది, తెలియజేస్తుంది. ఈ దేశంలో ఉంటూ, ఈ దేశ సంపదను దోచుకుతింటూ విదేశాలకు జైకొట్టే, విదేశీ శక్తుల చేతుల్లో కీలుబొమ్మలుగా మారిన దేశ వ్యతిరేకులెవరైనా, వారు క్రిస్టియన్ అయినా, ముస్లిం అయినా చివరికి హిందువులైనా ఆరెస్సెస్సే కాదు దేశభక్తులెవరూ సహించరు.

ప్రతి వ్యక్తిలో, ప్రతి మతంలో, ప్రతి వ్యవస్థలో, ప్రతి విషయంలో మంచి చెడులుండటం సహజం. అలాగే క్రైస్తవంలో ఉన్న ఒకే ఒక మంచి విషయాన్ని పట్టుకొని మిగిలిన మతాలవారు క్రైస్తవంలోకి రావాలనుకోవడం మూర్ఖత్వమే అవుతుంది. చరిత్రలో ఎన్నో ఆటుపోట్లకు లోనై కూడా ఇప్పటికీ అజరామరంగా విరాజిల్లుతున్న, అత్యున్నతమైన జీవన విధానాన్ని అందిస్తున్న హిందుత్వం లోకే క్రైస్తవులు (గతంలో వీరంతా హిందువులే) తిరిగి వస్తే తప్పేంటి? కంచ ఐలయ్య లాంటి వారు మతం మారినంత మాత్రాన హిందువులుగా మరణించిన వారి పూర్వీకుల ఆత్మలు ఘోషించవా? ఇప్పటికైనా మతం మారాలనుకునే ప్రతి ఒక్కరూ వారి పూర్వీకుల మతం పరిస్థితి ఏంటి? అనే విషయం ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

(ప్రొఫెసర్ కంచ ఐలయ్య 10–10–2019 (గురువారం) సాక్షి సంచికలో రాసిన వ్యాసానికి స్పందన)

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్, ఫౌండర్ అండ్ మేనేజింగ్ ట్రస్టీ రాఘవ్స్ ఫౌండేషన్, హైదరాబాద్

# అబద్ధమూ, నిజమూ!!

దేవుడిమీది భయంతోనే ఇప్పటికీ కొందరు అబద్ధాలు చెప్పడానికి ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు. అబద్ధం చెప్తే ఏదైనా జరగరానిది జరుగుతుందని భయం. కానీ తాళంకప్పను తెరవడానికి ఉపయోగించే నకిలీ తాళంలా అబద్ధాలు చెప్పినా ఫరవాలేదనుకున్న కొందరు ఆ భయాన్ని నెమ్మది నెమ్మదిగా విడిచిపెట్టి ఇవతలకు వస్తుంటారు. ఈరోజుల్లో పిల్లల దగ్గర ‘అబద్ధం చెప్తే నీ కళ్ళను దేవుడు పొడిచేస్తాడు‘ అని చెప్తే ‘నువ్వే అబద్ధం చెప్తున్నావు‘ అని పెద్దలనే ఎగతాళి చేయడం చూడొచ్చు. నిజం, అబద్ధం అంటూ విభజించలేనంతగా అబద్ధం మన జీవితంలో కలిసిపోయింది. పేలవమైన అబద్ధాలు చెప్పడం మొదలుపెడితే సులభంగా బయటపడిపోవడం తథ్యం. చరిత్ర అనే పేరుతో నమోదు చేసిన అబద్ధాలు, మతం పేరిట చెప్పిన అబద్ధాలు, కొన్ని దేశ విదేశ వాణిజ్య సంస్థలు చెప్పే అబద్ధాలు, కొందరు పాలకులు చెప్పే అబద్ధాలు ఎటువంటి వ్యతిరేకతా లేకుండా అందరి ఆమోదముద్రా పొంది మన మధ్యే చక్కర్లు కొడుతుంటాయి.




అబద్ధాలను తప్పించడం అసాధ్యం. కానీ అబద్ధాలను చెప్పవలసిన సందర్భాలను తప్పించడం మన గుప్పిట్లోనే ఉంది. అబద్ధాలను అబద్ధమే అని ఒప్పుకునే ధైర్యం మనకు ఉండాలి. అబద్ధాలను నిజంగా మలచగల ప్రయత్నమూ మననుంచే రావాలి. లేకుంటే ఓ ఆటలా మొదలైన అబద్ధం జూదంలా మనల్ని పీల్చిపిప్పి చేస్తుంది. అబద్ధం చెప్పడం మొదలుపెట్టిన తర్వాత ఇక ఆ చట్రంలో నుంచి ఇవతలకు రాలేక పినాసియో అనే చిన్నోడి ముక్కు అతి పొడవుగా పెరిగిపోయినట్లు ఓ చిన్నపిల్లల కథ ఉంది. అది నిజంగానే మారినట్లయితే మనలో చాలామందికి ముక్కు సహజంగా ఉండవలసిన రీతిలో ఉండదనేది అక్షరసత్యం. అయినా అబద్ధం అంటూ చెప్పడం మొదలు పెట్టిన తర్వాత అబద్ధాలను గుర్తు పెట్టుకుంటూ ఉండాలి. లేకుంటే అబద్ధాలే మనల్ని ఏదో క్షణంలో కిందపడేయడం తథ్యం. కానీ నిజం అలా కాదు. నిజం చెప్తే నిర్భయంగా ఉండొచ్చు. ఏ గొడవా ఉండదు. నిశ్చింతగా ఉండొచ్చు. అబద్ధం ఎన్నిసార్లు గెలిచినట్లనిపించినా అంతిమవిజయం మాత్రం నిజానిదే అని ప్రత్యేకించి చెప్పక్కర్లేదు.

– యామిజాల జగదీశ్

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
గురువారం ॥ 17-10-2019



# భార్య మనసు మారిపోయిందా?

**భార్య ప్రేమ భర్త మనసుకు తెలుస్తుంటుంది.**
**భార్య ద్వేషం కూడా భర్తకు తెలుస్తుంటుంది.**
**ఈ రెంటికీ కారణాలు ఉంటాయి.**
**కాని భార్యకు ద్వేషం ఉండి ప్రేమ నటిస్తుంటే?**
**మనసు లోపల ఏ అనుబంధం మిగుల్చుకోకుండా**
**కేవలం నాటకీయమైన ప్రేమ ప్రదర్శిస్తూ ఉంటే?**
**ఆ సంగతి భర్తకు తెలిసిపోతూ ఉంటే?**
**ఆ భర్త దానిని ఎలా అర్థం చేసుకోవాలి?**

సునంద ఆ రోజు భర్త ఆఫీసుకు ఫోన్ చేసింది.

'ఏమండీ ఏం చేస్తున్నారు?' అడిగింది.

'భోజనం చేశారా?' అడిగింది.

'ఇంటికి ఎప్పుడొస్తున్నారు?' అడిగింది.

'తొందరగా వచ్చేయండి మరి' అని గారం పోయింది.

భార్య ఫోన్ పెట్టేశాక రామచంద్రం ఆశ్చర్య పోయాడు. భార్య తన పట్ల కొంచెం జంకుగా ఉంటుంది. తను కొంచెం సరదాగా మాట్లాడితే తనూ సరదాగా మాట్లాడుతుంది. తన మూడ్‌ని బట్టి వ్యవహరిస్తుంది. అనవసర చనువు తీసుకోదు. అలాంటిది ఇలా ఫోన్ చేసి మాట్లాడటం చాలా ఆశ్చర్యంగా అనిపించింది.

* * *

ఇంటికి వెళితే భార్య ఉత్సాహంగా ఎదురు వచ్చింది.

'ఇవాళ ఏం వండానో చెప్పుకోండి చూద్దాం' అంది.

'ఏం వండావు?'

'మీకిష్టమని పాలకూర చికెన్ చేశాను'

'ఓ'...

'పిల్లలేరి?'

'వాళ్ల రూమ్‌లో టీవీ చూసుకుంటున్నారు లేండి. కాసేపట్లో పడుకుంటారు. స్నానం చేస్తారా? ముఖం కడుక్కుని భోజనం చేస్తారా?'

రామచంద్రం మళ్లీ ఆశ్చర్యపోయాడు. ఆఫీసు నుంచి వచ్చాక రాత్రుళ్లు అతడు స్నానం చేయడు. ఇన్నేళ్లలో ఎప్పుడూ చేయలేదు. ఇదేం ప్రశ్న.

'ముఖమే కడుక్కుంటాను'

'కడుక్కోండి మరి' అని అతడు బాత్‌రూమ్‌లో సింక్ దగ్గర ముఖం కడుక్కుంటూ ఉంటే టవల్ పట్టుకుని బాత్‌రూమ్ డోర్ దగ్గర నిలబడింది.

'ఏంటి సునందా.. ఏమైనా కావాలా? ఏమైనా కొనుక్కోవాలా?' అడిగాడు రామచంద్రం, భార్య తాపత్రయానికి నిజంగానే ఏదైనా అడిగితే ఇద్దామని.

'నాకేం కావాలండీ. మీరుంటే అదే పది వేలు. మీతో కాపురం తప్ప ఇంకేం కావాలి?' అంది సునంద నవ్వుతూ.

* * *

ఉదయం పూట పిల్లల్ని స్కూల్‌కి హుషారుగా తయారు చేస్తోంది సునంద. అంతకు ముందు పిల్లలను అప్పుడప్పుడు కసిరేది. విసుక్కునేది లేటవుతుంటే. ఇప్పుడలా లేదు. ముద్దు చేస్తోంది. భర్త రావడంతోటే 'ఒక్క నిమిషం అండీ' అని హడావిడిగా వెళ్లి టీ పెట్టుకుని వచ్చి ఇస్తోంది. ఆ రోజు పిల్లల కోసం ఉప్మా, అతని కోసం పూరీ చేసింది.

'ఉప్మా ఏం తింటార్లేండి మీరు. పూరి తినండి' అని కర్రీతోపాటు ఆవకాయ కూడా తెచ్చి పెట్టింది.

అతడు రెడీ అయ్యి బైక్ తీసి ఆఫీసుకు బయలుదేరుతుంటే బాక్స్ తెచ్చి చిరునవ్వుతో నిలబడింది.

ఆ తర్వాత ఇంట్లోకి వెళ్లిపోయింది.

రామచంద్రంకు గుటకలు పడ్డాయి. ఈమె ఇలా ఎందుకు మారిపోయింది.

* * *

రామచంద్రంకు, సునందకు పెళ్లయ్యి పదేళ్లు. ఒక కొడుకు, ఒక కూతురు ఉన్నారు. రామచంద్రంకు తల్లిదండ్రుల సపోర్ట్ లేదు. సునంద తల్లిదండ్రులే బాగా సపోర్ట్ చేశారు. అందుకే ఒక ఫ్లాట్ కొనుక్కున్నాడు. ఉద్యోగంలో వచ్చేది గొప్ప జీతం కాకపోయినా వారి సపోర్ట్ వల్ల పిల్లల్ని మంచి బడిలో చదివిస్తున్నాడు. రామచంద్రంకు బయట పెద్ద వ్యాపకాలు లేవు. ఆఫీసు, ఇల్లు.. అంతే తెలిసింది. సునందతో విపరీతంగా మాట్లాడటం కబుర్లు చెప్పడం అలా ఏమీ చేయడు. అతిగా వ్యవహరించడం అనుకుంటాడు. సునంద కూడా మామూలుగా బిహేవ్ చేస్తుంది. ఇద్దరిలో ఒకరి పట్ల ఒకరికి ప్రేమ ఎంత ఉందో తెలియకపోయినా ద్వేషం మాత్రం లేదు. అనుబంధం ఉంది. ఒకరి పట్ల ఒకరికి అవగాహన ఉంది. కాని సునంద ప్రవర్తన ఇలా మారడం అతడికి విచిత్రంగా ఉంది.

* * *

పదకొండు గంటలకు భార్య వాట్సప్ నుంచి ముద్దులు, లవ్ సింబల్స్ వచ్చాయి. ఇది ఇంకా స్ట్రేంజ్. సునంద వాట్సప్ వాడటం బహు తక్కువ. పిల్లలకు స్నాక్స్ అయిపోయినప్పుడు, వంట మరీ బద్దకించినప్పుడు ఫుడ్ తెచ్చుకోమనో పెడుతుంది. ఇలా ముద్దులు గిద్దులు పెట్టదు. రామచంద్రం ఆ మెసేజ్‌లు చూసి ఆ తర్వాత పనిలో పడిపోయాడు. రాత్రి కాస్త లేట్ కూడా అయ్యింది. ఇంటికొచ్చేసరికి ఇల్లు నిశ్శబ్దంగా ఉంది. పిల్లలను అప్పటికే నిద్ర పుచ్చేసినట్టుంది. సునందను చూసేసరికి అదిరిపోయాడు. ఏడ్చి ఏడ్చి ఉన్నట్టుగా కళ్లు ఎర్రగా అయిపోయి ఉన్నాయి. చాలా డిస్ట్రబ్డ్‌గా కనిపించింది. విసురుగా ఉన్నాయి కదలికలు.

'ఏమైంది?' అన్నాడు కంగారుగా.

'మీరు నా మెసేజ్‌లకు రిప్లై ఇవ్వలేదు' అంది.

'సునందా... ఏమిటి నీ ప్రవర్తన' అని అనునయంగా అన్నాడు రామచంద్రం.

ఆ రాత్రంతా సునంద ఏడుస్తూ ఉంది. రామచంద్రం ఎన్ని విధాలుగా చెప్పినా వినలేదు. ఇది చాలా విపరీత ప్రదర్శన అనుకుని రెండు మూడు రోజులు సైలెంట్‌గా ఉండి ఆ తర్వాత సైకియాట్రిస్ట్ దగ్గరకు తీసుకెళ్లాడు రామచంద్రం. ఆమెను లోపల వదిలి తాను తప్పుకున్నాడు.

సునందను చూసిన సైకియాట్రిస్ట్ 'తొందరేమీ లేదు మెల్లగా మాట్లాడుకుందాం' అని మంచి నీళ్లిచ్చింది.

* * *

**పదకొండు గంటలకు భార్య వాట్సప్ నుంచి ముద్దులు, లవ్ సింబల్స్ వచ్చాయి. ఇది ఇంకా స్ట్రేంజ్. సునంద వాట్సప్ వాడటం బహు తక్కువ. పిల్లలకు స్నాక్స్ అయిపోయినప్పుడు, వంట మరీ బద్దకించినప్పుడు ఫుడ్ తెచ్చుకోమనో పెడుతుంది. ఇలా ముద్దులు గిద్దులు పెట్టదు.**

సునంద చామనఛాయగా ఉంటుంది. పుట్టుకతో మడమ మెలికపడి ఉండటం వల్ల కాలు కొంచెం ఎగరేసి నడుస్తుంది. గమనించి చూస్తే తప్ప ఆ తేడా తెలియదు. కాని లోలోపల ఆ లోపం పట్ల న్యూనత పెంచుకొని కాలేజీకి వచ్చేసరికి చదువు మానేసింది. కొన్ని సంబంధాలు ఈ కాలి లోపం వల్ల తప్పిపోయాయి. అప్పుడు తల్లిదండ్రులు ఈ రామచంద్రం సంబంధం వెతికి చేశారు. ఇద్దరిదీ ఆర్థికంగా సమస్థాయి కాకపోయినా కూతురి కోసం దిగి వచ్చారు. రామచంద్రం ఊహల్లో ఉన్న భార్య వేరు. వచ్చిన భార్య వేరు. అయితే ఆ భార్యను అతడు ఎప్పుడూ ఆమెకు తెలిసేంత ప్రేమతో చూడలేదు. అలాగని దూరమూ లేడు. చాలా సాధారణ స్థాయిలో వ్యవహరించేవాడు. కాని అతడి లోపల ఉన్న ఏదో అసంతృప్తి అతని పిలుపు వల్ల తెలిసేది. 'ఎల్.సునంద' అని పిలిచేవాడు అప్పుడప్పుడు. ఆమె ఇంటి పేరు ఎల్ కాదు. ఎల్ అంటే 'లెగ్'. 'ఏమోయ్ లెగ్గూ' అనేవాడు అప్పుడప్పుడు. 'నల్ల పెళ్లాం' అనేవాడు. వాటికి సునంద నవ్వి ఊరుకునేది కాని లోపలి ప్రేమ వ్యక్తం చేసేది కాదు. ఈ మధ్య ఆమెకు ఒక ఫేస్‌బుక్ ఫ్రెండ్ పరిచయమయ్యాడు. మొదటి సారి అతడు 'మీరు బంగారమండీ' అన్నాడు. 'మీరు మహరాణి అండీ' అన్నాడు. 'మీ కళ్లల్లో స్వచ్ఛత అద్భుతం' అన్నాడు. 'నా కాలు సంగతి మీకు తెలియదు' అని సునంద అంటే 'కాలు ఎవరు చూస్తారండీ... మనసు చూడాలి' అన్నాడు. ఇవన్నీ సునందకు కొత్త. అందుకే తబ్బిబ్బు అవుతోంది. అయితే అవన్నీ వేరే మగవాడి నుంచి వినడం ఆమెకు ఇష్టం లేదు. అందుకే గిల్ట్ ఫీల్ అవుతోంది. ఆ గిల్ట్‌తో భర్త మీద అతి ప్రేమ మొదలెట్టింది. కొత్త స్నేహం కొనసాగించలేక, ఉన్న అనుబంధంలో తనకు కావలసింది పొందలేక ఆమె నలుగుబాటే ఈ కేస్.

సైకియాట్రిస్ట్ అంతా విని భర్తకు విడిగా చెప్పింది–'మీరు ఉట్టి భర్తగా కాకుండా ప్రేమించే భర్తగా మారాలి. లాలించే భర్తగా మారాలి. ఆమె లోపాలను దాటి ఇష్టపడే భర్తగా మారాలి. ఈ జన్మకు తనే మీ భార్య అని ఆమె అనుకుంటోంది. ఇద్దరు పిల్లల్ని కని ఇచ్చి జీవితాన్ని ఇచ్చి మీ నుంచి ఆశించే కొద్దిపాటి ప్రేమ కూడా పొందకపోతే ఆమె పరిస్థితి ఏమి కావాలి? చెప్పండి?' అంది.

రోజులు గడిచాయి.

సునంద ఫేస్‌బుక్ నుంచి బయటకు వచ్చేసింది.రామచంద్రంకు స్పెషల్ కాల్స్ చేయడం లేదు. స్పెషల్ మెసేజెస్ పెట్టడం లేదు. కాని అతడు ఇంటికొచ్చాక టీవీ చూస్తూ చేయి పట్టుకుని దగ్గర కూచోబెట్టుకున్నప్పుడు మాత్రం మనస్ఫూర్తిగా అతడి భుజాన తల వాల్చుతోంది.

– కథనం: **సాక్షి ఫీచర్స్ డెస్క్**

కమింగ్ సూన్

# ప్రేక్షకురాలిపైనే సినిమా!

సొంతిల్లు, కారు, బ్యాంక్ బ్యాలెన్స్.. ఈ మూడూ ఉంటే చాలు లైఫ్ హ్యాపీగా గడిచిపోతుంది అంటారు 'ఇన్ఫోసిస్' కంపెనీ వ్యవస్థాపకులు నారాయణమూర్తి సతీమణి సుధామూర్తి. సొంతిల్లు అన్నారు కానీ బంగళా అనలేదు. కారు అన్నారు కానీ ఆడీనో, బిఎండబ్ల్యూనో అనలేదు. బ్యాంక్ బ్యాలెన్స్ అన్నారు కానీ కోట్లు, లక్షల కోట్లు అనలేదు. నెల నెలా అద్దె కట్టే అవసరం లేకుండా సొంత ఇల్లు, ఏ వేళనైనా ఎక్కడికైనా వెళ్లేందుకు వీలుగా చిన్న కారు, ఊహించని ఆర్థిక అవసరాలకు ఎవరి దగ్గరా చెయ్యి చాచే అవసరం లేకుండా కొంత బ్యాంకు బ్యాలెన్స్ ఉండాలని సుధామూర్తి మాటల్లోని అంతరార్థం.



సుధామూర్తి



సుధామూర్తితో సినీ దర్శకురాలు అశ్వినీ అయ్యర్: ఇన్‌స్టాగ్రామ్‌లో అశ్విని షేర్ చేసిన ఫొటో

**సినిమాలను ఎంతగానో ఇష్టపడే, ప్రేమించే సుధామూర్తి పైనే ఇప్పుడొక సినిమా రాబోతోంది. కేవలం రెండు చిత్రాలతో ప్రసిద్ధురాలైన అశ్వినీ అయ్యర్ తివారీ ఆ సినిమాను తీయబోతున్నారు.**

ఇంట్లో మొక్కల్ని పెంచడం; కారులో భర్త పిల్లల్తో కలిసి ప్రకృతి అందాలను వీక్షించడానికి వెళ్లడం ఆమెకు ఇష్టమైన విషయాలు. ఇక సినిమాలంటే ఎంతిష్టమో చెప్పేపనే లేదు. రోజుకో సినిమానైనా చూడందే ఆమెకు నిద్రపట్టదు. ఏడాదికి కనీసం 365 సినిమాలు చూస్తారు సుధామూర్తి. ఈ 69 ఏళ్ల వయసులోనూ ఆమె సినిమాలను వదిలిపెట్టనే లేదు. ఇంతగా సినిమాలను ఇష్టపడే, ప్రేమించే సుధామూర్తి పైనే ఇప్పుడు ఒక సినిమా రాబోతోంది!

సుధామూర్తి దంపతుల జీవితకథను అశ్వినీ అయ్యర్ తివారి ఒక స్ఫూర్తివంతమైన సినిమాగా తియ్యబోతున్నారు. 'బరేలీ కీ బర్ఫీ', 'నీల్ బత్తి సనాటా' చిత్రాల దర్శకురాలే అశ్వనీ అయ్యర్. 2017లో వచ్చిన 'బరేలీ కీ బర్ఫీ' రొమాంటిక్ కామెడీ. అంతకుముందు ఏడాది వచ్చిన 'నీల్ బత్తి సనాటా' కామెడీ డ్రామా. సుధామూర్తితో కలిసి దిగిన ఫొటోను అశ్వినీ అయ్యర్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తూ.. ''నిజాయితీతో కూడి ఈ ఆలూమగల జీవితం నాకు పెద్ద ఇన్‌స్పిరేషన్'' అని రాశారు. అశ్వినీ అయ్యర్ తీయబోయే ఈ సినిమా బహుశా.. సుధామూర్తి దంపతులకు సొంతిల్లు, కారు, బ్యాంకు బ్యాలెన్సు లేని కాలం నుంచి మొదలవొచ్చు.

మనసు మంచిదే

# పెద్దమనిషీ పెద్దమనిషీ ముద్దెందుకు పెట్టావ్?!



పాల్ గ్యాస్కోయినే

ఈయన్ని చూడండి. ఎక్కడా చూసినట్లు అనిపించదు. పేరు వినండి. పాల్ గ్యాస్కోయినే. ఎక్కడా విన్నట్లూ అనిపించదు. మరి ఈయన సంగతి ఎందుకు? ఎందుకంటే మన దగ్గరా అప్పుడప్పుడు ఇలాంటి వాళ్లు కనిపిస్తుంటారు. 'తాడి చెట్టు ఎందుకు ఎక్కావ్ అంటే.. దూడ గడ్డి కోసం' అన్నట్లు.. ఏదో చెబుతుంటారు. ఈయనా అలాగే చెప్పాడు. 'ఆమెను ముద్దెందుకు పెట్టుకున్నావ్' అని కోర్టువారు అడిగితే.. 'ఆమెలో కాన్ఫిడెన్స్ లెవల్స్ పెంచడానికి ' అన్నాడు! పాల్ గ్యాస్కోయినే వయసు 52. ఒకప్పటి ఫుట్‌బాలర్. పేరున్నాయనే. గత ఏడాది ఆగస్టులో రద్దీగా ఉన్న రైలు బోగీలో ప్రయాణిస్తూ చప్పున ఒక యువతికి ముద్దే పెట్టేశాడు. పెట్టింది అక్కడా ఇక్కడా కాదు. పెదవుల మీద! ఛీ కొట్టేసి, రైలు దిగి వెళ్లిపోయాక ఆమె ఆయనపై కేసు పెట్టింది. ఆ కేసు నడుస్తూ, నడుస్తూ ఇన్నాళ్లకు పాల్‌కు తన వాదనను వినిపించుకునే అవకాశం వచ్చింది.

''ఆ టైమ్‌లో నేను తాగి ఉన్న మాట వాస్తవమే కానీ, తాగి ఉన్న కారణంగా నేను ఆమెను ముద్దుపెట్టుకోలేదు. అక్కడ ఉన్న వాళ్లలో కొందరు ఆమె వైపు చూస్తూ.. ఆమె లావుగా ఉందనీ, అసహ్యంగా ఉందనీ కామెంట్ చేస్తున్నారు. ఆ కామెంట్స్‌కి ఆమె నొచ్చుకోవడం, మనసు కష్టపెట్టుకోవడం నేను కళ్లారా చూశాను. వెంటనే ఆమె దగ్గరకి వెళ్లి.. ''విను. నువ్వు లావుగా లేవు. అంతేకాదు, నువ్వు చాలా అందంగా ఉన్నావు'' అని.. ఆమెను నమ్మించడం కోసం ఆమె పెదవులపై ముద్దు పెట్టుకున్నాను. ఆమెలో కాన్ఫిడెన్స్ పెంచడానికే నేను ఆమెను కిస్ చేశాను తప్ప నాలో ఏ చెడు ఆలోచనా లేదు మిలార్డ్..'' అని చెప్పాడు పాల్. అందుకు కోర్టువారేం తీర్పు చెప్పారో గురువారం కానీ తెలీదు.

**ఛీ కొట్టేసి, రైలు దిగి వెళ్లిపోయాక ఆమె ఆయనపై కేసు పెట్టింది. ఆ కేసు నడుస్తూ, నడుస్తూ ఇన్నాళ్లకు పాల్‌కు తన వాదనను వినిపించుకునే అవకాశం వచ్చింది.**



బలవంతపు ముద్దు (ప్రతీకాత్మక చిత్రం)

చెట్టు నీడ

# నక్క బుద్ధి

అడవిలో ఉండే నక్క ఒకటి ఒకనాడు దారితప్పి ఊళ్లోకి వచ్చేసింది. అది తోవ వెంబడి వెళుతుండగా ఒక కుక్క దానికి ఎదురువచ్చింది.

నక్క ఆ కుక్కను ఆశ్చర్యంగా చూస్తూ ''నీ మెడలో ఆ గొలుసు, ఆ బిళ్ల ఏమిటి?'' అని ప్రశ్నించింది.

''ఓహ్! అదా! నన్ను నా యజమాని పెంచుకుంటున్నాడు. వీధికుక్కలతో పాటు నన్ను పట్టుకువెళ్లి కాల్చివేయకుండా ఉండటానికి ఈ బిళ్లను నా మెడలో కట్టాడు'' అని కుక్క చెప్పింది.

'ఆశ్చర్యంగా ఉందే' అంది నక్క.

''నీవు అడవిలో ఉంటావు కాబట్టి నీకు తెలియదులే. మా యజమాని చాలా మంచివాడు. నన్ను తన ఇంట్లో పెట్టుకుని పెంచుకుంటున్నాడు. నాకు మంచి మంచి రొట్టెలు, మాంసం, పాలు అన్నీ పెడతాడు. అంతేకాదు, పడుకోవడానికి మెత్తటి పరుపు కూడా ఉంది.

అంతేకాదు మా యజమాని దగ్గర బోలెడు పిల్లులు కూడా ఉన్నాయి. జాతివైరం మరచి మేమంతా సరదాగా ఆడుకుంటాం'' అని చెప్పింది కుక్క.

''మిత్రమా! ఈ రోజు నుంచి మనమిద్దరం స్నేహితులం. నన్ను మీ ఇంటికి తీసుకుని వెళ్లు'' అంది నక్క.

సరేనని కుక్క నక్కను తన ఇంటికి తీసుకువెళ్లింది. యజమాని చూస్తే కొడతాడని నక్కను పెరట్లో చెట్టుచాటున దాచి తన రొట్టెలు, మాంసం దానికి పెట్టసాగింది కుక్క.

కుక్క తనకు చేసే అతిథిమర్యాదలకు సంతోషించాల్సింది పోయి అడవిలో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉంటే ఈ కుక్కకు ఇన్ని సౌకర్యాలు, ఇంత వైభోగమా అని అసూయ చెందింది నక్క.

''నీవొచ్చి చాలా రోజులైంది. నా యజమాని చూస్తే నిన్ను చంపేస్తాడు వెళ్లిపో'' అంది కుక్క. ''మిత్రమా! నిన్ను వదిలివెళ్లాలని లేదు. ఇంకొక్కరోజు ఉండి వెళతాను'' అంది నక్క. మరుసటిరోజు అందరూ నిద్ర పోతున్న సమయంలో నక్క పిల్లి పిల్లలను చంపి తిని, ఎముకలు పడేసి వెళ్లిపోయింది. నమ్మకంగా ఉంటూ కుక్క ఇంతపని చేసిందనుకున్న యజమాని కుక్కను చితక్కొట్టి ఇంటినుంచి తరిమేశాడు.

చెడ్డవారితో చెలిమి ఎప్పటికీ ప్రమాదమే!

పెట్టినిల్లు

# యజమానికి ఆకలి తెలుస్తుంది

పెట్ డాగ్‌ను పెంచుకోవాలనే కోరిక ఇటీవల బాగా పెరుగుతోంది. అయితే పెట్‌కి ఎంత ఆహారం పెట్టాలనే కొండంత సందేహం పెట్ పేరెంట్‌ని (పెట్ యజమాని) వెంటాడుతూనే ఉంటుంది. దానికి సమాధానం ఒక్కటే... దాని ఆకలిని బట్టి అది తినగలిగినంత పెట్టడమే. శునకాన్ని పెంచుకోవాలనుకునే వాళ్లు ముఖ్యంగా దానిని ఏ వయసులో పెంపకానికి తెచ్చుకోవాలనే విషయాన్ని తెలుసుకోవాలి. రెండు నెలల లోపు కుక్కపిల్లను పెంపకానికి తెచ్చుకోకూడదు. అప్పటి వరకు అది తల్లిపాలు తాగాల్సిందే. ఆ తర్వాత పెంపకానికి తెచ్చుకుని మామూలు ఆహారం పెట్టవచ్చు.

**పెరిగే దశ** రెండు నెలల నుంచి ఏడాది లోపు కాలాన్ని పెట్ గ్రోత్ పీరియడ్. ఇది చాలా ముఖ్యమైన దశ. ఈ వయసులో పెట్‌కి ఆకలి, అల్లరి రెండూ ఎక్కువే. రెండు నెలలు నిండిన పప్పీకి రోజుకు ఆరుసార్లు ఆహారం ఇవ్వాలి. ఆరు నెలల వయసుకు వచ్చేటప్పటికి మూడుసార్లు పెడితే



సరిపోతుంది. ఎనిమిది నెలలు నిండేటప్పటికి రోజుకు రెండుసార్లు తినేటట్లు అలవాటు చేయవచ్చు. ఇది ప్రధానంగా అనుసరించే ఆహారపు వేళలు. అయితే పిల్లలు ఎలాగైతే అందరూ ఒకేలాగ ఉండరు, ఒకేలాగ తినరో... అలాగే పెట్‌లో కూడా ఒకదానికీ మరొకదానికీ కొద్దిపాటి మార్పులు ఉంటాయి. కుక్కపిల్లను పెంచుకునేటప్పుడు దానికి– యజమానికి మధ్య అనుబంధం పెరుగుతుంది. దాంతో దానికి ఆకలి అయ్యే సమయం, దాని పొట్ట ఎంత పడుతుంది... వంటి వన్నీ 'పెంపుడు' తల్లిదండ్రులకు అర్థమవుతాయి.

బ్యూటిప్స్

# కనుబొమలకు ఆముదం

కనుబొమ్మలు సరైన ఆకృతిలోనే కాదు దళసరిగా ఉండేలా షేప్ చేయించుకోవడం ఇప్పుడు ట్రెండ్‌లో ఉంది. బాలీవుడ్–టాలీవుడ్ అనే తేడా లేకుండా ఈ ట్రెండ్‌ను ఫాలో అవుతున్నారు. కొంతమందికి కనుబొమలు ఒత్తుగా ఉంటాయి. లేదంటే ఖరీదైన కనుబొమ్మల కిట్‌ను కొనుగోలు చేసుకుని ఉపయోగిస్తారు. అలా చేయలేని వారు కూడా కనుబొమలు ఒత్తుగా పెరిగేలా ఇంట్లోనే ఒక సీరమ్‌ను తయారుచేసుకొని వాడుకోవచ్చు.



- 2 టేబుల్ స్పూన్ల ఆముదం
- టీ స్పూన్ కొబ్బరి నూనె
- 3–4 చుక్కల లావెండర్ ఆయిల్.

- చిన్న బాటిల్‌లో ఆముదం, కొబ్బరినూనె, లావెండర్ ఆయిల్ వేసి బాగా కలపాలి
- మస్కారా బ్రష్‌తో ఆ ఆయిల్‌ను అద్దుకుంటూ కనురెప్పలకు ఉపయోగించాలి
- టూత్ పిక్‌తో ఆయిల్‌ను అద్దుకుంటూ జాగ్రత్తగా కనుబొమ్మల వెంట్రుకలకు వాడాలి. ఈ ఆయిల్‌ను రోజుకు రెండు సార్లు వాడుకోవచ్చు. ఆముదంలో ఉండే ఫ్యాటీ యాసిడ్స్, కొబ్బరినూనె, లావెండర్ ఆయిల్‌లోని విటమిన్లు, ప్రొటీన్లు వెంట్రుకల వృద్ధికి తోడ్పడతాయి.




epaper.sakshi.com

సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ ॥ గురువారం
17-10-2019

# ఈ కాంబినేషన్ కొత్తగా ఉంది

- మహేశ్‌బాబు


మహేశ్‌బాబు, విజయ్ దేవరకొండ

సినిమా ట్రైలర్‌ని మహేశ్‌బాబు విడుదల చేశారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ– ''మీకు మాత్రమే చెప్తా' కథాంశం బాగా నచ్చి నేనే నిర్మించా. నిర్మాత బాధ్యతలు మా నాన్న వర్ధన్ దేవరకొండగారు తీసుకున్నారు. నా మనసుకు నచ్చిన సినిమా ఇది. నా అభిమాన హీరో మహేశ్‌గారు ట్రైలర్ విడుదల చేయడం ఆనందంగా ఉంది'' అన్నారు. ''ఈ మూవీలో నన్ను హీరో అంటున్నారు. కానీ, నేను ఓ నటుడిగానే భావిస్తున్నా. కథ, కథనాలు ఫన్‌గా ఉంటాయి'' అన్నారు తరుణ్ భాస్కర్. ''ఈ సినిమా ఓ సంఘటన ఆధారంగా ఉంటుంది. డైలాగ్స్ రాసిన తరుణ్ భాస్కర్‌కి థ్యాంక్స్. అందరికీ కనెక్ట్ అయ్యే పాయింట్‌తో ఎంటర్‌టైన్ చేయబోతున్నాం'' అన్నారు షమ్మీర్ సుల్తాన్. నటీనటులు అనసూయ భరద్వాజ్, వాణి భోజన్, అభినవ్ గోమటం, నవీన్ జార్జ్ థామస్ మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: మదన్ గుణదేవా, సంగీతం: శివకుమార్, లైన్ ప్రొడ్యూసర్: విజయ్ మట్టపల్లి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అనురాగ్ పర్వతనేని.

''విజయ్ ప్రొడ్యూసర్, తరుణ్ భాస్కర్ హీరో అని వినగానే కొత్తగా అనిపించింది. నాకు బాగా నచ్చిన సినిమా 'పెళ్ళి చూపులు'. నిర్మాతగా విజయ్ చేస్తున్న ఈ ప్రయత్నం విజయవంతం కావాలని కోరుకుంటున్నా. 'మీకు మాత్రమే చెప్తా' ట్రైలర్ చాలా బాగుంది. కథ ఆసక్తిగా అనిపించింది'' అని హీరో మహేశ్‌బాబు అన్నారు. తరుణ్ భాస్కర్, అనసూయ భరద్వాజ్, అభినవ్ గోమటం, పావని గంగిరెడ్డి ముఖ్య తారలుగా షమ్మీర్ సుల్తాన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మీకు మాత్రమే చెప్తా'. కింగ్ ఆఫ్ ద హిల్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై విజయ్ దేవరకొండ, వర్ధన్ దేవరకొండ నిర్మించిన ఈ


వెంకటేశ్

# రేస్ మొదలు

'వెంకీ మామ' సినిమా కోసం అల్లుడు నాగ చైతన్యతో కలసి అల్లరి చేశారు వెంకటేశ్. ఇప్పుడు కొత్త సినిమా కోసం రేసు మొదలుపెడుతున్న సంగతి తెలిసిందే. ఈ రేసు డిసెంబర్ నెలలో ప్రారంభం అవుతుందని సమాచారం. 'పెళ్ళి చూపులు, ఈ నగరానికి ఏమైంది' చిత్రాలను తెరకెక్కించిన తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో వెంకటేశ్ ఓ సినిమా చేయనున్నారు. హైదరాబాద్‌లోని మలక్‌పేట్ రేసింగ్ క్లబ్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రకథ సాగనుందట. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ డిసెంబర్‌లో మొదలు కానుందని తెలిసింది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన సెట్లను హైదరాబాద్‌లోని ప్రముఖ స్టూడియోలో రూపొందిస్తున్నారు. సురేశ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సురేశ్‌బాబు ఈ సినిమాను నిర్మించనున్నారు.


కీర్తి సురేశ్

# నవ్వుల కీర్తి

'హైదరాబాద్ బ్లూస్, ఇక్బాల్' వంటి సినిమాలను తెరకెక్కించిన హైదరాబాదీ దర్శకుడు నగేష్ కుకునూర్ స్పోర్ట్స్ రామెడీ (రొమాంటిక్ కామెడీ) జానర్‌లో తెలుగులో తొలిసారి ఓ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఆది పినిశెట్టి, కీర్తీ సురేశ్, జగపతిబాబు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. 'దిల్' రాజు సమర్పణలో సుధీర్ చంద్ర నిర్మిస్తున్నారు. ఇవాళ కీర్తీ సురేశ్ పుట్టినరోజు. ఈ సందర్భంగా సినిమాలో కీర్తి లుక్‌ను రిలీజ్ చేశారు. మెడలో తాయత్తు, చేతికి మట్టి గాజులతో హాయిగా నవ్వుతూ కీర్తి కొత్త లుక్‌లో కనిపిస్తున్నారు. షూటింగ్ చివరి దశలో ఉన్న ఈ చిత్రం చివరి షెడ్యూల్ వచ్చే నెల 11 నుంచి హైదరాబాద్‌లో జరగనుంది. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, సహ నిర్మాత: శ్రావ్య వర్మ.

# రొమాంటిక్‌లో గెస్ట్


రమ్యకృష్ణ

దర్శకుడు పూరి జగన్నాథ్ తనయుడు ఆకాశ్ పూరి తన కొత్త సినిమా కోసం రొమాంటిక్‌గా మారిన సంగతి తెలిసిందే. నూతన దర్శకుడు అనిల్ పాదూరి దర్శకత్వంలో ఆకాశ్ పూరి హీరోగా తెరకెక్కుతున్న చిత్రం 'రొమాంటిక్'. కేతికా శర్మ హీరోయిన్. పూరీ కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, చార్మి నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో రమ్యకృష్ణ ఓ కీలక పాత్ర చేస్తున్నట్టు చిత్రబృందం ప్రకటించింది. బుధవారం నుంచి ఈ సినిమా షూటింగ్‌లో రమ్యకృష్ణ పాల్గొంటున్నారు. ఈ సినిమాలో ఆల్రెడీ బాలీవుడ్ భామ మందిరా బేడీ కీలక పాత్ర చేస్తున్నారు.

**15 ఏళ్ల తర్వాత...**


కృష్ణవంశీ

క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీ తదుపరి సినిమా ఏంటి? అనే ఆసక్తి ప్రేక్షకుల్లోనూ, ఇండస్ట్రీలోనూ బాగా ఉంది. ఆయన నెక్ట్స్ సినిమాను బుధవారం అధికారికంగా ప్రకటించారు. ప్రకాశ్‌రాజ్, రమ్యకృష్ణ జంటగా 'రంగమార్తాండ' అనే చిత్రాన్ని రూపొందించనున్నారు కృష్ణవంశీ. అభిషేక్ జాకర్, మధు కలిపు నిర్మించనున్నారు. ఈ సినిమా 'నటసామ్రాట్' అనే మరాఠీ సినిమాకు రీమేక్. త్వరలోనే ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్లనుంది. 2004లో కృష్ణవంశీ దర్శకత్వంలో వచ్చిన 'శ్రీ ఆంజనేయం' సినిమాలో రమ్యకృష్ణ కీలక పాత్ర చేశారు. అంటే.. 15 ఏళ్ల తర్వాత మళ్లీ భర్త దర్శకత్వంలో రమ్యకృష్ణ యాక్ట్ చేయబోతున్నారు. అయితే అప్పుడు గెస్ట్ రోల్. ఇప్పుడు కథానాయిక.

# ఏడాది చివర్లో పండగ


రాశీ ఖన్నా, సాయి తేజ్

సాయి తేజ్, రాశీ ఖన్నా జంటగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ప్రతిరోజూ పండగే'. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మిస్తున్నారు. ఎస్‌కేఎన్ సహ–నిర్మాత. ఈ సినిమాను డిసెంబరు 20న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం బుధవారం వెల్లడించింది. ''కుటుంబ భావోద్వేగాలతో ఈ సినిమాను చక్కగా తెరకెక్కిస్తున్నారు మారుతి. సాయి తేజ్‌కు తాతయ్య పాత్రలో ప్రముఖ నటుడు సత్యరాజ్ నటిస్తున్నారు. రావురమేష్ గారిది కీలక పాత్ర. సాయి తేజ్‌ను కొత్త పాత్రలో చూడబోతున్నారు. ఈ సినిమాలో తాత–మనవడి మధ్య ఉన్న అనుబంధం ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. కటుంబ విలువలు, ఆప్యాయతలతో ఈ సినిమా మంచి ఎమోషనల్‌గా ఉంటుంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: తమన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: బాబు.


వరంగల్ శ్రీను, కల్యాణ్, ఓంకార్, ఛోటా కె.నాయుడు, అశ్విన్, అవికా గోర్

# నేనీ స్థాయిలో ఉండటానికి కారణం నా తమ్ముళ్లే

- ఓంకార్

అశ్విన్, అవికా గోర్ జంటగా నటించిన చిత్రం 'రాజుగారి గది 3'. ఓక్ ఎంటర్‌టైన్మెంట్స్‌పై ఓంకార్ స్వీయదర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా రేపు విడుదలకానుంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ–రిలీజ్ వేడుకలో ప్రముఖ కెమెరామన్ ఛోటా కె. నాయుడు మాట్లాడుతూ– ''ఈ చిత్రం సంచలన విజయం సాధిస్తుంది. సాంకేతిక అభివృద్ధి వల్ల నటీనటుల్లో బద్ధకం పెరిగిందని నేను చెప్పినట్లు ఓ దిన పత్రికలో వచ్చింది. నా ఉద్దేశం అది కాదు. సాంకేతికత పెరగడం వల్ల సాంకేతిక నిపుణుల పని కాస్త తేలికైందని నా అభిప్రాయం' అన్నారు. ''యాంకర్ నుంచి నేనీ స్థాయికి ఎదగడానికి కారణం నా తమ్ముళ్లు అశ్విన్, కల్యాణ్. చదువును కూడా మర్చిపోయి నా కెరీర్ కోసం కష్టపడ్డారు. నాకు జన్మనిచ్చింది మా అమ్మానాన్నలు అయితే.. నా సినీ కెరీర్‌కు జన్మనిచ్చింది నా తమ్ముళ్లే. ఈ సినిమాతో అశ్విన్ హీరోగా పరిచయం అవుతున్నాడు. కల్యాణ్ నిర్మాతగా త్వరలో ఓ సినిమా తెరకెక్కనుంది. ఈ సినిమాను తెలుగు రాష్ట్రాల్లో డిస్ట్రిబ్యూట్ చేస్తున్న వరంగల్ శ్రీనుగారి నమ్మకం నిజం అవుతుందని నమ్ముతున్నాను. మా నాన్నగారు గత ఏడాది చనిపోయారు. అందుకే నేను ఎక్కువగా తెల్ల దుస్తుల్లో కనిపిస్తున్నా. ఈ సినిమాతో అశ్విన్‌ను ప్రేక్షకులు హీరోగా అంగీకరించిన తర్వాత తిరిగి మామూలు దుస్తులు వేసుకుంటాను'' అన్నారు ఓంకార్. ''జీనియస్' నుంచి ఇప్పటివరకు ఐదు సినిమాలు చేశాను. హీరోగా ఈ శుక్రవారం నా డ్రీమ్‌ను చూడబోతున్నాను'' అన్నారు అశ్విన్. ''ఇదివరకు 'హుషారు', 'ఇస్మార్ట్ శంకర్', 'గద్దలకొండ గణేష్' సినిమాలను డిస్ట్రిబ్యూట్ చేశాను. ఈ విజయాల వరుసలో ఈ చిత్రం కూడా చేరుతుంది'' అన్నారు వరంగల్ శ్రీను.

# పల్లెటూరి ప్రేమకథ


సుధ, రవితేజ, అన్నపూర్ణ, జమున

సీనియర్ నటి అన్నపూర్ణ, మాస్టర్ రవితేజ ప్రధాన పాత్రల్లో శివనాగేశ్వరరావు (శివనాగు) దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అన్నపూర్ణమ్మ గారి మనవడు'. ఎమ్ఎన్నార్ చౌదరి నిర్మించిన ఈ సినిమా నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శివనాగు మాట్లాడుతూ– ''అనుబంధాలు, ఆత్మీయతలు, పల్లెటూరి ప్రేమలు ఆవిష్కరించే చిత్రమిది. ముద్దపప్పు, ఆవకాయ భోజనం ఎంత రుచికరంగా ఉంటుందో మా సినిమా కూడా అంతలా ప్రేక్షకులను మెప్పించేలా ఉంటుంది. అమరావతి సమీపంలోని వైకుంఠపురం అనే పల్లెటూరిలో మా సినిమా చిత్రీకరణ జరిపాం. అక్కినేని అన్నపూర్ణమ్మగా అన్నపూర్ణ, అక్కినేని అనసూయమ్మ పాత్రలో జమునగార్లు నటించారు'' అన్నారు. ''ప్రస్తుతం డీటీయస్ పనులు జరుగుతున్నాయి. నవంబర్‌లో సినిమాను రిలీజ్ చేయాలనుకుంటున్నాం'' అన్నారు ఎమ్ఎన్నార్ చౌదరి.

# బాలు పాట హైలైట్


యస్పీబీ, రవివర్మ

అమిత్, ఇందు, సుమన్, హరిత ముఖ్య తారలుగా శ్రీకాంత్ శ్రీ అప్పలరాజు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'చీమ–ప్రేమ.. మధ్యలో భామ'. చీమ ప్రధాన పాత్రలో కనిపించే ఈ చిత్రాన్ని మాగ్నమ్ ఓపస్ ఫిలిమ్స్‌పై లక్ష్మీనారాయణ నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ– ''ఈగ' సినిమా మాకు స్ఫూర్తి. చీమ పాత్రని అపురూపంగా మలచిన తీరుకు అద్దం పట్టేలా ఎస్పీ బాలసుబ్రమణ్యంగారు టైటిల్ సాంగ్‌ని అద్భుతంగా ఆలపించారు. రవివర్మగారి సంగీత సారథ్యంలో రూపొందిన ఈ పాట పదికాలాలు అందర్నీ అలరిస్తుందని మా ప్రగాఢ విశ్వాసం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: రవివర్మ, కెమెరా: ఆరిఫ్ లలాని.

# గ్యాంగ్‌స్టర్ గంగూభాయ్


ఆలియా భట్

త్వరలో ముంబై గ్యాంగ్‌స్టర్‌గా కొత్త అవతారం ఎత్తనున్నారు బాలీవుడ్ బ్యూటీ ఆలియా భట్. ప్రముఖ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో ఆలియా భట్ లీడ్ రోల్‌లో 'గంగూభాయ్ కతియవాడి' అనే సినిమా తెరకెక్కనుంది. ఈ సినిమా అధికారిక ప్రకటన బుధవారం వెల్లడైంది. ఓ పాత్రికేయురాలు రాసిన ఓ బుక్ ఆధారంగా ఈ సినిమా తెరకెక్కనుందని బాలీవుడ్ సమాచారం. ఈ సినిమాను వచ్చే ఏడాది సెప్టెంబరు 11న విడుదల చేయాలనుకుంటున్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే... సల్మాన్‌ఖాన్, ఆలియా భట్ హీరో హీరోయిన్లుగా సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వంలో తెరకెక్కాల్సిన 'ఇన్‌షా అల్లా' చిత్రం ఆగిపోయిన సంగతి తెలిసిందే. 'ఇన్‌షా అల్లా' సెట్స్‌పైకి వెళ్లకపోవడంతో ఆలియా చాలా బాధపడ్డారని, ఈ కారణం చేతనే ఆలియాతో భన్సాలీ ఈ లేడీ ఓరియంటెడ్ సినిమాను తెరకెక్కిస్తున్నారని బాలీవుడ్ టాక్.

# మలుపుల సరోవరం

విశాల్ వున్న, ప్రియాంకా శర్మ, శ్రీలత, తనికెళ్ల భరణి, 'ఛత్రపతి' శేఖర్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'సరోవరం'. సురేష్ యడవల్లి దర్శకత్వంలో శ్రీలత సినీ క్రియేషన్స్ పతాకంపై ఎస్. శ్రీలత నిర్మించిన ఈ సినిమా రేపు విడుదలవుతోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో సురేష్ యడవల్లి మాట్లాడుతూ– ''సరోవరం' అనే గ్రామంలో జరిగిన కథ ఇది. భావోద్వేగంతో


ప్రియాంక, విశాల్

నడిచే ఈ కథలోని మలుపులు ప్రేక్షకులను కట్టిపడేస్తాయి'' అన్నారు. ''మా సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుందని భావిస్తున్నాం'' అన్నారు ఎస్.శ్రీలత. ''మాస్‌కు కావాల్సిన అంశాలతో పాటు యూత్‌ని ఆకట్టుకునే అంశాలు కూడా ఉన్నాయి'' అన్నారు నటులు 'జబర్దస్త్' నవీన్, రాము. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: పులి ఈశ్వర్ రావు.



## మరీ అవసరమైతే తప్ప నొప్పి నివారణ మందులు వద్దు!



నొప్పి నివారణ మందులైన పెయిన్ కిల్లర్స్, ఎన్ఎస్ఏఐడీస్ (నాన్ స్టెరాయిడ్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డ్రగ్స్) వాడటం సరికాదని మందులకు అధికారికంగా అనుమతి ఇచ్చే అమెరికాకు చెందిన ఫుడ్ అండ్ డ్రగ్స్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) 2005లోనే హెచ్చరికలు చేసింది. ఆ హెచ్చరికల్లో వాస్తవం ఉందని ఇటీవలి అధ్యయనాల్లో మళ్లీ మరోసారి నిరూపితమైంది. నొప్పి నివారణ మందులు వాడాల్సి వస్తే వాటిని ఒకటి, రెండు వారాలకు మించి వాడవద్దని ఎఫ్‌డీఏ మరోమారు హెచ్చరిస్తోంది. ఎన్ఎస్ఏఐడీ వంటి నొప్పినివారణ మందులను దీర్ఘకాలం వాడటం వల్ల అది గుండెజబ్బులు, పక్షవాతం వచ్చే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. అయితే ఆస్పిరిన్ కూడా ఎన్ఎస్ఏఐడీ ల విభాగానికే చెందినదే అయినా దీనికి మాత్రం మినహాయింపునిచ్చారు. దీన్ని దీర్ఘకాలం వాడినా పర్వాలేదన్న మాట. ఇక ప్రత్యేకంగా ఇప్పటికే గుండెజబ్బులు (కార్డియోవాస్క్యులార్ డిసీజెస్) ఉన్నవారు, బైపాస్ అయినవారు, ఒకసారి గుండెపోటు వచ్చినవారు నొప్పినివారణ మందులు తీసుకోవాల్సి వస్తే... ఆన్‌కౌంటర్ మెడిసిన్‌లా కాకుండా, తప్పక డాక్టర్‌ను సంప్రదించాకే వాటిని వాడాలని ఎఫ్‌డీఏకు చెందిన నిపుణులు సూచిస్తున్నారు.

## జీన్స్ ప్యాంట్లతో జాగ్రత్త!



బహుశా ఫ్యాషన్ ప్రపంచంలో జీన్స్ ప్యాంట్ పొందినంత ప్రాచుర్యం మరే ఇతర దుస్తులూ పొంది ఉండవు. ఎన్నో ఏళ్ల క్రితం ప్రారంభమైనా ప్యాంట్స్‌లో అప్పటికీ, ఇప్పటికీ జీన్స్‌దే ఆధిపత్యం. రఫ్ అండ్ టఫ్‌గా ఉపయోగించడానికి అనువైనవి కావడంతోపాటు సౌకర్యమూ ఉండటం వల్ల ఈ ఆధిపత్యం ఇలాగే కొనసాగుతోంది. అయితే జీన్స్ ప్యాంట్ల వల్ల కలిగే అనర్థాలపై జరిగిన అధ్యయనాల్లోని అనేక అంశాల్లో ఒకటి కాస్త ఆందోళన గొలిపేదిగానే ఉంది. జీన్స్ వేసుకొని కింద కూర్చోవడం, అందునా జీన్స్ ప్యాంట్లు తొడిగి బాసిపట్లు వేయడం (సక్లముక్లం వేసి కూర్చోవడం) ఆరోగ్యానికి అంత మేలు కాదంటున్నారు ఆరోగ్య నిపుణులు. జీన్స్ ప్యాంట్ తొడుక్కొని ఇలా కూర్చోవడం వల్ల కండరాలు, నరాలు దెబ్బతింటాయనీ, ఇది మరీ విషమిస్తే ఒక్కోసారి జీన్స్ ప్యాంట్లతో బాసిపట్లు (సక్లంముక్లం) వేసుకుని కూర్చునేవారు అస్సలు నడవలేని పరిస్థితి కూడా రావచ్చని హెచ్చరిస్తున్నారు. వ్యాయామం చేసే సమయంలోనూ జీన్స్ వేసుకొని 'స్క్వాటింగ్' చేయవద్దని హెచ్చరిస్తున్నారు. ఈ అంశాలన్నింటినీ 'జర్నల్ ఆఫ్ న్యూరాలజీ, న్యూరోసర్జరీ, సైకియాట్రీ' అనే మెడికల్ జర్నల్‌లో పరిశోధకులు ప్రచురించారు.

## చిన్నపిల్లల్లో వచ్చే లుకేమియాను నివారించే తల్లి పాలు

చిన్నారుల్లో వచ్చే అన్ని రకాల రక్త సంబంధమైన క్యాన్సర్లను తల్లిపాలు నివారిస్తాయని ఇజ్రాయెల్ పరిశోధకులు నిర్వహించిన అధ్యయనాలలో తేలింది. చిన్నపిల్లలో వచ్చే క్యాన్సర్లలో రక్త సంబంధమైనవి (ల్యూకేమియా) దాదాపు 30 శాతం ఉంటాయి. దాదాపు 18 రకాల అధ్యయనాల్లో తేలిన విషయం ఏమిటంటే కనీసం ఆర్నెల్ల పాటైనా తల్లిపాలు తాగిన వారిలో బ్రెస్ట్ మిల్క్ ఈ బ్లడ్‌క్యాన్సర్లు వచ్చే అవకాశాలను 14 శాతం నుంచి 19 శాతం వరకు తగ్గిస్తుందని తేలింది. కేవలం క్యాన్సర్ల నివారణ మాత్రమేగాక... తల్లిపాలు అకస్మాత్తుగా కారణం తెలియకుండా పిల్లలు మృతిచెందే కండిషన్



అయిన సడన్ ఇన్‌ఫ్యాంట్ డెత్ సిండ్రోమ్ (ఎస్ఐడీఎస్), ఉదరకోశవ్యాధులు (గ్యాస్ట్రో ఇంటస్టినల్ ఇన్ఫెక్షన్స్), చెవి ఇన్ఫెక్షన్లను నివారిస్తుందని తేలింది. అంతేకాదు... చాలాకాలం పాటు తల్లిపాలు తాగిన పిల్లలకు భవిష్యత్తులో స్థూలకాయం, టైప్-2 డయాబెటిస్ వచ్చే రిస్క్ కూడా చాలా తక్కువని తేలింది. ఈ అధ్యయన ఫలితాలన్నీ 'జామా పీడియాట్రిక్స్' అనే మెడికల్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.


సాక్షి ఫ్యామిలీ

నల్లగొండ ॥ గురువారం 17-10-2019


● గృహ- విష(య)ం

**ఇంటిదొంగను ఈశ్వరుడైనా పట్టలేడన్న సామెత అందరికీ తెలిసిందే. మన ఇంట్లోనే దాగి ఉండి... మనకు హాని చేసే ఈ విషాల విషయంలో అది అక్షర సత్యం. మనం నిరపాయకరంగా భావించే అనేక చోట్ల ఈ విషాలు నక్కి ఉంటాయి. మన నట్టింట్లో అనుక్షణం నడయాడుతుంటాయి. మనింట్లో మనకే తెలియకుండా పొంచి ఉండి కాటేసి చిమ్మే అనేక విషాలనూ... వాటికి విరుగుడు మార్గాలను తెలుసుకుందామా. వాటి గురించి ఒక అవగాహన కల్పించుకోవడం కోసమే ఈ కథనం.**



● ఇళ్లలో కనపడకుండానే అనేక చోట్ల ఉండే రసాయన విషాలు

# ఈ ఇంటిదొంగలను పట్టేద్దామా?!

ఇటీవల మన ఇండ్లలోకి కొత్తరకం పాత్రలు వస్తున్నాయి. లోహం అయితే చాలా బరువుగా ఉండటం వల్ల ఈ తరహా పాత్రలు ఇప్పుడు వినియోగదారులను ఆకర్శిస్తున్నాయి. నిజానికి చాలా అందంగా కనిపించే ఈ బౌల్స్ ఆరోగ్యానికి అంత అందమైనవి కావు. ఈ పాత్రలు 'మెలామైన్' అనే ప్లాస్టిక్‌లాగానే ఉండే ఒకరకం పదార్థంతో తయారవుతాయి. వేడి వేడి కూరలు, పులుసులు ఇందులోకి తీయగానే వేడికి ఆ మెలామైన్ అణువులు... ఆహారంతో పాటు కలిసి నోటి ద్వారా ఒంట్లోకి చేరిపోతుంటాయి. మెలమైన్ వల్ల కిడ్నీల్లో రాళ్లు వచ్చే ప్రమాదం ఉందని అధ్యయనంలో తేలింది. ఈ విషయం 'జామా ఇంటర్నల్ మెడిసిన్' జర్నల్‌లో సైతం ప్రచురితమైంది. ఈ పదార్థం వల్ల కిడ్నీఫెయిల్యూర్‌కు దారితీసే అవకాశంతో పాటు క్యాన్సర్ ప్రమాదమూ ఉన్నట్లు సాక్షాత్తూ డబ్ల్యూహెచ్ఓ నివేదికలూ పేర్కొంటున్నాయి. కొంత మంది నేరుగా ఈ బౌల్స్‌ను మైక్రోవేవ్ ఒవెన్‌లో ఉంచి వేడిచేస్తుంటారు. అలా ఎప్పటికీ చేయకూడదంటూ అమెరికాలో ఔషధాలకు అనుమతి ఇచ్చే అత్యున్నత ప్రమాణాల సంస్థ అయిన ఎఫ్‌డీఏ గట్టిగా సిఫార్సు చేస్తోంది. దీనివల్ల హార్మోన్లపై... మరీ ముఖ్యంగా మహిళల్లోని ఈస్ట్రోజెన్ స్రావంపై ప్రభావం ఉంటుందట. దాంతో గర్భధారణ సమస్యలు వస్తాయంటూ డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. ఇక పురుషుల్లోనూ... వీర్యకణాల సంఖ్య తగ్గడం, వాటి కదలికలు మందగించడం, హార్మోన్ల స్రావాలు తగ్గడం జరుగుతాయి. చాలామందిలో డయాబెటిస్ వచ్చే ముప్పు విపరీతంగా పెరుగుతున్నట్లుగా కూడా ఒక అధ్యయనంలో తేలింది.

**నివారించండిలా:** వేడివేడి సూప్‌లూ, కూరలు, ఇతరత్రా పదార్థాలను వడ్డించాలనుకుంటే పింగాణీ బౌల్స్ లేదా పింగాణీ ప్లేట్లే మంచివి. వాటిలో తినడమే ఆరోగ్యదాయకం.

### మన సోఫాల్లో మరెన్నో విషపదార్థాలు...

మంటలు అంటుకున్నా సురక్షితంగా ఉండేలా ఇటీవల ఆధునికమైన కొన్నిరకాల సోఫాలను రూపొందిస్తున్నారు. వీటిని ఫైర్ రెసిస్టెంట్ పదార్థాలతో తయారు చేస్తారు. ఈ రసాయనాలను ఫ్లేమ్ రిటార్డెంట్స్ అంటారు. ఈ సోఫాలపై మనం చేతులు ఆనించినప్పుడు ఈ రసాయనాలు చేతుల పైకి చేరతాయి. అవే చేతులతో మనం ఏవైనా ఆహారపదార్థాలను తిన్నప్పుడు... ఆ విషాలు ఒంట్లోకి ప్రవేశిస్తాయి. ఈ విషాలు మన గ్రంథుల వ్యవస్థ (ఎండోక్రైన్ సిస్టమ్)ను దెబ్బతీస్తాయి. ఫలితంగా ఎంజైముల, జీవరసాయనాల సమతౌల్యం దెబ్బతింటుంది. ప్రధానంగా ఈ దుష్ప్రభావం ప్రధానంగా ప్రత్యుత్పత్తి వ్యవస్థపై పడే అవకాశం ఉంది. దాంతో కొన్ని రకాల ప్రత్యుత్పత్తి సంబంధిత వ్యాధులు రావచ్చు. ఒక్కోసారి క్యాన్సర్లు వచ్చేందుకూ అవకాశాలున్నాయి.

**నివారించండిలా:** సోఫాలను క్రమం తప్పకుండా వాక్యూమ్ క్లీనర్‌తో తరచూ శుభ్రపరచుకుంటూ ఉండాలి. ఇలా శుభ్రపరిచే సమయంలో ఎయిర్‌ఫిల్టర్ ఉపయోగించడం మరింత మంచిది. ఇలాంటి సోఫా మీద కూర్చున్న తర్వాత ఏదైనా తినాల్సి వస్తే... చేతులు శుభ్రంగా కడుక్కోవడం, తినే ముందు నోటిని నీళ్లతో పుక్కిలించడం అవసరం.

### ప్రకాశవంతమైన లైట్లతో ఆరోగ్యానికి ముప్పు

మీరు ఇంట్లో రాత్రి నిద్రపోయే సమయంలో పెద్ద లైట్లు అస్సలు వేసుకోకండి. బాగా కాంతి తక్కువగా ఉండే (డిమ్‌గా ఉండే) జీరో బల్బులు మాత్రమే వాడండి. రాత్రివేళల్లో అలముకునే చీకటి కారణంగానే మన మెదడుల్లో... మెలటోనిన్ అనే హార్మోన్ స్రవిస్తుంది. ఇది స్రవించడం వల్లనే మనకు నిద్ర వస్తుంది. లైట్లు వేసుకుని పడుకోవడం వల్ల మెలటోనిన్ తగ్గుతుంది. దాంతో రాత్రి నిద్ర పట్టదు. ఫలితంగా నిర్ణీత వేళల్లో నిద్రతెప్పించేందుకు మన మెదడులోని వ్యవస్థ అయిన 'సర్కాడియన్ రిథమ్' దెబ్బతింటుంది. ఇది దీర్ఘకాలంలో ఆరోగ్యంపై ప్రభావం చూపేందుకు చాలా ఆస్కారం ఉంది. నిద్రలేమి వల్ల మహిళల్లోనైతే బ్రెస్ట్ క్యాన్సర్లకు, పురుషుల్లోనైతే ప్రోస్టేట్ క్యాన్సర్లకు అవకాశం ఉంటుంది. అంతేకాదు... పెద్దపేగు, బ్లాడర్, పాంక్రియాటిక్ క్యాన్సర్ల రిస్క్ పెరుగుతుందని పేర్కొన్న ఈ అధ్యయన ఫలితాలు అమెరికన్ జర్నల్ ఆఫ్ ఎపిడిమియాలజీలో ప్రచురితమయ్యాయి.



**నివారించండిలా:** రాత్రి చీకటి అలముకోగానే మెలటోనిన్ స్రవించేలా చేయడం అన్నది ప్రకృతి స్వాభావికంగా చేసిన ఏర్పాటు. దాన్ని బ్రైట్‌లైట్స్‌తో దెబ్బతీయవద్దు. రాత్రివేళల్లో చాలా డిమ్ లైట్స్ మాత్రమే ఉపయోగించండి.

### కర్టెన్ల వెనక కాలకూటం

గతంలో మన ఇళ్లలో బట్టలతో చేసిన కర్టెయిన్లు వాడేవాళ్లం. కానీ ఇటీవల ఒక రకం ప్లాస్టిక్‌తో చేసిన బ్లైండ్లను వాడటం పరిపాటి అయ్యింది. చాలా కాలం పాటు మన్నికతో ఉండటానికి మనం ప్లాస్టిక్ వంటి పదార్థంతో రూపొందించిన ఈ తరహా కర్టెన్లను వాడుతున్నాం. ఇక బాత్‌రూమ్‌లలోనైతే నీళ్ల వల్ల పాడైపోకుండా ఉండటం కోసం మనం వాడే షవర్ కర్టెయిన్లన్నీ తప్పనిసరిగా వాటర్‌ప్రూఫ్ మెటీరియల్‌తో తయారవుతున్నాయి. వాటిని వాటర్‌ప్రూఫ్‌గా తయారు చేయడానికి విధిగా ఒకరకం ప్లాస్టిక్‌ను ఉపయోగించాల్సి వస్తుంది. ఈ ప్లాస్టిక్ కర్టెన్లు సాధారణ బట్టల్లాగే ఎటు పడితే అటు వంగేందుకు వీలుగా 'థాలేట్' అనే పదార్థంతో వీటిని తయారుచేస్తారు. ఈ షవర్ కర్టయిన్లలో మాత్రమే కాకుండా... మన ఇండ్లలో అలంకరణ కోసం ఉపయోగించే వాల్‌పేపర్లు, అనేక రకాల ఫ్లెక్సీలు కూడా ఈ పదార్థంతోనే తయారుచేస్తుంటారు. ఈ థాలేట్ అనేది పురుషుల సెక్స్ హార్మోన్‌పై తీవ్రమైన ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తుంది. వీటి వల్ల పురుషుల్లో వీర్యం నాణ్యత (స్పెర్మ్ క్వాలిటీ) బాగా దెబ్బతింటుంది. ఇక ఈ కర్టెయిన్ల మీదుగా వీచే గాలి అలర్జీలను ప్రేరేపిస్తుంది. దాంతో అనేక శ్వాససంబంధ సమస్యలు రావడం జరగవచ్చు. దీర్ఘకాలంలో ఆస్తమా వచ్చేందుకు అవకాశాలు ఎక్కువ.

మహిళల విషయానికి వస్తే... ఈ తరహా వాల్‌పేపర్లు, గృహాలంకరణ వస్తువులు, కర్టెయిన్లు ఉన్న ఇండ్లలో గర్భవతుల ఉంటే ఇవి వారికి మరింత ప్రమాదకరం. ఇవి ఉపయోగించడం అంటే... పుట్టబోయే పిల్లలు ఇంట్లోకి రావడానికి ముందే వారి ఆరోగ్యకరమైన చిన్ని అవయవాలను పూర్తిగా కలుషితం చేయడానికి తగిన ఏర్పాట్లు చేయడమే. ఇలాంటి కర్టెయిన్లు, వాల్‌పేపర్లు, అలంకరణ సామగ్రి ఉపయోగించే ఇళ్లలో పెరిగిన పిల్లల్లో ఏడీహెచ్‌డీ వంటి రుగ్మతలు కనిపించే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు చాలా అధ్యయనల్లో తేలింది. నాలుగు నుంచి తొమ్మిదేళ్ల పిల్లల్లో ఈ ధోరణులు పెరిగే అవకాశాలు ఎక్కువని మౌంట్ సినాయ్ మెడికల్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరిశోధనల ఫలితాలు తెలుపుతున్నాయి.

**నివారించండిలా:** ఇంట్లోని డోర్ కర్టెన్లు, షవర్ కర్టయిన్ల కోసం వీలైనంత వరకు నిరపాయకరమైన మెటీరియల్‌తో తయారు చేసినవే వాడండి. దెబ్బతిన్నప్పుడు మార్చుకోవడం శ్రమ అయినా సరే... కాటన్‌తో తయారైన కర్టెయిన్లనే వాడండి. ఫర్నిచర్‌గా, అందంగా ఉండే ప్లాస్టిక్ పీవీసీతో తయారు చేసిన వాటికంటే కలపతో తయారు చేసిన వాటినే వాడండి.

### నాన్‌స్టిక్ పాత్రలతో చాలా ప్రమాదం...

మనం వంట వండినప్పుడు అది పాత్రల అడుగున అంటుకుపోనివ్వకుండా చేసే నాన్‌స్టిక్ తరహా గిన్నెలు, పెనం వంటి గృహోపకరణాలకు ఇటీవల బాగా ప్రాచుర్యం పెరిగింది. వీటిని 'నాన్‌స్టిక్ కుక్‌వేర్'గా అభివర్ణిస్తుంటాం. నాన్‌స్టిక్ కిచెన్‌వేర్ ఆరోగ్యానికి కీడు చేస్తుందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ తరహా వంటపాత్రల్లో వండిన వంటలను తిన్న పిల్లలకు భవిష్యత్తులో స్థూలకాయం, డయాబెటిస్ వంటివి వచ్చే అవకాశాలు చాలా ఎక్కువని ఈ అధ్యయనాల్లో తేలింది. అంతేకాదు... దీర్ఘకాలంలో హార్మోన్లకు సంబంధించిన సమస్యలు, హార్మోన్‌ల అసమతౌల్యత వంటివి వచ్చేందుకు అవకాశాలు ఎక్కువ. వ్యాధినిరోధక శక్తి తగ్గుతుంది. ఇలాంటి గృహోపకరణాలు ఉపయోగించే వారిలో సంతానలేమి అంటే... పిల్లలు పుట్టే అవకాశం తగ్గిపోవడం వంటి అనర్థాలు కలుగుతాయని 'ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ పర్‌స్పెక్టివ్' హెల్త్ జర్నల్‌లోని నివేదికలు చెబుతున్నాయి.

**నివారించండిలా**

టెఫ్లాన్ కోటింగ్ ఉన్న నాన్‌స్టిక్ కుక్‌వేర్‌కు బదులుగా సాధారణ స్టెయిన్‌లెస్ స్టీల్ వంటివి ఉపయోగించడం మంచిది. ఇంట్లో గర్భవతి ఉన్నప్పుడు ఈ నాన్‌స్టిక్ గృహోపకరణాలను ఉపయోగించడం మానేయాలి. మరీ ఎక్కువ ఉష్ణోగ్రత వద్ద వండాల్సిన వంటకాలకు ఈ నాన్‌స్టిక్ కుక్‌వేర్‌ను ఉపయోగించకపోవడమే మంచిది.

### వంటింట్లోకి గాలి ధారాళంగా రావాలి

ఇంటి నిర్మాణం సమయంలో వంటింటికి చాలా మంది చాలా తక్కువ స్థలాన్ని కేటాయిస్తారు. ఇదెంతో ప్రమాదకరం. కిచెన్‌లోకి గాలి బాగా వచ్చేలా చూసుకోవాలి. మరీ ముఖ్యంగా కిరోసిన్ స్టవ్‌లు ఉపయోగించేవారు తప్పనిసరిగా ఈ జాగ్రత్త తీసుకోవాలి. ఎందుకంటే కిరోసిన్ మండే సమయంలో కొన్ని హానికర వాయువులు వెలువడతాయి. ఇక కట్టెల పొయ్యి అయితే కార్బన్ డై ఆక్సైడ్‌తోపాటు కార్బన్ మోనాక్సైడ్ వంటి హానికరమైన వాయువులు వస్తాయి. వీటివల్ల ప్రాణాపాయం కూడా తప్పని పరిస్థితి కూడా ఎదురుకావచ్చు. అందుకే కిచెన్ తగినంత విశాలంగా, గాలి ఆడేలా ఉండాలి.

**నివారించండిలా**

వంటగది విశాలంగా ఉండేలా చూసుకోండి. కిచెన్‌ను అనవసరమైన వస్తువులతో దాన్ని నింపేయవద్దు. బొగ్గులు, నిప్పుల మీద చేసే వంట... కిచెన్‌లో వద్దు. ఆరుబయటే చేయండి.

### బాత్‌రూమ్‌లో హానికర రసాయనాలెన్నో

హానికరమైన రసాయనాలకు బాత్‌రూమ్ కూడా ఒక నెలవే. అక్కడ ఉపయోగించే షాంపూలలో హానికరమైన రసాయనాలు ఉండవచ్చు. ఇక సువాసన వచ్చేందుకు గాను కొన్ని రకాల సబ్బుల్లో చేర్చే సుగంధ ద్రవ్యాల వల్ల కూడా చర్మంపై అలర్జీలు, శ్వాసకోశ సమస్యలు రావచ్చు.

**నివారించండిలా**

రసాయనాలు తక్కువగా ఉండే స్వాభావిక పదార్థాలతో చేసిన సబ్బులు, షాంపులు ఉపయోగించండి.

### ఇంటిబయటే చెప్పులూ, బూట్లు, సాక్స్...

ఒకటి రెండు రోజులు అవే వేసుకుంటే సాక్స్ (మేజోళ్లు) దుర్వాసన వస్తాయన్న సంగతి అందరికీ తెలిసిందే. కాలిని పట్టుకుని ఉండే మేజోడులో బ్యాక్టీరియా పెరగడం వల్ల ఈ దుర్వాసన వస్తుందన్నది అందరికీ తెలిసిన విషయమే. ఒకవేళ ఇంట్లోకి ప్రవేశించాక సాక్స్ విప్పితే ఆ బ్యాక్టీరియా ఇంట్లోకే వచ్చేసే అవకాశాలుంటాయి. అందుకే పాదరక్షలు, ప్రధానంగా సాక్స్ ఇంటి బయటే వదలాలి. ఉతికి పొడిగా మారాక మాత్రమే వాటిని ఇంట్లోకి తీసుకురావాలన్న విషయం గుర్తుపెట్టుకోవాలి. అందుకే చెప్పులు, పాదరక్షలు, షూస్, సాక్స్ స్టాండ్ ఇంటి బయట ఉండటమే మంచిది.

ఇలాంటి కొన్ని చిన్న చిన్న జాగ్రత్తలతోనే మన ఇంట్లోనే మనకు తెలియకుండా ఉండే అనేక రకాల విషాలను, హాని చేసే ముప్పులను నివారించుకోవచ్చు.




డా॥ ఎం. రామకృష్ణ,
సీనియర్ జనరల్ ఫిజీషియన్,
యశోద హాస్పిటల్స్,
మలక్‌పేట్, హైదరాబాద్






# కొవ్వులన్నీ హానికరమేనా?

చాలా మంది కొవ్వులను హాని చేసే ఆహారపదార్థంగా చూస్తారు. నూనెలతో చేసిన పదార్థాలంటేనే చాలు... ఆమడ దూరం పరిగెడుతుంటారు. నూనెను ఉపయోగించాల్సి వస్తే... కొలెస్ట్రాల్ ఫ్రీ ఆయిల్‌ను వాడుతుంటారు. నిజానికి వెజిటబుల్ కింగ్‌డమ్‌లోని మొక్కల నుంచి కొలెస్ట్రాల్ ఎంత మాత్రమూ తయారుకాదు. మనం వాడే నూనెలన్నీ మొక్కల గింజల నుంచే వస్తాయి కాబట్టి అవన్నీ కొలెస్ట్రాల్ లేనివే.

**కొవ్వుల గురించి తెలుసుకుందాం...**

మన ఆహారంలో కొవ్వులు ఎంతగానో అవసరం. ఎందుకంటే 1 గ్రాము కొవ్వు నుంచి 9 క్యాలరీల శక్తి లభిస్తుంది. కొవ్వుల్లో 1) మోనో-అన్‌శాచురేటెడ్, 2) పాలీ-అన్‌శాచ్యురేటెడ్, 3) శాచురేటెడ్, 4) ట్రాన్స్‌ఫ్యాట్... అనే నాలుగు రకాల కొవ్వులు ఉంటాయి. వీటిలో మొదటి మూడురకాల కొవ్వులు పరిమితంగా అవసరమే. మోనో-అన్‌శాచురేటెడ్ ఫ్యాట్స్... వేరుశనగ, ఆలివ్ ఆయిల్ వంటి నూనెల్లో ఉంటాయి. ఇక సఫోలా, పన్‌ఫ్లవర్, వేరుశనగతోపాటు, అవకాడో వంటి నూనెల్లో పాలీ అన్‌శాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. వీటిలో మోనో-అన్‌శాచురేటెడ్, పాలీ-అన్‌శాచురేటెడ్ నూనెలను మార్చి మార్చి వాడుతూ ఉండటం వల్ల అవి గుండెకు ఒక రక్షణగా పనిచేస్తుంటాయి. నమ్మలేకపోయినా ఇది వాస్తవం.

ఇక నెయ్యి, డాల్డా వంటివాటిని శాచ్యురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్‌గా పేర్కొంటాం. వీటిని చాలా చాలా పరిమితంగా మాత్రమే వాడాలి. ఇక చేపలు, చేపనూనె, సోయాబీన్‌నూనెలో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ అనే తరహా ఆరోగ్యకరమైన పాలీ అన్‌శ్యాచురేటెడ్ కొవ్వులు ఎక్కువ. ఇవి ఎక్కువగా తీసుకోవడం వల్ల మన రోగనిరోధక శక్తి బాగా పెరుగుతుంది.

**కొవ్వులతో ప్రయోజనాలివి...**

నూనెల వల్ల ఒంట్లోకి పేరుకునే కొవ్వులు బయటి వేడిమి, చల్లదనం నుంచి ఒంట్లోని అంతర్గతఅవయవాలను కాపాడతాయి. కిడ్నీలు, కాలేయం, గుండె వంటివాటికి ప్యాడింగ్‌గా ఉండటంతో పాటు షాక్‌అబ్జార్బర్స్‌లా కూడా పనిచేస్తాయి. అయితే గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే... ఉదరంలోని అవయవాల చుట్టూ ఉండే కొవ్వును విసరల్ ఫ్యాట్ అంటారు. ఇది అధికంగా ఉండే గుండెజబ్బులు ఎక్కువగా వస్తాయి.

ఇదీ పరిమితి...

ఒక థంబ్‌రూల్ నియమం ప్రకారం... ప్రతి ఒక్క వ్యక్తి నెలకు అరలీటర్ (500 ఎమ్ఎల్) నుంచి ముప్పావులీటర్ (750 ఎమ్.ఎల్)కు మించకుండా నూనె వాడటం మంచిది. అంతకంటే మించితే అది చేటు చేస్తుంది. ఆ పరిమితికి మించితే అది స్థూలకాయం, గుండెజబ్బులు, డయాబెటిస్, ఆర్థరైటిస్, అధికరక్తపోటు వంటి వ్యాధులకు దారితీసే ప్రమాదం ఉంటుంది. మాంసాహారులు వారానికి కనీసం మూడుసార్లకు తగ్గకుండా చేపలు తినడం మంచిది. ఇక మనకు కనిపించకుండా వాడే కొవ్వులు (ఇన్విజిబుల్ ఫ్యాట్స్)... అంటే నట్స్, డ్రైఫ్రూట్స్, మాంసాహారాలు, పాలు వంటి వాటిల్లో ఉండే కొవ్వులను పరిమితంగా తీసుకుంటూ ఉండాలి. కొందరు కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉంటుందంటూ గుడ్ల జోలికే పోరు. కానీ మన ఒంట్లోకి ఆహారంతో వచ్చే కొలెస్ట్రాల్ కేవలం 16% మాత్రమే. మిగతాదంతా మన కాలేయంలోనే తయారవుతుంది. కాబట్టి కొలెస్ట్రాల్ భయంతో గుడ్లకు దూరంగా ఉంటే ఆరోగ్యానికీ, ప్రొటీన్లకూ దూరంగా ఉన్నట్లే. అందుకే గుడ్లను తప్పనిసరిగా తినాలి. 1990లలో అమెరికన్ గైడ్‌లైన్స్ వల్ల కొవ్వుల వినియోగం బాగా తగ్గి... అదే సమయంలో రిఫైన్డ్ కార్బోహైడ్రేట్ల వినియోగం బాగా పెరిగింది. ఈ కార్బోహైడ్రేట్ల వల్ల నష్టం జరిగే అవకాశం ఉంటుందని పరిశోధనల్లో వెల్లడైంది. దాంతో కొవ్వుల వినియోగం మళ్లీ పెరిగే అవకాశం ఉంది. ఎక్కువ కార్బోహైడ్రేట్లు, ఎక్కువ కొవ్వులు మళ్లీ ప్రమాదకరం కాబట్టి... అందుకు బదులుగా ఎక్కువ ప్రొటీన్‌తో పాటు ఎక్కువ పీచుపదార్థాలు ఉండే ఆహారం తీసుకోవడం మేలు.

**కృత్రిమ కొవ్వులు మాత్రం డేంజరే...**

ఇక్కడ ఒక్క విషయం గుర్తుపెట్టుకోవాలి. ఆహారాన్ని ఎక్కువ కాలం నిల్వ ఉండేలా చేసేందుకు మార్జరిన్ వంటి కొవ్వులను ఉపయోగిస్తుంటారు. ఇవే ట్రాన్స్‌ఫ్యాట్స్ అంటూ మనం పిలిచే నాలుగో తరహా కొవ్వులు. వీటిని చాలాకాలం నిల్వ ఉండాల్సిన (షెల్ఫ్ లైఫ్ ఎక్కువగా ఉండాల్సిన) చిప్స్, బేకరీ ఉత్పాదనల్లో వాడుతుంటారు. వాటి నుంచి ఎట్టిపరిస్థితుల్లోనూ దూరంగా ఉండాల్సిన అవసరం మాత్రం ఉంది.




డాక్టర్ ఎం.ఎస్.ఎస్. ముఖర్జీ,
సీనియర్ కార్డియాలజిస్ట్, మాక్స్‌క్యూర్ హాస్పిటల్స్,
మాదాపూర్, హైదరాబాద్


## హోమియో కౌన్సెలింగ్స్

### మెడనొప్పి చేతులకూ పాకుతోంది..?

**నా వయసు 52 ఏళ్లు. నేను కొంత కాలంగా తీవ్రమైన మెడనొప్పితో బాధపడుతున్నాను. నొప్పి చేతుల వరకూ పాకుతోంది. చేతులు బలహీనంగా అనిపిస్తున్నాయి. డాక్టర్‌ను సంప్రదిస్తే మెడ భాగంలోని ఎముకలు అరుగుదలకు గురయ్యాయని చెప్పారు. మందులు వాడుతున్నంత కాలం బాగానే ఉన్నా అవి ఆపేస్తే మాత్రం మళ్లీ నొప్పి వస్తోంది. హోమియో చికిత్స ద్వారా నా సమస్యకు పూర్తి పరిష్కారం లభిస్తుందా? వివరంగా చెప్పగలరు.**

**– ఆర్. భాస్కర్‌రావు, హైదరాబాద్**



వయసు పెరగడం వల్ల వచ్చే మెడ నొప్పికి పూర్తి పరిష్కారం లభించదని చాలా మంది అనుకుంటుంటారు. కానీ హోమియోచికిత్స ద్వారా ఈ సమస్యకు పూర్తి పరిష్కారం దొరుకుతుంది. మెడ భాగంలోని వెన్నెముక డిస్కులు, ఫేసెట్ జాయింట్స్‌లోని మృదులాస్థి క్షీణతకు గురికావడాన్ని సర్వైకల్ స్పాండిలోసిస్ అంటారు. దీనినే సర్వైకల్ స్పైనల్ ఆర్థరైటిస్ అని కూడా అంటారు. దాదాపు 85 శాతానికి పైగా ఇది 60 ఏళ్ల వయసు పైబడిన వారిలో కనిపిస్తుంది. ప్రస్తుతం జీవనశైలిలో మార్పులు రావడం వల్ల ఇది చిన్న వయసు వారిలోనూ ఎక్కువగా కనిపిస్తుంది.

**కారణాలు:** ● వయసు పెరగడం, వ్యాయామం లేకపోవడం ● క్షీణతకు గురైన ఎముకలు అదనంగా పెరగడం ● డిస్కులు జారిపోవడం లేదా చీలికలకు గురికావడం ● వృత్తిరీత్యా అధిక బరువులు మోయడం ● ఎక్కువ సమయం పాటు మెడను అసాధారణ భంగిమలో ఉంచడం ● ఎక్కువ సేపు కంప్యూటర్‌పై పనిచేయడం, ఎక్కువ సమయం మెడను వంచి ఫోన్‌లలో మాట్లాడటం ● ఎత్తైన దిండ్లు వాడటం ● మెడకు దెబ్బతగలడం ● మెడకు శస్త్రచికిత్స జరిగి ఉండటం ● తీవ్రమైన మానసిక ఒత్తిడి, అధిక బరువు, పొగతాగే అలవాటు, జన్యుపరమైన కారణాలతో ఈ సమస్య వచ్చే అవకాశం ఉంది.

**లక్షణాలు:** ● సాధారణం నుంచి తీవ్రస్థాయి మెడ నొప్పి ● నొప్పి మెడ నుంచి భుజాలకు, చేతులకు, వేళ్లకు పాకడం ● మెడ బిగుసుకుపోవడం ● తల నొప్పి, తల వెనక భాగంలో మొదలై నుదురు వరకు వ్యాపించడం ● నరాలపై ఒత్తిడి పడి, చేతులలో సూదులు గుచ్చినట్లుగా అనిపించడం, చేతులు మొద్దుబారడం, సత్తువ కోల్పోవడం ● చిన్న బరువునూ ఎత్తలేకపోవడం ● నడకలో నిలకడ కోల్పోవడం వంటి లక్షణాలు గమనించవచ్చు.

**నిర్ధారణ పరీక్షలు:** సీబీపీ, ఈఎస్ఆర్, ఎక్స్-రే సర్వైకల్ స్పైన్, ఎమ్మారై పరీక్షలు చేయించడం ద్వారా వ్యాధిని నిర్ధారణ చేయవచ్చు.

**హోమియో చికిత్స:** జెనెటిక్ కాన్స్‌టిట్యూషన్ చికిత్స విధానం ద్వారా రోగి మానసిక, శరీరక లక్షణాలను పరిగణనలోకి తీసుకొని చికిత్స అందించడం వల్ల మెడనొప్పిని పూర్తిగా నయం చేయవచ్చు. వెన్నెముకను దృఢంగా చేయడం ద్వారా సర్వైకల్ స్పాండిలోసిస్ సమస్యను సంపూర్ణంగా నయం చేయవచ్చు.




డా॥ శ్రీకాంత్ మొర్లావర్,
సీఎండీ, హోమియోకేర్ ఇంటర్నేషనల్,
హైదరాబాద్


### కళ్లు పచ్చగా ఉన్నాయి... పరిష్కారం చెప్పండి

**నా వయసు 35 ఏళ్లు. నా కళ్లు పచ్చగా కనిపిస్తున్నాయి. మూత్రం కూడా పసుపు రంగులో వస్తోంది. ఈ లక్షణాలు చూసి నాకు ఆందోళనగా ఉంది. నా సమస్య ఏమిటి? దీనికి హోమియోలో మంచి చికిత్స ఉందేమో దయచేసి వివరించండి.**

**– ఎమ్. లక్ష్మణ్‌రావు, రాజమండ్రి.**

మీరు చెబుతున్న లక్షణాలను బట్టి మీకు కామెర్లు సోకినట్లు తెలుస్తోంది. ఇది దీర్ఘకాలంలో కాలేయాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంది. మానవ శరీరంలో కాలేయం అతి ముఖ్యమైన భాగం. ఈ అవయవానికి వైరస్ కారణంగా ఇన్ఫెక్షన్ సోకితే ఎన్నో సమస్యలు మొదలవుతాయి. కాలేయం ప్రభావం చూపే వైరస్‌లలో ముఖ్యమైనవి హెపటైటిస్-బి, హెపటైటిస్-సి. ఈ వైరస్‌లు సోకగానే బయటకు ఎలాంటి లక్షణాలు కనిపించవు. కొంతకాలం పాటు ఆ వైరస్ వారి శరీరాల్లో నిద్రాణంగా ఉంటుంది. ఆ తర్వాత మెల్లమెల్లగా కాలేయాన్ని నిర్వీర్యం చేస్తూ ప్రాణాంతకంగా మారుతుంది. లివర్ క్యాన్సర్ సిరోసిస్, వైరల్ హెపటైటిస్ వ్యాధులు రావడానికి కారణమవుతుంది.

**లక్షణాలు:** హెపటైటిస్ వైరస్ శరీరంలోకి ప్రవేశించిన వెంటనే లక్షణాలు బయటకేమీ కనిపించవు. అవి కనిపించడానికి చాలా ఏళ్లు పడుతుంది. కొంతమందిలో వైరస్ సోకిన కొద్దిరోజులకే కామెర్లు వస్తాయి. దీన్ని ఎక్యూట్ స్టేజ్‌గా చెప్పవచ్చు. ఈ దశలో వ్యాధి దానంతట అదే తగ్గిపోతుంది. కొంతమందిలో ఈ వైరస్ తొలగిపోకుండా, శాశ్వతంగా శరీరంలోనే నివాసం ఏర్పరచుకొని బలం పెంచుకుంటూ పోతుంది. దీనిని క్రానిక్ స్టేజ్ అంటారు. ఈ దశలోనే కాళ్లవాపు, పొట్ట ఉబ్బరం, వాంతులు, ఆకలి తగ్గిపోవడం, మూత్రం పచ్చగా రావడం, జ్వరం, ఒళ్లునొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయి.

**చికిత్స:** రోగి శారీరక మానసిక లక్షణాలను పరిశీలించి చికిత్స అందించడం ద్వారా మంచి ఫలితాలను సాధించవచ్చు. మీరొకసారి హోమియో వైద్యుడిని సంప్రదించండి. అనుభవజ్ఞులైన హోమియో వైద్యుల ఆధ్వర్యంలో మందులు వాడితే భవిష్యత్తులో కాలేయానికి ఎలాంటి ప్రమాదం జరగకుండా పూర్తిగా కాపాడుకోవచ్చు.




డా॥ కె. రవికిరణ్,
మాస్టర్స్ హోమియోపతి, హైదరాబాద్

సాక్షి భవిత
స్పర్ధయా వర్ధతే విద్య
గురువారం 17-10-2019

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబరు-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com




# విజయానికి రివిజన్

**చార్టర్డ్ అకౌంటెన్సీ(సీఏ)లో.. ఫౌండేషన్, ఇంటర్మీడియెట్, ఫైనల్ అని మూడు దశలు. ఇందులో అత్యంత కీలకమైన దశ.. ఇంటర్మీడియెట్. ఈ దశ పూర్తి చేస్తే.. ఫైనల్‌కు అర్హత లభిస్తుంది. అంతేకాకుండా ఉద్యోగాలు కూడా దక్కించుకోవచ్చు. ఇంతటి కీలకమైన సీఏ-ఇంటర్-2019 పరీక్షలు నవంబర్ రెండో తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో... సీఏ ఇంటర్‌లో విజయానికి విద్యార్థులు అనుసరించాల్సిన వ్యూహాల గురించి తెలుసుకుందాం...**

## రెండు గ్రూప్‌లుగా పరీక్ష

సీఏ-ఇంటర్ పరీక్షను రెండు గ్రూపులుగా విభజించి.. మొత్తం ఎనిమిది పేపర్లుగా నిర్వహిస్తారు. వివరాలు...

➠ గ్రూప్-1 పరీక్షల విధానం...

| పేపర్ | సబ్జెక్ట్ | మార్కులు |
|---|---|---|
| పేపర్-1 | అకౌంటింగ్ | 100 |
| పేపర్-2 | కార్పొరేట్ 'లా'స (60 మా)<br>అదర్ 'లా'స(40 మా) | 100 |
| పేపర్-3 | కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్ | 100 |
| పేపర్-4 | ట్యాక్సేషన్, ఇన్‌కమ్ ట్యాక్స్ (60 మార్కులు)<br>ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ (40 మార్కులు) | 100 |

➠ గ్రూప్-2 పరీక్షల విధానం...

| పేపర్ | సబ్జెక్ట్ | మార్కులు |
|---|---|---|
| పేపర్-5 | అడ్వాన్స్‌డ్ అకౌంటింగ్ | 100 |
| పేపర్-6 | ఆడిటింగ్ అండ్ అష్యూరెన్స్ | 100 |
| పేపర్-7 | ఎంటర్‌ప్రైజ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (50 మార్కులు)<br>స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్ (50 మార్కులు) | 100 |
| పేపర్-8 | ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ (60 మార్కులు)<br>ఎకనామిక్స్ ఫర్ ఫైనాన్స్ (40 మార్కులు) | 100 |

✦ రెండు గ్రూప్‌లలోనూ ప్రతి సబ్జెక్ట్‌కు లభించే పరీక్ష సమయం.. మూడు గంటలు.

## ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ కలయికగా ప్రశ్నలు

సీఏ ఇంటర్ పరీక్షల్లో.. రెండు గ్రూప్‌లలోనూ నాలుగు పేపర్లలో (పేపర్-2, పేపర్-4, పేపర్-6, పేపర్-7) డిస్క్రిప్టివ్, ఆబ్జెక్టివ్ విధానంలో ప్రశ్నలు అడుగుతారు. ఈ నాలుగు పేపర్లలో 30 శాతం మార్కులకు ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలకు (ఎంసీక్యూస్) సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. ప్రతి సబ్జెక్ట్‌కు సంబంధించి అన్ని అంశాలపై అవగాహన ఏర్పరచుకుంటే.. ఎంసీక్యూస్‌కు సులభంగా సమాధానం గుర్తించే నైపుణ్యం లభిస్తుంది.



## సబ్జెక్ట్ వారీగా ఇలా

### పేపర్-1(అకౌంటింగ్-100 మార్కులు)

ఈ పేపర్‌లో అకౌంటింగ్ స్టాండర్డ్స్‌కు పరీక్షలో వెయిటేజీ ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఇందులో పూర్తి స్థాయి అవగాహన ఏర్పరచుకోవాలి. అన్ని చాప్టర్లను, ముఖ్యంగా థియరీ ఆధారిత చాప్టర్లను విస్మరించకుండా చదవాలి. ప్రతి చాప్టర్‌లోనూ ఏదైనా ఒక బేసిక్ ప్రాబ్లమ్‌ను ప్రాక్టీస్ చేయడం, మిగతా ప్రాబ్లమ్స్‌లోని ముఖ్యమైన అంశాలను హైలైట్ చేసుకోవడం పునశ్చరణకు ఉపయోగపడుతుంది. కాన్సెప్ట్స్‌కు ప్రాధాన్యం ఇస్తూ చదవడం ఎంతో ముఖ్యం. రివిజన్ టెస్ట్ పేపర్స్(ఆర్‌టీపీస్), మాక్ టెస్ట్ పేపర్స్(ఎంటీపీస్)ను ప్రాక్టీస్ చేయడం మంచి మార్కులు సాధించేందుకు దోహదపడుతుంది. ఈ పేపర్‌లో పార్ట్‌నర్‌షిప్ అకౌంట్స్, అకౌంట్స్ ఫ్రమ్ ఇన్‌కంప్లీట్ రికార్డ్స్, బ్రాంచ్ అకౌంట్స్ వంటి చాప్టర్లపై మరింత ప్రత్యేక దృష్టిసారించాలి.

### పేపర్-2 (కార్పొరేట్ 'లా'స్ అండ్ అదర్ 'లా'స్-100 మార్కులు)

ఈ పేపర్‌లో కొత్తగా చేర్చిన చాప్టర్లు, కొత్త సవరణలపై పట్టు సాధించడం ఎంతో అవసరం. ఇందులో 30 శాతం ఆబ్జెక్టివ్ ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి ప్రతి అంశాన్ని అన్ని కోణాల్లోనూ చదవడం మేలు. ఎనిమిది నుంచి పది మార్కుల వరకు అడిగే స్టేట్‌మెంట్ ఆధారిత ప్రశ్నలను కూడా ప్రాక్టీస్ చేయాలి. బెయిల్‌మెంట్ అండ్ ప్లెడ్జ్, ఇన్‌డెమ్నిటీ అండ్ గ్యారెంటీ, కాంట్రాక్ట్ ఆఫ్ ఏజెన్సీ వంటి చాప్టర్లపై గతంలో ఆబ్జెక్టివ్ ప్రశ్నలే ఉండేవి. కానీ ఇప్పుడు విశ్లేషణాత్మక ప్రశ్నలు కూడా వచ్చే అవకాశముంది. ఈ పేపర్‌లో జనరల్ క్లాజెస్, ఇంటర్‌ప్రిటేషన్ ఆఫ్ స్టాట్యూస్ నుంచి అడిగే ప్రశ్నలు కొంత కష్టమైనవిగా చెప్పొచ్చు. వీటిని ఛాయిస్ కింద వదిలేయకుండా కనీసం నిర్వచనాలు, ఉదాహరణలను చదవడం మేలు చేస్తుంది.

ఇటీవల కాలంలో పరీక్షలో కంపెనీల చట్టానికి ప్రాధాన్యం పెరిగింది. ఆచరణాత్మక ప్రశ్నలు అడిగే అవకాశం ఎక్కువగా ఉంది. కాబట్టి కంపెనీ లాపై ఎక్కువ దృష్టి సారించాలి. పరీక్షలో వీలైనంత వరకు సీఏ ఇన్‌స్టిట్యూట్ మెటీరియల్‌లో ఉండే అంశాలనే సమాధానాలుగా రాయడం మేలు.

### పేపర్-3 (కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్-100 మార్కులు)

ప్రతి చాప్టర్‌లో థియరీ ఆధారిత ప్రశ్నలపై పట్టు సాధించాలి. ముఖ్యంగా బేసిక్ కాన్సెప్ట్స్ ఇన్ కాస్టింగ్ చాప్టర్‌కు మరింత ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రతి చాప్టర్‌లోని ఫార్ములాలను ఒక నోట్స్‌లో రాసుకోవాలి. ప్రతి చాప్టర్‌లోనూ ప్రాథమిక అంశాలపై పట్టు సాధించడం వల్ల సులభంగా సమాధానాలు ఇవ్వొచ్చు. మెటీరియల్స్, లేబర్, ఓవర్‌హెడ్స్ వంటి ప్రాథమిక చాప్టర్లలో పట్టు సాధించడం ఎంతో అవసరం. ఓవర్‌హెడ్స్, స్టాండర్డ్ కాస్టింగ్, మార్జినల్ కాస్టింగ్, ప్రాసెస్ కాస్టింగ్ వంటి చాప్టర్లలో అప్లికేషన్ అప్రోచ్‌తో సమస్యలు సాధన చేయాలి. కొత్తగా చేర్చిన కాస్ట్ షీట్, యూనిట్ కాస్టింగ్, ఏబీసీ కాస్టింగ్, సర్వీస్ కాస్టింగ్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలి.

### పేపర్-4 ట్యాక్సేషన్ (100 మార్కులు)

ఈ పేపర్‌లోనూ 30 శాతం మార్కులకు ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఉంటాయి. 60 మార్కులకు ఉండే ఇన్‌కమ్ ట్యాక్స్ విషయంలో ఫైనాన్స్ యాక్ట్-2018పై ప్రత్యేక దృష్టిపెట్టాలి. దీనికి సంబంధించి పది నుంచి పదిహేను ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. ఆర్‌టీపీస్, ఎంటీపీస్, పాత ప్రశ్న పత్రాలను ప్రాక్టీస్ చేస్తున్నప్పుడు.. అందులోని అంశాలను నూతన ఫైనాన్స్ యాక్ట్‌కు అనుగుణంగా మార్చుకొని చదవాలి. రిటర్న్ ఆన్ ఇన్‌కమ్, అడ్వాన్స్ ట్యాక్స్ అండ్ ఇంట్రస్ట్, టీడీఎస్, టీసీఎస్, వంటి చిన్న చాప్టర్లను కూడా చదవాలి. గ్రాస్ టోటల్ ఇన్‌కమ్‌కు సంబంధించి ప్రాబ్లమ్స్‌ను ప్రాక్టీస్ చేయాలి. అంచెల వారీగా సమాధానం ఇచ్చే విధంగా సిద్ధమవ్వాలి. టోటల్ ఇన్‌కమ్‌కు సంబంధించిన ప్రాబ్లమ్స్‌ను సాధ్యమైనన్ని ఎక్కువ సార్లు ప్రాక్టీస్ చేయడం వల్ల ట్యాక్స్‌లోని అయిదు విభాగాలను రివిజన్ చేసినట్లు అవుతుంది. ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్‌లో పాత, కొత్త సిలబస్ ప్రకారం జీఎస్‌టీకి ప్రాధాన్యం ఇవ్వాలి. ఇన్‌స్టిట్యూట్ మెటీరియల్‌లోని అన్ని ప్రాబ్లమ్స్‌ను పూర్తిగా ప్రాక్టీస్ చేయాలి. జీఎస్‌టీ లయబిలిటీ నుంచి 12 ప్రశ్నలు అడిగే అవకాశముంది. జీఎస్‌టీకి సంబంధించి ఎంసీక్యూస్‌ను నిర్లక్ష్యం చేయకుండా చదవాలి.

### పేపర్-5 (అడ్వాన్స్‌డ్ అకౌంటింగ్-100 మార్కులు)

అకౌంటింగ్ సబ్జెక్ట్ మాదిరిగానే అడ్వాన్స్‌డ్ అకౌంటింగ్ సబ్జెక్ట్‌కు సన్నద్ధమవ్వాలి. అకౌంటింగ్ స్టాండర్డ్స్‌ను తప్పనిసరిగా చదవాలి. ఫార్మట్స్ ఉన్న చాప్టర్స్‌ను బాగా ప్రాక్టీస్ చేయాలి. వీలైనంత ఎక్కువగా ప్రాబ్లమ్స్‌ను ప్రాక్టీస్ చేయాలి. అమాల్గమేషన్ అండ్ ఇంటర్నల్ రీ-కన్‌స్ట్రక్షన్, కన్సాలిడేషన్ ఆఫ్ ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్స్ చాప్టర్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి.

### పేపర్-6 (ఆడిటింగ్ అండ్ అష్యూరెన్స్-100 మార్కులు)

ఈ పేపర్లో 30 శాతం ప్రశ్నలు ఆబ్జెక్టివ్ తరహాలో.. మిగతా ప్రశ్నలు డిస్క్రిప్టివ్ విధానంలో ఉంటాయి. ఆడిటింగ్ స్టాండర్డ్ పేరు, నెంబర్‌ను బాగా గుర్తు పెట్టుకోవాలి. ఆడిటింగ్ స్టాండర్డ్ గురించి సరిగా రాయలేకపోయినా.. దాని పేరు, నెంబర్ వరకు రాసినా చాలు.. ఎగ్జామినర్ దృష్టిని ఆకర్షించి మార్కులు పొందే అవకాశముంది. ర్యాంకు లక్ష్యంగా నిర్దేశించుకున్న అభ్యర్థులు అన్ని చాప్టర్లలోని ప్రాక్టికల్ ప్రశ్నలు చదవాలి. ఆడిటింగ్ పరీక్షల్లో ఇటీవల కాలంలో ట్రూ ఆర్ ఫాల్స్ తరహా ప్రశ్నలు 20 మార్కుల మేర అడుగుతున్నారు. వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలి. కొత్తగా కలిపిన ఎస్ఏ 701, ఆడిట్ ఆఫ్ బ్యాంక్ అంశాలను క్షుణ్నంగా చదవాలి. కొత్త సవరణలపై అవగాహన అవసరం.

### పేపర్-7 (ఎంటర్‌ప్రైజ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ అండ్ స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్- 100 మార్కులు)

ఈ పేపర్ కూడా ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ తరహాలో ఉంటుంది. ఇప్పటివరకు అధ్యయనం చేసిన పుస్తకాలు లేదా సీఏ ఇన్‌స్టిట్యూట్ మెటీరియల్‌లోని సమాధానాలను మాత్రమే చదవాలి. పరీక్ష సమయంలో ఈ సమాధానాలకు సాంకేతిక పదాలు మిళితం చేస్తే మంచి మార్కులు పొందొచ్చు. వీలైనంత ఎక్కువగా రివిజన్ చేయాలి. ఈ రెండు సబ్జెక్టులకు సంబంధించి ఫాస్ట్ ట్రాక్ మెటీరియల్ రూపొందించుకొని చదవడం మేలు చేస్తుంది. ఆబ్జెక్టివ్ కొశ్చన్స్, డెఫినిషన్స్, వ్యత్యాసాలు, తప్పు, ఒప్పు ప్రశ్నలు వంటి వాటిని ప్రత్యేక దృష్టితో చదివితే మంచి మార్కులు పొందొచ్చు. ఎంటర్‌ప్రైజ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌లో ప్రశ్నలు డైరెక్ట్‌గా ఉంటాయి. కానీ సమాధానం ఇవ్వాలంటే.. అప్లికేషన్ ఒరియెంటేషన్ అవసరం. ఈ పేపర్‌లోని అధిక అంశాలను సీఏ-ఫైనల్‌లోని ఐఎస్‌సీఏ సబ్జెక్ట్ నుంచి పేర్కొన్నారు. వాస్తవానికి దీన్ని కొంత క్లిష్టంగా భావిస్తారు. ఆబ్జెక్టివ్ ప్రశ్నలు, డెఫినిషన్స్, వ్యత్యాసాలు, తప్పు-ఒప్పు ప్రశ్నలపై పట్టు సాధిస్తే.. ఈ సబ్జెక్ట్‌లోనూ సులువుగా మంచి మార్కులు సొంతం చేసుకోవచ్చు. మరో 50మార్కులకు ఉండే స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్‌లో ప్రశ్నలు కొంత తికమకగా అభ్యర్థులు ఆందోళన చెందే విధంగా ఉంటాయి. కాబట్టి ప్రిపరేషన్ సమయంలోనే ఇలాంటి ప్రశ్నల ప్రాక్టీస్‌పై ప్రత్యేక దృష్టిపెట్టాలి. 2, 3, 4, 5 చాప్టర్ల నుంచి అప్లికేషన్ ఆధారిత ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి పాత ప్రశ్న పత్రాలను సాధన చేయాలి.

### పేపర్-8 (ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ అండ్ ఎకనామిక్స్ ఫర్ ఫైనాన్స్-100 మార్కులు)

60 మార్కులకు ఉండే.. ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సబ్జెక్ట్‌కు సంబంధించి 25 నుంచి 30 మార్కులకు థియరీ ప్రశ్నలు అడిగే అవకాశముంది. దీంతో గత అయిదేళ్ల ప్రశ్న పత్రాల్లోని థియరీ ప్రశ్నలను కచ్చితంగా చదవాలి. ముఖ్యంగా సోర్సెస్ ఆఫ్ ఫైనాన్స్, స్కోప్ అండ్ ఆబ్జెక్టివ్ ఆఫ్ ఎఫ్ఎం వంటి చాప్టర్లలో థియరీ ప్రశ్నలు బాగా చదవాలి. ఇన్వెస్ట్‌మెంట్ డెసిషన్స్ అండ్ వర్కింగ్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ చాప్టర్లలో కాన్సెప్ట్స్‌పై స్పష్టత ఏర్పరచుకోవాలి. కొత్తగా చేర్చిన రిస్క్ అనాలిసిస్, లీజింగ్ అండ్ డెసిషన్స్ చాప్టర్లపై ప్రత్యేక దృష్టిసారించాలి. 40మార్కులకు ఉండే ఎకనామిక్స్ ఫర్ ఫైనాన్స్ విషయంలో... ఫార్ములా ఆధారిత ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి. ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్‌పై పూర్తి స్థాయిలో అవగాహన ఏర్పరచుకోవాలి. పరీక్షలో ప్రశ్నలు డైరెక్ట్‌గా ఉంటాయి. క్లిష్టంగా ఉండే అంశాలకు సంబంధించి ఉదాహరణలపై దృష్టిసారించాలి. ప్రతి చాప్టర్‌లోనూ ఇంట్రడక్షన్, డెఫినిషన్స్, ఫ్లోచార్ట్స్, గ్రాఫ్స్, టెక్నికల్ టర్మ్స్, అప్రాప్రియేట్ అసెంప్షన్స్, ఫార్ములాస్, ఎగ్జామ్‌పుల్స్, సైడ్ హెడింగ్స్‌పై దృష్టిపెట్టాలి. ఈ సబ్జెక్ట్‌లో షార్ట్ ఆన్సర్ ప్రశ్నలు అడగడం విద్యార్థులకు మేలు చేసే అంశం.

### వెయిటేజీకి అనుగుణంగా సన్నద్ధత

సీఏ ఇంటర్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు.. సిలబస్‌లో ఆయా అంశాలకు ఇచ్చిన వెయిటేజీకి అనుగుణంగా సన్నద్ధమవ్వాలి. ఆర్‌టీపీస్, ఎంటీపీస్ సాధన చేస్తూ.. ప్రశ్నలు అడిగే తీరుపై అవగాహన పొందాలి. ప్రతి సబ్జెక్ట్‌లోనూ ప్రాథమిక అంశాలపై పట్టుసాధించాలి. అకౌంట్స్ వంటి సబ్జెక్ట్‌లలో సమాధానాలు ఇచ్చేటప్పుడు.. ప్రాబ్లమ్‌తోపాటు సంబంధిత ఫార్మాట్‌కు కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రస్తుతం కొత్త పుస్తకాల జోలికి వెళ్లకుండా.. ఇప్పటివరకు చదివిన పుస్తకాల్లోని అంశాలనే అధ్యయనం చేయాలి. ప్రిపరేషన్ సమయంలో బాగా క్లిష్టంగా ఉండే సబ్జెక్ట్‌లను గుర్తించి.. వాటిపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ప్రతి సబ్జెక్ట్‌ను నిర్దిష్టంగా కొన్ని రోజులు చదివే విధంగా ప్రణాళిక రూపొందించుకోవాలి. ఆ సమయంలో కూడా ఏ చాప్టర్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలో గుర్తించి చదవడం మేలు చేస్తుంది.



- ఎం.ఎస్.ఎస్.ప్రకాశ్
డైరెక్టర్, మాస్టర్‌మైండ్స్

---

## ఉద్యోగ సమాచారం

### ఏపీ పోస్టల్ సర్కిల్‌లో 2707 పోస్టులు

ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ 2707 గ్రామీణ్ డాక్ సేవక్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ✦ **పోస్టులు:** బ్రాంచ్ పోస్టు మాస్టర్, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్, డాక్ సేవక్.
- ✦ **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు స్థానిక భాష వచ్చి ఉండాలి.
- ✦ **వయసు:** 2019, అక్టోబర్ 15 నాటికి 18-40 ఏళ్ల మధ్య ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, పీడబ్ల్యూడీలకు పదేళ్లు గరిష్ట వయో పరిమితిలో సడలింపు.
- ✦ **ఎంపిక:** పదో తరగతి మార్కుల ఆధారంగా.
- ✦ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- ✦ **దరఖాస్తు ఫీజు:** రూ.100.
- ✦ **రిజిస్ట్రేషన్ అండ్ ఫీజు చెల్లింపు ప్రక్రియ ప్రారంభం:** అక్టోబర్ 15, 2019.
- ✦ **రిజిస్ట్రేషన్ అండ్ ఫీజు చెల్లింపు ప్రక్రియ చివరి తేదీ:** నవంబర్ 14, 2019.
- ✦ **దరఖాస్తులు ప్రారంభం:** అక్టోబర్ 22, 2019
- ✦ **దరఖాస్తుకు చివరితేదీ:** నవంబర్ 21, 2019
- ✦ **వెబ్‌సైట్:** www.appost.in

### తెలంగాణ పోస్టల్ సర్కిల్‌లో 970 పోస్టులు

తెలంగాణ పోస్టల్ సర్కిల్ 970 గ్రామీణ్ డాక్ సేవక్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ✦ **పోస్టులు:** బ్రాంచ్ పోస్టు మాస్టర్, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్, డాక్ సేవక్.
- ✦ **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు స్థానిక భాష వచ్చి ఉండాలి.
- ✦ **వయసు:** 2019, అక్టోబర్ 15 నాటికి 18-40 ఏళ్ల మధ్య ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, పీడబ్ల్యూడీలకు పదేళ్లు గరిష్ట వయో పరిమితిలో సడలింపు.
- ✦ **ఎంపిక:** పదో తరగతి మార్కుల ఆధారంగా.
- ✦ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- ✦ **దరఖాస్తు ఫీజు:** రూ.100.
- ✦ **రిజిస్ట్రేషన్ అండ్ ఫీజు చెల్లింపు ప్రక్రియ ప్రారంభం:** అక్టోబర్ 15, 2019.
- ✦ **రిజిస్ట్రేషన్ అండ్ ఫీజు చెల్లింపు ప్రక్రియ చివరి తేదీ:** నవంబర్ 14, 2019.
- ✦ **దరఖాస్తులు ప్రారంభం:** అక్టోబర్ 22, 2019
- ✦ **దరఖాస్తుకు చివరితేదీ:** నవంబర్ 21, 2019
- ✦ **వెబ్‌సైట్:** https://telanganapostalcircle.in

---

# 2019 నోబెల్ బహుమతులు

జీకే అండ్ కరెంట్ అఫైర్స్

**స్వీడన్‌కు చెందిన ప్రఖ్యాత శాస్త్రవేత్త ఆల్ఫ్రెడ్ నోబెల్ పేరిట ప్రతియేటా ఆరు రంగాల్లో భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, వైద్య శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, సాహిత్యం, శాంతిలో నోబెల్ బహుమతులను అందజేస్తారు. వీటిని ఏటా అక్టోబర్‌లో ప్రకటించి, ఆల్ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి అయిన డిసెంబర్ 10న స్వీడన్ రాజధాని స్టాక్‌హోంలో ప్రధానం చేస్తారు. శాంతి బహుమతిని మాత్రమే నార్వే రాజధాని ఓస్లోలో అందజేస్తారు. 2019కి గాను నోబెల్ బహుమతులను ఇటీవలే ప్రకటించారు. వాటి వివరాలు...**



## భౌతిక శాస్త్రం

2019కి గాను ముగ్గురు అంతరిక్ష పరిశోధకులకు భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది. కెనెడియన్ అమెరికన్ ఖగోళ శాస్త్రవేత్త జేమ్స్ పీబుల్స్, స్విట్జర్లాండ్ శాస్త్రవేత్తలు మిషెల్ మేయర్, డిడియెర్ క్యులోజ్‌లకు ఈ విభాగంలో నోబెల్ బహుమతి లభించింది. బహుమతి (9.14 లక్షల అమెరికన్ డాలర్లు లేదా రూ.6.5 కోట్లు)లో సగం పీబుల్స్, మిగతా సగాన్ని మిషెల్ మేయర్, డిడియెర్ క్యులోజ్ సంయుక్తంగా గెలుచుకున్నట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రకటించింది. బిగ్ బ్యాంగ్ అనంతరం విశ్వం ఎలా రూపాంతరీకరణ చెందింది అనే విషయమై జేమ్స్ పీబుల్స్ చేసిన పరిశోధనలకు గాను ఈ బహుమతి లభించింది. 1995లో తొలి సారి మన గ్రహ వ్యవస్థకు ఆవల ఓ గ్రహాన్ని గుర్తించినందుకుగాను స్విస్ శాస్త్రవేత్తలు మిషెల్ మేయర్, డిడియెర్ క్యులోజ్‌లకు నోబెల్ దక్కింది. ఆ గ్రహానికి '51 పెగాసి బీ' అని నామకరణం చేశారు. ఈ ముగ్గురి పరిశోధనలు విశ్వంపై మన అవగాహనను మరింత పెంచాయి.

## రసాయన శాస్త్రం

లిథియం-అయాన్ బ్యాటరీ సృష్టికర్తలైన ముగ్గురు శాస్త్రవేత్తలకు రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతి దక్కింది. అమెరికాకు చెందిన జాన్ గుడెనఫ్, బ్రిటిష్ అమెరికన్ శాస్త్రవేత్త స్టాన్లీ విట్టింగ్‌హామ్, జపాన్‌కు చెందిన అకిరా యోషినోలకు సంయుక్తంగా ఈ అవార్డు లభించింది. 9.14 లక్షల అమెరికన్ డాలర్ల ప్రైజ్‌మనీని వీరు ముగ్గురూ సమంగా పంచుకుంటారు. స్మార్ట్‌ఫోన్లు మొదలుకొని ల్యాప్‌టాప్‌లు, ఎలక్ట్రిక్ వాహనాల వరకూ.. అన్నింటినీ నడిపే అత్యంత శక్తివంతమైనది లిథియం-అయాన్ బ్యాటరీ. ఇది తేలికైనది, పలుమార్లు రీచార్జ్ చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఇవి సౌర, పవన విద్యుత్ శక్తిని గణనీయ పరిమాణంలో నిల్వ చేయగలవు. ఈ బ్యాటరీలు శిలాజ ఇంధనాలైన పెట్రోలు, డీజిళ్లపై ఆధారపడటాన్ని తగ్గించి.. పర్యావరణానికి ఎంతో మేలు చేశాయి. లిథియం బ్యాటరీలు మానవ జీవితాల్లో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చాయి. జాన్ గుడెనఫ్ వయసు 97 ఏళ్లు. ఆయన ఆర్థర్ ఆష్కిన్ (96) రికార్డును అధిగమించి.. నోబెల్ పురస్కారం గెలుచుకున్న అతిపెద్ద వయస్కుడిగా రికార్డులకెక్కారు.

## వైద్య శాస్త్రం

2019కిగాను వైద్యశాస్త్రంలో ముగ్గురికి నోబెల్ పురస్కారాన్ని ప్రకటించారు. అమెరికాకు చెందిన విలియం కేలిన్, గ్రెగ్ సెమెంజా, బ్రిటన్‌కు చెందిన సర్ పీటర్ రాట్‌క్లిఫ్‌లకు సంయుక్తంగా లభించింది. శరీరంలోని కణాలు ఆక్సిజన్ స్థాయిలను ఎలా గుర్తిస్తాయి, ఆ స్థాయిలకు అనుగుణంగా తమ పనితీరును ఎలా మార్చుకుంటాయి అనే విషయంపై ఈ ముగ్గురు శాస్త్రవేత్తలు పరిశోధనలు చేశారు. క్యాన్సర్, రక్తహీనత తదితర వ్యాధుల చికిత్సలో ఈ పరిశోధనలు ఉపయోగపడతాయని నోబెల్ కమిటీ పేర్కొంది. శరీరానికి ఆక్సిజన్ తగినంత స్థాయిలో అందకపోవడాన్ని 'హైపోక్సియా' అని పిలుస్తారు. ఆ ప్రతికూలతలను కణాలు ఎలా ఎదుర్కొంటాయి, ఆక్సిజన్ లభ్యత స్థాయిని శరీరంలో కణాలు ఎలా గుర్తిస్తాయి అనే అంశాలపై కేలిన్, సెమెంజా, రాట్‌క్లిఫ్‌లు పరిశోధనలు చేశారు.

## సాహిత్యం

నోబెల్ కమిటీ సాహిత్యం విభాగానికి సంబంధించి రెండేళ్ల అవార్డులను అక్టోబర్ 10న ప్రకటించింది. లైంగిక వేధింపుల ఆరోపణలు రావడంతో 2018కి ఈ పురస్కారాన్ని ప్రకటించకుండా వాయిదా వేశారు. 2019కి గాను సాహిత్యంలో నోబెల్ పురస్కారాన్ని ఆస్ట్రియన్ రచయిత పీటర్ హాండ్కేకు ప్రకటించారు. అత్యంత ప్రభావశీల రచనలు చేసినందుకుగాను ఆయనకు అవార్డిస్తున్నట్లు స్వీడిష్ అకాడమీ తెలిపింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఐరోపాలో అత్యంత ప్రభావవంతమైన రచయితల్లో ఒకరిగా పీటర్ హాండ్కే ఎదిగారని అకాడమీ ప్రశంసించింది. 'ఏ సారో బియాండ్ డ్రీమ్స్', 'అఫెండింగ్ ద ఆడియన్స్', 'ద హార్నెట్స్', 'షార్ట్ లెటర్', 'లాంగ్ ఫేర్‌వెల్' వంటివి ఆయన ప్రముఖ రచనలు. అయితే పీటర్ హాండ్కే తన వివాదాస్పద వ్యాఖ్యలతో తరచూ వార్తల్లోకెక్కారు. 2014లో నోబెల్ సాహిత్య పురస్కారాన్ని నిషేధించాలని పిలుపునిచ్చి వివాదాన్ని రేకెత్తించారు.

✦ 2018 నోబెల్ సాహితీ పురస్కారం పోలండ్ రచయిత్రి ఓల్గా తొకర్జుక్‌కు లభించింది. ఆమె తొలి నవల 'ద జర్నీ ఆఫ్ ద పీపుల్ ఆఫ్ ద బుక్' 1993లో ప్రచురితమైంది. ఆమె రచించిన 'ఫ్లైట్స్' అనే నవలకు జెన్నిఫర్ క్రాఫ్ట్ అనే అనువాదకురాలితో కలిసి 2018లో ప్రతిష్టాత్మక మ్యాన్ బుకర్ ఇంటర్నేషనల్ ప్రైజ్‌ను గెలుచుకుంది. ఆమె రచించిన 900 పేజీల 'ద బుక్స్ ఆఫ్ జాకోబ్' ఏడు దేశాలు, ఐదు భాషల చరిత్రకు సంబంధించింది. సాహిత్య విభాగంలో నోబెల్ పురస్కారాన్ని గెలుచుకున్న 15వ మహిళ ఓల్గా తొకర్జుక్.

## శాంతి బహుమతి

ప్రతిష్టాత్మక నోబెల్ శాంతి పురస్కారం 2019కి గాను ఇథియోపియా ప్రధానమంత్రి అబీ అహ్మద్ అలీకి దక్కింది. ఆఫ్రికాలో శాంతి స్థాపన, అంతర్జాతీయ సహకారంలో ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు దక్కింది. పొరుగు దేశం ఎరిట్రియాతో దశాబ్దాల తరబడి నెలకొనియున్న సరిహద్దు ఉద్రిక్తతలను నివారించడానికి శాంతి ఒప్పందం కుదుర్చుకోవడంలో అబీ అహ్మద్ అలీ చూపించిన చొరవకు గుర్తింపుగా ఈ అవార్డును ప్రకటించారు. 'హార్న్ ఆఫ్ ఆఫ్రికా' ప్రాంతంలోని ఇథియోపియా నుంచి ఎరిట్రియా 1993లో విడిపోయింది. అప్పట్నుంచి ఆ రెండు దేశాల మధ్య సరిహద్దు సమస్యలున్నాయి. 1998 నుంచి 2000 వరకు ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు రెండు దశాబ్దాల పాటు కొనసాగాయి. 2018లో అబీ అహ్మద్ అలీ ఇథియోపియా ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టాక.. ఎరిట్రియాతో ద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరించారు. ఇథియోపియా దేశానికి చెందిన వ్యక్తికి నోబెల్ పురస్కారం రావడం ఇదే ప్రథమం. ఆయన నోబెల్ పురస్కారం పొందిన 100వ విజేత కావడం మరో విశేషం.



## ఆర్థిక శాస్త్రం

2019లో ఆర్థిక శాస్త్రంలో నోబెల్ పురస్కారాన్ని ముగ్గురికి ప్రకటించారు. భారతీయ అమెరికన్ అభిజిత్ బెనర్జీ, ఫ్రెంచ్ అమెరికన్ ఎస్తర్ డఫ్లో, అమెరిక్ ఆర్థిక వేత్త మైకేల్ క్రెమర్‌లకు ఈ బహుమతి లభించింది. ప్రపంచవ్యాప్తంగా పేదరికాన్ని నిర్మూలించడానికి వినూత్న కోణంలో పరిశోధనలు చేసినందుకు వీరికి నోబెల్ పురస్కారం వరించింది. వీరు ముగ్గురు డిసెంబర్ 10న సంయుక్తంగా ఈ బహుమతిని అందుకోనున్నారు. అభిజిత్ బెనర్జీ, ఎస్తర్ డఫ్లోలు దంపతులు కావడం విశేషం. వీరిద్దరూ ప్రస్తుతం మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ)లో ప్రొఫెసర్లుగా పనిచేస్తున్నారు. మైకేల్ క్రెమర్ హార్వర్డ్‌లో ప్రొఫెసర్. ఎలినార్ ఓస్ట్రమ్ తర్వాత(2009) ఆర్థిక శాస్త్రంలో నోబెల్ సాధించిన రెండో మహిళ ఎస్తర్ డఫ్లో. నోబెల్ పురస్కారాన్ని ఆరుగురు భార్యాభర్తల జతలు ఇప్పటి వరకూ అందుకున్నారు. వీరు మేరీ క్యూరీ, పియరీ క్యూరీ(1903); ఫ్రెడరిక్ జోలియట్, ఇరీన్ జోలియట్(1935); కార్ల్ కోరీ, గర్టీ కోరీ(1947); ఆల్వా మిర్డాల్, గున్నార్ మిర్డాల్ (1974); ఎడ్వర్డ్ మోసర్, మే బ్రీట్ మోసర్(2014), అభిజిత్ బెనర్జీ, ఎస్తర్ డఫ్లో( 2019).



ఎన్.విజయేందర్‌రెడ్డి,
సీనియర్ ఫ్యాకల్టీ

## లిస్ట్-ఎ క్రికెట్‌లో భారత్ 'డబుల్ సెంచరీ' హీరోలు

అంతర్జాతీయ క్రికెట్లో...

- రోహిత్ శర్మ 264 (శ్రీలంకపై, కోల్‌కతాలో 2014)
- రోహిత్ శర్మ 209 (ఆస్ట్రేలియాపై, బెంగళూరులో 2013)
- రోహిత్ శర్మ 208 నాటౌట్ (శ్రీలంకపై, మొహాలీలో 2017)
- సచిన్ టెండూల్కర్ 200 నాటౌట్ (దక్షిణాఫ్రికాపై, గ్వాలియర్‌లో 2010)
- వీరేంద్ర సెహ్వాగ్ 219 (వెస్టిండీస్‌పై, ఇండోర్‌లో 2011)

దేశవాళీ క్రికెట్లో...

- శిఖర్ ధావన్ 248 (దక్షిణాఫ్రికా 'ఎ'పై, ప్రిటోరియాలో 2013)
- కరణ్ కౌశల్ 202 (సిక్కింపై, గుజరాత్‌లో 2018)
- సంజూ సామ్సన్ 212 నాటౌట్ (గోవాపై, బెంగళూరులో 2019)
- యశస్వి జైస్వాల్ 203 (జార్ఖండ్‌పై, బెంగళూరులో 2019)

# యశస్వి డబుల్ యశస్సు




"మ్యాచ్‌లు ఆడేటప్పుడు లంచ్ విరామం సమయంలో నా సహచరులు లేదా వాళ్ల తల్లిదండ్రులు మంచి భోజనాలు తీసుకు రావడం చాలా సార్లు చూశాను. నేను మాత్రం ఏదైనా వండుకుంటేనే తినే పరిస్థితి. బ్రేక్ ఫాస్ట్ అనేది దాదాపుగా లేనట్లే. వాళ్లలోనే ఎవరో ఒకరిని బతిమాలి పని కానిచ్చేయడమే. ఈ విషయంలో నేను ఏమాత్రం సిగ్గు పడకపోయేవాడిని. 'డబ్బులు లేవు కానీ ఆకలి మాత్రం ఉంది' అంటూ వారిని అడిగి తినేందుకు సిద్ధపడిపోయేవాడిని. నా పరిస్థితి చూసుకున్నప్పుడు చాలా సార్లు తల్లిదండ్రులు గుర్తుకొచ్చి ఏడుస్తూ కుమిలిపోయేవాడిని. వేసవిలో ప్లాస్టిక్ టెంట్‌లో పడుకున్నప్పుడు వేడితో చచ్చిపోయేవాడిని. దాంతో గ్రౌండ్‌లోనే పడుకునేందుకు సిద్ధమైపోయా. అయితే ఒక రాత్రి ఏదో పురుగు కుట్టి కన్ను వాచిపోవడంతో ఆ తర్వాత ఎంత వేడి అయినా టెంట్‌లోకే మారిపోయా. క్రికెట్‌లో ఒత్తిడి అనే మాటే నాకు తెలీదు. ఎన్నో ఏళ్లుగా రోజూ అనుభవించిన వాడిని. బరిలోకి దిగితే పరుగులు చేయగలనని నమ్మకం ఉండేది కానీ ఆ రోజు భోజనం దొరుకుతుందా లేదా అనే దాని గురించే ఆందోళన చెందిన రోజులు ఉన్నాయి."

–యశస్వి జైస్వాల్

**పిన్న వయసులో డబుల్ సెంచరీ సాధించిన ముంబై క్రికెటర్**

- లిస్ట్ 'ఎ' క్రికెట్‌లో కొత్త ప్రపంచ రికార్డు
- 154 బంతుల్లో 17 ఫోర్లు, 12 సిక్సర్లతో 203 పరుగులు

**బెంగళూరు:** భారత క్రికెట్‌లో మరో కొత్త టీనేజీ సంచలనం! సంచలన బ్యాటింగ్ ప్రదర్శనలకు కేరాఫ్ అడ్రస్‌వంటి ముంబై మైదానాల నుంచి వచ్చిన మరో కుర్రాడు కొత్త ప్రపంచ రికార్డుతో సంచలనం సృష్టించాడు. ముంబైకి చెందిన యశస్వి భూపేంద్ర కుమార్ జైస్వాల్ అంతర్జాతీయ, దేశవాళీ వన్డేల్లో కలిపి (లిస్ట్–ఎ మ్యాచ్‌లు) అతి పిన్న వయసులో (17 ఏళ్ల 292 రోజులు) డబుల్ సెంచరీ సాధించిన ఆటగాడిగా నిలిచాడు. విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో అతను ఈ సంచలన ప్రదర్శన నమోదు చేశాడు. జార్ఖండ్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో యశస్వి 154 బంతుల్లో 17 ఫోర్లు, 12 సిక్సర్లతో 203 పరుగులు సాధించాడు. గతంలో దక్షిణాఫ్రికాకు చెందిన అలన్ బారో 20 ఏళ్ల 276 రోజుల వయసులో చేసిన డబుల్ సెంచరీ రికార్డును యశస్వి బద్దలు కొట్టాడు. ఓపెనర్‌గా బరిలోకి దిగిన యశస్వికి తోడుగా ఆదిత్య తారే (78; 6 ఫోర్లు, సిక్స్) కూడా రాణించడంతో ముంబై 50 ఓవర్లలో 3 వికెట్లకు 358 పరుగులు చేసింది. అనంతరం 319 పరుగులకు ఆలౌటైన జార్ఖండ్ 38 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. విరాట్ సింగ్ (77 బంతుల్లో 100; 12 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీ సాధించాడు.

## పానీపూరి నుంచి పరుగుల వరద వరకు...

11 ఏళ్ల వయసు... కానీ పెద్ద క్రికెటర్ కావాలనేది కల. అది నెరవేర్చుకోవాలంటే స్వస్థలం భదోహీ (ఉత్తర ప్రదేశ్)లో మాత్రం సాధ్యం కాదు. అందుకే దేనికైనా సిద్ధం అంటూ 'చలో ముంబై' అన్నాడు. సొంతూర్లో తండ్రిది చిన్న కిరాణా కొట్టు. ఇద్దరు పిల్లల పోషణ కూడా ఆయనకు భారంగా అనిపించి నీ ఇష్టం అనేశాడు. దూరపు బంధువొకరు ముంబైలో ఉంటే ఆయనను నమ్ముకొని బయల్దేరాడు. ఏదైనా పని ఇప్పిస్తానంటూ డెయిరీ దుకాణంలో నౌకరీ ఇప్పించిన ఆ బంధువు ఇల్లు మాత్రం రెండో మనిషికి అవకాశమే లేనంత చిన్నది! దాంతో తను పని చేస్తున్న చోటే రాత్రి కూడా పడుకోవడం మొదలు పెట్టాడు. అయితే రోజంతా పనికంటే క్రికెట్‌పైనే ఎక్కువ శ్రద్ధ పెట్టడంతో వారు పనికిరావంటూ పంపించేశారు. దాంతో కథ మళ్లీ మొదటికొచ్చింది. మళ్లీ అదే బంధువు ఆదుకుంటూ తాను పని చేస్తున్న 'ముస్లిం యునైటెడ్ క్లబ్' క్రికెట్ గ్రౌండ్‌లో ఒక మూలన ఉండే టెంట్‌లో ఆ అబ్బాయిని ఉంచేందుకు అనుమతి తీసుకున్నాడు.



కనీసం విద్యుత్ సౌకర్యం కూడా లేకుండా ప్లాస్టిక్ కవర్లతో కప్పి ఉంచిన ఆ టెంటే అప్పటి నుంచి యశస్వి ప్రపంచమైపోయింది. స్థానికంగా క్రికెట్ మ్యాచ్‌లు ఆడటం, యునైటెడ్ క్లబ్‌కు సంబంధించి గ్రౌండ్స్‌మన్‌తోనే ఉంటూ వారికి రొటీలు చేసి పెట్టడం అతని రోజువారీ పని. తన కంటే వయసులో పెద్దవారితో క్రికెట్ మ్యాచ్‌లు ఆడితే 200–300 రూపాయలు వచ్చేవి. వాటినే ఎంతో పొదుపుగా వాడుకోవాల్సి వచ్చేది. ముంబైలోని ఆజాద్ మైదాన్‌లో రామ్‌లీలా ఉత్సవాలు, ఇతర కార్యక్రమాలు జరిగినప్పుడు యశస్వి అక్కడ పానీ పూరీలు కూడా అమ్మాడు! తనతో ఆడే కుర్రాళ్లు ఆ సమయంలో పానీపూరీ తినేందుకు తన వద్దకు రావద్దని అతను కోరుకునే పరిస్థితి. టెంట్‌లో ఉంటున్న సమయంలో తాను ఆకలితో పడుకున్న రాత్రులు కూడా ఎన్నో ఉన్నాయి. కష్టాల జాబితా చూస్తే అంతు లేదు. కానీ అతను వాటన్నింటినీ ధైర్యంగా ఎదుర్కొన్నాడు. అన్ని బాధలు భరిస్తూ కూడా క్రికెటర్ కావాలనే తన లక్ష్యానికి మాత్రం దూరం కాలేదు. యశస్వి గాథలు ఆజాద్ మైదాన్‌లో చాలా మందికి చేరాయి. సహజ ప్రతిభావంతుడైన ఒక కుర్రాడిని అండగా నిలవాల్సిన అవసరం తెలిసింది. వీరిలో ఒక స్థానిక కోచ్ జ్వాలా సింగ్ అందరికంటే ముందుగా స్పందించాడు. యశస్విలాంటి నేపథ్యంతోనే అదే ఉత్తర ప్రదేశ్ నుంచి వచ్చి పెద్ద స్థాయికి చేరలేకపోయిన జ్వాలా సింగ్‌కు బహుశా అతనిలో తన ప్రతిరూపం కనిపించి ఉంటుంది! అందుకే ఈ కుర్రాడిని చేరదీసి ఆటను తీర్చిదిద్ది ముందుకు నడిపించాడు. అతని ప్రోత్సాహంతో ముందుకు వెళ్లిన యశస్వి స్థానిక లీగ్‌లలో పరుగుల వరద పారించాడు. గత ఐదేళ్లలో అన్ని స్థాయిల మ్యాచ్‌లలో కలిపి అతను దాదాపు 50 సెంచరీలు బాదాడు.

వేర్వేరు వయో విభాగాల్లో ఈ అసాధారణ ప్రదర్శన అతడికి ముంబై అండర్–19 జట్టులో, ఆ తర్వాత భారత అండర్–19 జట్టులో చోటు కల్పించింది. గత ఆగస్టులో ఇంగ్లండ్‌లో అండర్–19 ముక్కోణపు టోర్నీలో ఫైనల్లో సహా మొత్తం నాలుగు అర్ధ సెంచరీలతో జట్టుకు టైటిల్ అందించిన అతను ఇప్పుడు సీనియర్ స్థాయిలో కూడా సత్తా చాటుతున్నాడు. సరిగ్గా రెండేళ్ల క్రితం జరిగిన అండర్–19 ఆసియా కప్ టోర్నీతో యశస్వికి మొదటిసారి గుర్తింపు లభించింది. భారత్ విజేతగా నిలిచిన ఆ టోర్నీలో యశస్వి 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' పురస్కారాన్ని అందుకున్నాడు. అప్పటి నుంచి అతని ఆట మరింత జోరందుకుంది. ముంబై సీనియర్ టీమ్‌కు ఎంపిక కావడం అతని కెరీర్‌లో కీలక మలుపు. 44, 113, 22, 122, 203... విజయ్ హజారే ట్రోఫీలో యశస్వి జైస్వాల్ వరుస స్కోర్లు ఇవి. ఆడిన ఐదు మ్యాచ్‌లలో మూడు సెంచరీలు ఉన్నాయి. అందులో ఒక డబుల్ సెంచరీ కూడా. వీటిని చూస్తే యశస్వి ప్రదర్శన ఒక సంచలన ఇన్నింగ్స్‌కే పరిమితం కాదని, అతని ఆటలో ఎంత నిలకడ ఉందో అర్థమవుతుంది. తాజా ప్రదర్శన యశస్విని భవిష్యత్ తారగా ఆశలు రేపేలా చేసింది.



కోచ్ జ్వాలా సింగ్‌తో

# సైనా, శ్రీకాంత్‌లకు షాక్

**డెన్మార్క్ ఓపెన్ తొలి రౌండ్‌లోనే ఓడిన భారత స్టార్స్**



**ఒడెన్స్:** ఈ సీజన్‌లో భారత బ్యాడ్మింటన్ స్టార్స్ సైనా నెహ్వాల్, కిడాంబి శ్రీకాంత్‌లకు మరోసారి నిరాశ ఎదురైంది. డెన్మార్క్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 టోర్నమెంట్‌లో ఈ ఇద్దరు మాజీ చాంపియన్స్ తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టారు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ఎనిమిదో సీడ్ సైనా 15–21, 21–23తో సయాక తకహాషి (జపాన్) చేతిలో పరాజయం పాలైంది. ఈ ఏడాది తకహాషి చేతిలో సైనా ఓడిపోవడం ఇది రెండోసారి కావడం గమనార్హం. మోకాలి గాయంతో చైనా ఓపెన్, కొరియా ఓపెన్ టోర్నీల్లో బరిలోకి దిగని శ్రీకాంత్ డెన్మార్క్ ఓపెన్‌లో ఆకట్టుకోలేకపోయాడు. ప్రపంచ మాజీ నంబర్‌వన్ శ్రీకాంత్ 14–21, 18–21తో నాలుగో సీడ్ ఆంటోన్సెన్ (డెన్మార్క్) చేతిలో ఓటమి చవిచూశాడు. 2017 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఆంటోన్సెన్‌పై ఇదే స్కోరుతో శ్రీకాంత్ గెలుపొందడం విశేషం. గత రెండేళ్లలో ఆంటోన్సెన్ ఆటతీరులో ఎంతో పురోగతి కనిపించింది. ఈ ఏడాది ఇండోనేసియా మాస్టర్స్, బార్సిలోనా మాస్టర్స్, యూరోపియన్ గేమ్స్‌లలో స్వర్ణాలు నెగ్గిన ఆంటోన్సెన్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రన్నరప్‌గా నిలిచాడు. పురుషుల సింగిల్స్ మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో భారత ప్లేయర్ సమీర్ వర్మ 21–11, 21–11తో సునెయామ (జపాన్)పై గెలిచాడు. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో నేలకుర్తి సిక్కి రెడ్డి–ప్రణవ్ చోప్రా (భారత్) జంట 21–16, 21–11తో మార్విన్ సీడెల్–లిండా ఎఫ్లెర్ (జర్మనీ) జోడీపై నెగ్గింది. రెండో సీడ్ వాంగ్ యి లియు–హువాంగ్ డాంగ్ పింగ్ (చైనా) జోడీకి సాత్విక్ సాయిరాజ్–అశ్విని పొన్నప్ప జంట వాకోవర్ ఇచ్చింది.

## భారత్‌కు మూడో విజయం



**జొహర్ బారు (మలేసియా):** సుల్తాన్ జొహర్ కప్ అంతర్జాతీయ జూనియర్ హాకీ టోర్నమెంట్‌లో భారత్ ఖాతాలో మూడో విజయం చేరింది. ఆస్ట్రేలియాతో బుధవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 5–1 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. భారత్ తరఫున శిలానంద్ లాక్రా (26వ, 29వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేయగా... దిల్‌ప్రీత్ సింగ్ (44వ ని.లో), గుర్‌సాహిబ్జిత్ సింగ్ (48వ ని.లో), మన్‌దీప్ మోర్ (50వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. ఆస్ట్రేలియాకు ఆరోన్ నైట్ (57వ ని.లో) ఏకైక గోల్‌ను అందించాడు. ఆరు జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీలో భారత్ 9 పాయింట్లతో బ్రిటన్‌తో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉంది. గురువారం విశ్రాంతి దినం. శుక్రవారం జరిగే తమ చివరి లీగ్ మ్యాచ్‌లో బ్రిటన్‌తో భారత్ తలపడుతుంది. లీగ్ దశ పూర్తయ్యాక పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఫైనల్లో ఆడతాయి. భారత్–బ్రిటన్ మ్యాచ్ 'డ్రా'గా ముగిస్తే రెండు జట్లు ఫైనల్‌కు చేరుతాయి.

## మా ప్రదర్శన బాగాలేదు: సునీల్ చెత్రి



**కోల్‌కతా:** 'ఫిఫా' ప్రపంచకప్–2022 క్వాలిఫయర్స్‌లో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో తమ ప్రదర్శన ఏమాత్రం బాగాలేదని భారత ఫుట్‌బాల్ కెప్టెన్ సునీల్ చెత్రి అసంతృప్తి వ్యక్తం చేశాడు. బంగ్లా కంటే ఎంతో మెరుగైన ర్యాంకింగ్స్‌లో ఉన్న భారత్ చివరి నిమిషాల్లో 1–1తో 'డ్రా'తో గట్టెక్కింది. ఈ ఫలితంపై కెప్టెన్ మాట్లాడుతూ 'మేం స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేకపోయాం. బంగ్లాతో జరిగిన పోరులో మా ఆటతీరు బాగాలేదు. దీనిపై డ్రెస్సింగ్ రూమ్ అంతా నిరాశలో కూరుకుపోయింది. అంది వచ్చిన అవకాశాల్ని సద్వినియోగం చేసుకోలేకపోయాం. ప్రత్యర్థి జట్టుకంటే మెరుగైన డిఫెన్స్ ఉన్నప్పటికీ తేలిపోయాం. మా దాడులకు పదును పెట్టాల్సింది. ఇంకా ఇంకా ప్రయత్నించాల్సింది' అని నిట్టూర్చాడు. గత మ్యాచ్‌లో ఆసియా చాంపియన్ ఖతర్‌ను నిలువరించిన భారత్ ఎంతో ఆత్మవిశ్వాసంతో ఈ మ్యాచ్ బరిలోకి దిగింది. బంగ్లాపై గెలవాల్సిన ఈ మ్యాచ్‌లో ఓ దశలో ఓటమి అంచులదాకా వెళ్లింది. ఆఖర్లో ఆదిల్ ఖాన్ చేసి హెడర్‌తో 'డ్రా' చేసుకొని భారత్ ఊపిరి పీల్చుకున్న సంగతి తెలిసిందే. మూడు మ్యాచ్‌లాడిన భారత్ ఖాతాలో రెండు పాయింట్లున్నాయి. ఒమన్ చేతిలో ఓడిన భారత్... ఖతర్, బంగ్లాలతో 'డ్రా' చేసుకుంది.

## ధోని మనసులో మాట తెలియాలి: గంగూలీ



**కోల్‌కతా:** భారత క్రికెట్‌లో ఇప్పుడు మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని పరిస్థితి జట్టుతో ఉండీ లేనట్లే ఉంది. ఒకవైపు అతను మ్యాచ్‌లు ఆడటం లేదు. అలా అని అధికారికంగా రిటైర్మెంట్ కూడా ప్రకటించలేదు. తాను ఆడాలనుకునే సిరీస్‌లు తనే ఎంపిక చేసుకుంటున్నాడు. ప్రపంచ కప్ సెమీ ఫైనల్ తర్వాత అతను మళ్లీ బరిలోకి దిగలేదు. అతను సెలక్టర్లకు ఏం చెప్పాడో వారికి మాత్రమే తెలుసు. ఈ నేపథ్యంలో కొత్తగా బీసీసీఐ అధ్యక్ష పదవి చేపట్టబోతున్న సౌరవ్ గంగూలీ దీనిపై స్పందించాడు. ధోని విషయంలో తనకు మరింత స్పష్టత కావాల్సి ఉందంటూ వ్యాఖ్యానించాడు. 'నేను బాధ్యతలు చేపట్టిన మరుసటి రోజు ఈ నెల 24న సెలక్టర్లతో సమావేశమవుతున్నా. ధోనికి సంబంధించి వారి ఆలోచనలు ఏమిటో నేను తెలుసుకుంటా. ఆ తర్వాత నా అభిప్రాయం వెల్లడిస్తా. అసలు ధోని ఏమనుకుంటున్నాడో కూడా తెలియాలి. ఇప్పటి వరకు నాకు ఎలాంటి సంబంధం లేదు కాబట్టి నేను పట్టించుకోలేదు. ఇప్పుడు ఒక అధికారిక హోదాలో దీని గురించి సమాచారం తెలుసుకొని ఏం చేయాలో నిర్ణయిస్తా' అని గంగూలీ స్పష్టం చేశాడు.

### ముగ్గురు యూఏఈ క్రికెటర్లపై వేటు

**దుబాయ్:** అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ముగ్గురు యూఏఈ క్రికెటర్లపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) సస్పెన్షన్ వేటు వేసింది. కెప్టెన్ మొహమ్మద్ నవీద్, బ్యాట్స్‌మన్ షైమన్ అన్వర్, పేసర్ ఖదీర్ అహ్మద్‌లు అవినీతి నిరోధక నిబంధనల్ని అతిక్రమించినట్లు తేలడంతో ఐసీసీ వీరిపై తాత్కాలిక నిషేధం విధించినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. తమపై వచ్చిన ఆరోపణలపై 14 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఐసీసీ తెలిపింది.

## ఫైనల్లో ఢిల్లీ, బెంగాల్

- సెమీస్‌లో బెంగళూరు, యు ముంబా ఓటమి
- ప్రొ కబడ్డీ లీగ్

**అహ్మదాబాద్:** ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) ఏడో సీజన్‌లో దబంగ్ ఢిల్లీ, బెంగాల్ వారియర్స్ ఫైనల్లోకి ప్రవేశించాయి. బుధవారం జరిగిన సెమీఫైనల్లో ఢిల్లీ జట్టు 44–38తో డిఫెండింగ్ చాంపియన్ బెంగళూరు బుల్స్‌కు షాకిచ్చింది. ఈ మ్యాచ్‌లో దబంగ్ టీమ్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. రైడర్లలో నవీన్ 15, చంద్రన్ రంజీత్ 9 పాయింట్లు సాధించారు. డిఫెండర్ అనిల్ 4 పాయింట్లు చేశాడు. మిగతావారిలో విజయ్, రవీందర్, జోగిందర్ తలా 3 పాయింట్లు తెచ్చిపెట్టారు. బెంగళూరు జట్టు తరఫున పవన్ షెరావత్ (18) చక్కని పోరాటపటిమ కనబరిచాడు. రెండో సెమీస్‌లో బెంగాల్ వారియర్స్ 37–35తో యు ముంబాపై నెగ్గింది. వారియర్స్ తరఫున సుకేశ్ (8), నబీబక్ష్ (5), ప్రపంజన్ (4) రాణించారు.



యు ముంబా జట్టులో అభిషేక్ 11 పాయింట్లు సాధించాడు. రెండు రోజుల విశ్రాంతి అనంతరం శనివారం ఢిల్లీ, బెంగాల్ జట్ల మధ్య ఇక్కడే టైటిల్ పోరు జరగనుంది.

## అయ్యో... నిఖత్!

**మళ్లీ ట్రయల్స్ లేకుండానే మేరీకోమ్‌కే చాన్స్**





**న్యూఢిల్లీ:** మరోసారి తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్‌కు భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్‌ఐ) నుంచి నిరాశే ఎదురైంది. సెలక్షన్ ట్రయల్స్‌ను పక్కనబెట్టి మళ్లీ పతక విజేతలకు బీఎఫ్‌ఐ జైకొట్టడంతో నిఖత్ ఒలింపిక్స్ క్వాలిఫయర్స్‌కు దూరమైంది. ఈ ఆగస్టులో ప్రపంచ చాంపియన్‌షిప్‌కు ముందు కూడా ఇలాంటి నిర్ణయంతో నిఖత్ జరీన్ ఇంటికే పరిమితమైంది. మహిళా బాక్సింగ్ దిగ్గజం మేరీకోమ్ కూడా నిఖత్ వెయిట్ కేటగిరీ (51 కేజీలు) కావడం తెలంగాణ బాక్సర్‌కు శాపమైంది. మేటి బాక్సర్‌ను కాదనలేక, షెడ్యూలు ప్రకారం ట్రయల్స్ నిర్వహించకుండానే మేరీని బీఎఫ్‌ఐ ఖరారు చేసింది. ఇప్పుడు నిఖత్ ఒలింపిక్స్ ఆశల్ని క్వాలిఫయింగ్‌కు ముందే తుంచేసింది. వచ్చే ఫిబ్రవరిలో ఆసియా ఒలింపిక్స్ క్వాలిఫయర్ పోటీలు చైనాలో జరుగనున్నాయి. ఈ ఈవెంట్‌కు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పతకాలు గెలిచిన విజేతల్ని బీఎఫ్‌ఐ ఎంపిక చేసింది. అక్కడ కాంస్యాలు నెగ్గిన మేరీకోమ్ (51 కేజీలు), లవ్లీనా (69 కేజీలు) సెలక్షన్ ట్రయల్స్‌తో నిమిత్తం లేకుండానే చైనా ఈవెంట్‌కు అర్హత పొందారు. దీంతో 51 కేజీల కేటగిరీలో ఉన్న నిఖత్ సెలక్షన్ బరిలోకి దిగకుండానే బీఎఫ్‌ఐ చేతిలో నాకౌట్ అయ్యింది. బాక్సింగ్ సమాఖ్య నిర్ణయంపై మేరీ సంతోషం వ్యక్తం చేసింది. 'చాలా ఆనందంగా ఉంది. పతక విజేతనైనా నాకు నేరుగా ఒలింపిక్స్ క్వాలిఫయింగ్‌లో పాల్గొనే అవకాశమిచ్చిన బీఎఫ్‌ఐకి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నా' అని పేర్కొంది.

## ఓటమితో ముగించిన ఆంధ్ర

**బెంగళూరు:** విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్ర జట్టు కథ ముగిసింది. కేరళతో బుధవారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర ఆరు వికెట్ల తేడాతో ఓడిపోయింది. ఈ టోర్నీలో మొత్తం ఎనిమిది మ్యాచ్‌లు ఆడిన ఆంధ్ర కేవలం ఒక మ్యాచ్‌లో గెలిచింది. ఆరు మ్యాచ్‌ల్లో ఓడిపోగా... మరో మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. కేరళతో మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆంధ్ర 50 ఓవర్లలో 6 వికెట్లకు 230 పరుగులు చేసింది. కెప్టెన్ రికీ భుయ్ (58; 6 ఫోర్లు, సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కరణ్ షిండే (38), అశ్విన్ హెబర్ (31), బోడపాటి సుమంత్ (31 నాటౌట్), నరేన్ రెడ్డి (30) రాణించారు. అనంతరం కేరళ 39.4 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 233 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. విష్ణు వినోద్ (89 బంతుల్లో 139; 13 ఫోర్లు, 9 సిక్స్‌లు) సూపర్ సెంచరీతో కేరళ విజయంలో ముఖ్యపాత్ర పోషించాడు.



యూరోపియన్ ఫుట్‌బాల్ లీగ్స్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచి ఆరోసారి 'గోల్డెన్ షూ' అందుకున్న బార్సిలోనా జట్టు కెప్టెన్ లియోనెల్ మెస్సీ. ఈ సీజన్‌లో ఈ అర్జెంటీనా స్టార్ మొత్తం 36 గోల్స్ చేశాడు. బుధవారం జరిగిన కార్యక్రమంలో తన భార్య, పిల్లలతో కలిసి మెస్సీ ఈ అవార్డును స్వీకరించాడు.

epaper.sakshi.com

# సాక్షి బిజినెస్

గురువారం
17-10-2019

WWW.SAKSHIBUSINESS.COM


## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 93 ▲ | 36 ▲ |
| 38,599 | 11,464 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు రాత్రి 11.30గం॥లకు)

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 8,110 | ▼ | 38 |
| డోజోన్స్ | 27,004 | ▼ | 21 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100శ | 7,168 | ▼ | 44 |
| డాక్స్ | 12,670 | ▲ | 40 |
| షాంఘై | 2,979 | ▼ | 12 |
| నికాయ్ | 22,472 | ▲ | 266 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | | • కొనుగోలు | • అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 70.87 | 72.51 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 89.86 | 93.03 |
| € | యూరో | ఎస్‌బీఐ | 77.64 | 80.52 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 64.75 | 67.17 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.23 | 49.42 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 51.36 | 53.14 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.26 | 19.86 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.99 | 19.99 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.44 | 10.84 |

## 57 శాతం పెరిగిన ఫెడరల్ బ్యాంక్ లాభం




**న్యూఢిల్లీ:** ప్రైవేట్ రంగ ఫెడరల్ బ్యాంక్ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసిక కాలంలో 57 శాతం పెరిగింది. గత క్యూ2లో రూ.266 కోట్లుగా ఉన్న నికర లాభం(స్టాండ్ అలోన్) ఈ క్యూ2లో రూ.417 కోట్లకు పెరిగిందని ఫెడరల్ బ్యాంక్ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.3,088 కోట్ల నుంచి రూ.3,675 కోట్లకు పెరిగిందని పేర్కొంది. వ్యయాలు రూ.2,390 కోట్ల నుంచి 24 శాతం పెరిగి రూ.2,956 కోట్లకు చేరాయని వివరించింది. రూ.1,124 కోట్ల నికర వడ్డీ ఆదాయం ఆర్జించామని తెలిపింది. గత క్యూ2లో 3.11%గా ఉన్న స్థూల మొండి బకాయిలు ఈ క్యూ2లో 3.07%కి తగ్గాయని ఫెడరల్ బ్యాంక్ తెలిపింది. నికర మొండి బకాయిలు 1.78% నుంచి 1.59 శాతానికి తగ్గాయని పేర్కొంది. మొండి బకాయిలు తగ్గడంతో కేటాయింపులు కూడా తగ్గాయి. గత క్యూ2లో రూ.289 కోట్లుగా ఉన్న కేటాయింపులు ఈ క్యూ2లో రూ.252 కోట్లకు తగ్గాయని ఫెడరల్ బ్యాంక్ పేర్కొంది.

## మైండ్ ట్రీ లాభం 35% డౌన్




**న్యూఢిల్లీ:** ఐటీ కంపెనీ మైండ్ ట్రీ సెప్టెంబర్ 30తో ముగిసిన క్వార్టర్‌లో రూ.135 కోట్ల నికర లాభం సాధించింది. అంతకు ముందటి ఏడాది ఇదే క్వార్టర్‌లో సాధించిన నికర లాభం(రూ.206 కోట్లు)తో పోల్చితే 35 శాతం క్షీణించిందని మైండ్‌ట్రీ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.1,755 కోట్ల నుంచి 9 శాతం ఎగసి రూ.1,914 కోట్లకు పెరిగిందని పేర్కొంది. డాలర్ల పరంగా చూస్తే, నికర లాభం 34 శాతం తగ్గి 1.92 కోట్ల డాలర్లకు, ఆదాయం 10 శాతం పెరిగి 27 కోట్ల డాలర్లకు ఎగసిందని వివరించింది. ఎల్ అండ్ టీ కంపెనీ 60.06 శాతం వాటాను చేజిక్కించుకోవడం ద్వారా ఈ ఏడాది జూలైలో మైండ్‌ట్రీ కంపెనీని టేకోవర్ చేసిన విషయం తెలిసిందే.

# చేతక్ మళ్లీ వచ్చేసింది!!

- ఈసారి ఎలక్ట్రిక్ స్కూటర్ రూపంలో
- రూ. 1.50 లక్షల లోపు ధర
- జనవరి నుంచి అమ్మకాలు...

**న్యూఢిల్లీ:** దేశీ ద్విచక్ర వాహన రంగంలో ఒకప్పుడు రారాజుగా వెలిగి, కనుమరుగైన బజాజ్ చేతక్ స్కూటర్ ఈసారి ఎలక్ట్రిక్ వాహనంగా తిరిగొస్తోంది. బజాజ్ ఆటో బుధవారం చేతక్ ఈ–స్కూటర్‌ను ఆవిష్కరించింది. కేంద్ర రహదారి రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ దీన్ని ఆవిష్కరించారు. అమ్మకాలు జనవరి నుంచి మొదలవుతాయని బజాజ్ ఆటో ఎండీ రాజీవ్ బజాజ్ తెలిపారు. ముందుగా పుణెలో ఆ తర్వాత బెంగళూరులో విక్రయాలు ప్రారంభిస్తామని, స్పందనను బట్టి మిగతా ప్రాంతాలకు విస్తరిస్తామన్నారు. భవిష్యత్‌లో ఉండే అవకాశాలను గుర్తించే.. ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్లో ముందుగా కాలు మోపుతున్నామని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్ అంతా ఎలక్ట్రిక్ వాహనాలు, బయో ఇంధనాలు వంటి పర్యావరణ అనుకూల టెక్నాలజీలదేనని గడ్కరీ తెలిపారు. నీతి అయోగ్ సీఈవో అమితాబ్ కాంత్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**95 కి.మీ. దాకా మైలేజీ..**

అధికారికంగా చేతక్ ఈ–స్కూటర్ రేటు ఎంతన్నది వెల్లడించనప్పటికీ, రూ. 1.5 లక్షల లోపే ఉంటుందని కంపెనీ వెల్లడించింది. దీన్ని ఒక్కసారి 5 గంటల పాటు చార్జింగ్ చేస్తే.. ఎకానమీ మోడ్‌లో 95 కి.మీ., స్పోర్ట్స్ మోడ్‌లో 85 కి.మీ. మైలేజీ ఇస్తుందని పేర్కొంది. తమ ప్రొ–బైకింగ్ డీలర్‌షిప్స్ ద్వారా వీటిని విక్రయించనున్నట్లు రాజీవ్ బజాజ్ చెప్పారు. మహారాష్ట్రలోని చకన్ ప్లాంటులో తయారు చేసే చేతక్ ఈ–స్కూటర్స్‌ను వచ్చే ఏడాది నుంచి యూరప్‌లోని వివిధ దేశాలకు కూడా ఎగుమతి చేయనున్నట్లు తెలిపారు.

చేతక్ ఈ–స్కూటర్‌ను ఆవిష్కరిస్తున్న రవాణా శాఖ మంత్రి గడ్కరీ, రాజీవ్ బజాజ్



**హమారా బజాజ్...:** 1970ల తొలినాళ్లలో ప్రవేశపెట్టిన చేతక్ స్కూటర్ దేశీ ద్విచక్ర వాహన రంగంలో ఓ సంచలనం సృష్టించింది. మహాయోధుడు రాణా ప్రతాప్ సింగ్‌కి చెందిన వేగవంతమైన అశ్వం 'చేతక్' పేరుతో ప్రవేశపెట్టిన ఈ స్కూటర్లు.. అప్పట్లోనే కోటి పైగా అమ్ముడయ్యాయి. బుక్ చేసుకుంటే ఏళ్ల తరబడి వెయిటింగ్ లిస్టు ఉండేది. 2005 ప్రాంతంలో స్కూటర్స్ తయారీని బజాజ్ నిలిపివేసి పూర్తిగా మోటార్‌సైకిల్స్‌పై దృష్టిపెట్టింది.

## ఎలక్ట్రిక్ టూ వీలర్స్‌కు సబ్సిడీ..

ఫాస్టర్ అడాప్షన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ ఆఫ్ ఎలక్ట్రిక్, హైబ్రిడ్ వెహికిల్స్ (ఫేమ్) పథకం కింద ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుపై కస్టమర్లు సబ్సిడీ అందుకోవచ్చు. ద్విచక్ర వాహనాలకు అంతకు ముందు మోటార్‌నుబట్టి ఈ సబ్సిడీ నిర్ణయించేవారు. ప్రస్తుతం టెక్నాలజీని బట్టి సబ్సిడీ ఇస్తున్నారు. ఒక కిలోవాట్ అవర్‌కు రూ.10,000 చొప్పున గరిష్టంగా రూ.30,000 వరకు సబ్సిడీ ఉందని అవేరా న్యూ అండ్ రెనివేబుల్ ఎనర్జీ మోటోకార్ప్ టెక్ ఫౌండర్ వెంకట రమణ తెలిపారు. ఉదాహరణకు 3 కిలోవాట్ అవర్ సామర్థ్యం గల వాహనం ఖరీదు రూ.80,000 ఉందనుకుందాం. వినియోగదారు షోరూంలో రూ.50,000 చెల్లిస్తే చాలు. తయారీదారు ప్రతి 3 నెలలకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెవీ ఇండస్ట్రీకి వాహనాల అమ్మకాల వివరాలను అందజేయాల్సి ఉంటుంది. మోటారు వాహన చట్టం కింద నమోదయ్యే ఎలక్ట్రిక్ స్కూటర్లకే ఈ సబ్సిడీ లభిస్తుంది. ఇందుకోసం తయారీదారు స్కూటర్ విభాగంలో సంబంధిత ఎలక్ట్రిక్ వాహనానికి ప్రభుత్వం నుంచి అనుమతి తెచ్చుకోవాల్సి ఉంటుంది. గంటకు 25 కిలోమీటర్లపైగా వేగం, 250 వాట్స్ కంటే అధిక సామర్థ్యం ఉన్న మోటార్ ఉంటేనే స్కూటర్‌గా పరిగణిస్తారు.

# అంతా వాళ్లే చేశారు..!

- మన్మోహన్, రాజన్ హయాంలోనే ప్రభుత్వరంగ బ్యాంకులకు దుర్గతి
- వాటిని బాగుచేయడమే నా ప్రాథమిక కర్తవ్యం
- ఆర్థిక మంత్రినిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ:** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, మాజీ గవర్నర్ రఘురామ్‌రాజన్ హయాంలోనే ప్రభుత్వ రంగ బ్యాంకులు దుర్భర పరిస్థితులను చవిచూశాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యానించారు. దెబ్బతిన్న ప్రభుత్వరంగ బ్యాంకులను బాగు చేయడమే తన ప్రాథమిక కర్తవ్యంగా భావిస్తున్నానని ఆమె పేర్కొన్నారు. అమెరికాలోని ప్రఖ్యాత కొలంబియా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ అండ్ పబ్లిక్ అఫైర్స్‌లో.. 'భారత ఆర్థిక వ్యవస్థ: సవాళ్లు, అవకాశాలు' అనే అంశంపై ఆమె మాట్లాడారు. యూపీఏ–2 పాలనలో 2013 సెప్టెంబర్ 4 నుంచి 2016 సెప్టెంబర్ 4 వరకు ఆర్‌బీఐ గవర్నర్‌గా, 2012 ఆగస్టు 10 నుంచి 2013లో ఆర్‌బీఐ గవర్నర్ అయ్యే నాటి వరకు కేంద్ర ప్రభుత్వానికి ముఖ్య ఆర్థిక సలహాదారుగా రఘురామ్‌రాజన్ పనిచేశారు. గత ప్రభుత్వ అసమర్థ విధానాలను మంత్రి సీతారామన్ తన ప్రసంగంలో ఎండగట్టారు. ''ప్రభుత్వరంగ బ్యాంకులకు ప్రాణవాయువు అందించడమే భారత ఆర్థిక మంత్రి ప్రాథమిక విధి. ఈ ప్రాణవాయువు అన్నది రాత్రికి రాత్రి రాదు'' అని మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఇటీవల బ్రౌన్ యూనివర్సిటీలో రాజన్ మాట్లాడుతూ.. భారత ప్రభుత్వం ఆర్థిక రంగానికి సంబంధించి చెప్పుకోతగ్గది ఏదీ చేయలేదంటూ విమర్శించారు. ప్రభుత్వం పూర్తిగా కేంద్రీకృతమైందని, ఆర్థిక వృద్ధికి సంబంధించి నాయకత్వానికి స్పష్టమైన విధానం లోపించిందన్నారు. ఈ వ్యాఖ్యలపై ఎదురైన ప్రశ్నకు సీతారామన్ గట్టిగానే బదులిచ్చారు.



కొలంబియా వర్సిటీలో మాట్లాడుతున్న సీతారామన్

**ఫోన్ కాల్స్‌తో రుణాలు**

''ఆర్‌బీఐ గవర్నర్‌గా రాజన్ హయాంలో సన్నిహిత నేతల నుంచి వచ్చిన ఫోన్‌కాల్స్‌తో రుణాలు మంజూరు చేశారు. దీంతో ప్రభుత్వరంగ బ్యాంకులు నాటి ఊబి నుంచి బయటకు వచ్చేందుకు నేటికీ ప్రభుత్వం అందించే నిధులపై ఆధార పడుతున్నాయి. ఎంతో ప్రజాస్వామ్యంతో కూడిన నాయకత్వం (మన్మోహన్‌సింగ్) కారణంగా భారీ స్థాయి అవినీతి చోటుచేసుకుంది. భారత్ వంటి వైవిధ్య దేశానికి గట్టి నాయకత్వం కావాలి. మరీ ప్రజాస్వామ్యంతో కూడిన నాయకత్వం అంటే నాకు భయమే. ఎందుకంటే అవినీతి తాలూకూ దుర్గంధాన్ని అది విడిచి వెళ్లింది. దాన్ని ఈ రోజుకీ శుద్ధి చేస్తున్నాం'' అంటూ యూపీఏ పాలనను నిర్మలా సీతారామన్ విమర్శించారు. రాజన్‌ను తాను ఎగతాళి చేయడం లేదని, విద్యావంతుడైన ఆయన్ను గౌరవిస్తానంటూనే, వాస్తవాలను తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. బ్యాంకుల ఆస్తుల నాణ్యతను సమీక్షించినందుకు రాజన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, బ్యాంకులు నేడు ఏ స్థితిలో ఉన్నాయో ప్రజలకు తెలుసునని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం ఇటీవలే ప్రభుత్వరంగ బ్యాంకులకు రూ.70వేల కోట్ల సాయాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది మార్చి నాటికి ప్రభుత్వరంగ బ్యాంకుల ఎన్‌పీఏలు రూ.8,06,412 కోట్లుగా ఉన్నాయి. గత మార్చి నాటికి ఉన్న రూ.8,95,601 కోట్లతో పోలిస్తే రూ.89,189 కోట్లు తగ్గాయి.

## అనుకోకుండా.. ఇన్వెస్ట్ చేశా!

**స్టార్టప్‌లపై రతన్ టాటా**



**ముంబై:** కొన్నాళ్లుగా పలు స్టార్టప్‌లలో పెట్టుబడులతో వార్తల్లో నిలుస్తున్న పారిశ్రామిక దిగ్గజం, టాటా గ్రూప్ గౌరవ చైర్మన్ రతన్ టాటా తన ఇన్వెస్ట్‌మెంట్స్‌పై పెదవి విప్పారు. అనుకోకుండానే తాను స్టార్టప్‌లలో ఇన్వెస్ట్ చేయడం మొదలుపెట్టినట్లు వెల్లడించారు. 'నేను కొంత అనుకోకుండానే స్టార్టప్ ఇన్వెస్టరుగా మారానని చెప్పవచ్చు. టాటా గ్రూప్‌లో కీలక హోదాలో ఉన్నప్పుడు స్టార్టప్ సంస్థలు ఆసక్తికరంగానే అనిపించినప్పటికీ.. వాటిని కాస్త అంటరానివిగానే చూసేవాణ్ని. ఎందుకంటే ఏదో ఒకటి, ఎక్కడో ఒక చోట టాటా గ్రూప్‌నకు ప్రయోజనాల వైరుధ్యం ఉండేది. కానీ నేను రిటైరయిన తర్వాత స్వేచ్ఛ లభించడం వల్ల ఆసక్తికరంగా అనిపించిన సంస్థల్లో నా సొంత డబ్బును కాస్త కాస్తగా ఇన్వెస్ట్ చేయడం ప్రారంభించాను. అలా అంతకు ముందుతో పోలిస్తే నేను మరికాస్త ఎక్కువ రిస్కులు తీసుకున్నాను. మరో విషయం.. పెట్టుబడులు పెడుతున్నా కదా అని నా దగ్గర బోలెడంత డబ్బు ఉందని అనుకోవద్దు' అని రతన్ టాటా చెప్పుకొచ్చారు. స్టార్టప్స్ ప్రమోటర్లలో కసి, వినూత్న ఐడియాలు, అవి అందించే పరిష్కారమార్గాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఇన్వెస్ట్ చేస్తానని రతన్ టాటా చెప్పారు. ఓలా, పేటీఎం మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్, క్యూర్‌ఫిట్, కార్‌దేఖో, అర్బన్‌ల్యాడర్, లెన్స్‌కార్ట్ వంటి స్టార్టప్స్‌లో రతన్ టాటా వ్యక్తిగత హోదాలో పెట్టుబడులు పెట్టారు.

## 'వరల్డ్ స్టీల్' వైస్ చైర్మన్‌గా సజ్జన్ జిందాల్



**న్యూఢిల్లీ:** ప్రపంచ ఉక్కు సంఘం (వరల్డ్ స్టీల్ అసోసియేషన్) వైస్ చైర్మన్‌గా జేఎస్‌డబ్ల్యూ స్టీల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జన్ జిందాల్ ఎన్నికయ్యారు. ఈయన పదవీకాలం ఇక్కడ నుంచి ఏడాది పాటు కొనసాగుతుంది. ఇక మెక్సికోలోని మాంటెర్రీలో జరిగిన వరల్డ్ స్టీల్ జనరల్ అసెంబ్లీలో ఈయనతో పాటు టాటా స్టీల్ సీఈఓ, ఎండీ టీ.వీ నరేంద్రన్.. ఆర్సెలర్ మిట్టల్ చీఫ్ ఎల్.ఎన్ మిట్టల్ సభ్యులుగా నియమితులయ్యారు.

## డిజిటల్ లావాదేవీల్లో హైదరాబాద్ సెకండ్

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** డిజిటల్ లావాదేవీల్లో బెంగళూరు తర్వాత హైదరాబాద్ రెండో స్థానంలో ఉందని, రాష్ట్రాల వారీగా జాబితా చూస్తే కర్నాటక, మహారాష్ట్ర, ఢిల్లీ, తమిళనాడు తర్వాత తెలంగాణ ఐదో స్థానంలో ఉందని రేజర్‌పే సీటీఓ అండ్ కో–ఫౌండర్ శశాంక్ కుమార్ తెలిపారు. తెలంగాణలో హైదరాబాద్ తర్వాత సికింద్రాబాద్, ఖమ్మం, కరీంనగర్, వరంగల్, పాల్వంచ నుంచి లావాదేవీలు ఎక్కువగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. బుధవారమిక్కడ రేజర్‌పే మూడవ ఎడిషన్ నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత త్రైమాసికంతో పోలిస్తే హైదరాబాద్‌లో ఈ త్రైమాసికంలో కార్డుల వినియోగం 11 శాతం తగ్గిందని, యూపీఐ లావాదేవీలు 58% వృద్ధి చెందాయని తెలిపారు. ఆన్‌లైన్ లావాదేవీల్లో ఫైనాన్షియల్ సర్వీసెస్, ఫుడ్ అండ్ బేవరేజెస్, యుటిలిటీస్ విభాగాలు 51% వాటాను కలిగి ఉందని పేర్కొన్నారు. జొమోటా, బుక్‌మై షో, ఎయిర్‌టెల్ వంటి 6 లక్షల వ్యాపారస్తులు తమ సేవలను వినియోగించుకుంటున్నారని, 2020 నాటికి 10 లక్షలను లక్ష్యించామని తెలిపారు. బ్యాంక్‌లు, ఫిన్‌టెక్ కంపెనీల మధ్య తగినంత సహకారం లేదని, డిజిటల్ పేమెంట్స్‌లో రాయితీలు పెంచాల్సి ఉందన్నారు. ఇప్పటివరకు రేజర్‌పేలో టైగర్ గ్లోబల్, మ్యాట్రిక్స్ పార్టనర్స్, సికోయా ఇండియా వంటి ఇన్వెస్టర్లు 106.5 మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టాయి.




విలేకరుల సమావేశంలో శశాంక్

## మార్కెట్‌లోకి హావెల్స్ స్మార్ట్ స్విచ్ గేర్స్




స్టడెక్స్ శ్రేణితో మహేందర్, సౌరభ్ గోయల్(కుడి)

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఎలక్ట్రికల్ ఉత్పత్తుల తయారీ సంస్థ హావెల్స్ ఇండియా స్టడెక్స్ పేరుతో స్మార్ట్ స్విచ్ గేర్స్‌ను ప్రవేశపెట్టింది. మినియేచర్ సర్క్యూట్ బ్రేకర్ (ఎంసీబీ), డిస్ట్రిబ్యూషన్ బోర్డ్ సాంకేతికంగా అత్యాధునికమైనవని హావెల్స్ ప్రెసిడెంట్ సౌరభ్ గోయల్ తెలిపారు. ఏపీ, తెలంగాణ బిజినెస్ హెడ్ మహేందర్ వల్లకాటితో కలిసి బుధవారమిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. 'వీటితో నిర్వహణ సమస్యలు ఉండవు. గృహ, కార్యాలయాల్లో పెరుగుతున్న అవసరాలకు తగ్గట్టుగా రూపొందించాం. స్టడెక్స్‌లో 160 రకాల ఉత్పాదనలు ఉన్నాయి. బిల్డింగ్స్ విభాగంలో స్విచ్‌లు, స్విచ్ గేర్ల మార్కెట్ భారత్‌లో రూ.8,000 కోట్లుంది. ఇందులో హావెల్స్ వాటా 25 శాతం. జూన్ త్రైమాసికంలో 15 శాతం వృద్ధి సాధించాం. సెప్టెంబరు క్వార్టరులోనూ మెరుగైన వృద్ధి ఆశిస్తున్నాం' అని వివరించారు.

## పెయింట్స్ విభాగంలోకి జేఎస్‌డబ్ల్యూ

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** వ్యాపార దిగ్గజం జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ పెయింట్స్ విభాగంలోకి ప్రవేశించింది. మహారాష్ట్రలో కాయిల్ కోటింగ్స్ ప్లాంటు, కర్ణాటకలో వాటర్ బేస్డ్ డెకొరేటివ్ పెయింట్స్ యూనిట్ నెలకొల్పింది. వీటి కోసం రూ.600 కోట్లు ఖర్చు చేస్తోంది. రెండు కేంద్రాల వార్షిక సామర్థ్యం 12.5 కోట్ల లీటర్లు. ముందుగా దక్షిణ, పశ్చిమ భారత్‌లో విస్తరిస్తామని జేఎస్‌డబ్ల్యూ పెయింట్స్ జేఎండీ ఎ.ఎస్.సుందరేశన్ బుధవారమిక్కడ మీడియాకు తెలిపారు. '2022 నాటికి దేశవ్యాప్తంగా అడుగు పెడతాం. అప్పటికి పూర్తి సామర్థ్యానికి చేరగలం. మూడేళ్లలో వార్షిక టర్నోవర్ రూ.2,000 కోట్లు ఆశిస్తున్నాం. 5% మార్కెట్ వాటా దక్కించుకుంటాం. అయిదేళ్లలో 10% వాటా లక్ష్యం. డెకొరేటివ్ పెయింట్స్ పూర్తిగా వాటర్ బేస్డ్ కలర్స్ ఉంటాయి. ఏ రంగు అయినా ఒకే ధర ఉంటుంది' అని వివరించారు.




పెయింట్స్ శ్రేణితో సుందరేశన్

## మైక్రోసాఫ్ట్‌తో ఎన్‌షూరిటీ జట్టు..

**పాస్‌వర్డ్ రహిత సెక్యూరిటీ ఫీచర్‌కు రూపకల్పన**

ensurity

**సాక్షి, సిటీబ్యూరో:** హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగించే సైబర్ సెక్యూరిటీ సంస్థ ఎన్‌షూరిటీ టెక్నాలజీస్ తాజాగా మైక్రోసాఫ్ట్ ఇంటెలిజెంట్ సెక్యూరిటీ అసోసియేషన్‌లో (ఎంఐఎస్‌ఏ) భాగస్వామిగా చేరింది. తాము రూపొందించిన సెక్యూరిటీ ఫీచర్‌తో.. పాస్‌వర్డ్ అవసరం లేకుండా మైక్రోసాఫ్ట్ అజూర్ యాక్టివ్ డైరెక్టరీని యాక్సెస్ చేసుకునేందుకు వీలవుతుందని ఈ సందర్భంగా సంస్థ సీవోవో అమిత్ మాథుర్ తెలిపారు. ఇది విండోస్ హెలో, మైక్రోసాఫ్ట్ ఆథెంటికేటర్ యాప్‌లకు కూడా ఉపయోగపడుతుందని ఆయన వివరించారు.

## మార్కెట్లోకి 'రెడ్‌మి నోట్ 8'

- ధరల శ్రేణి రూ. 9,999–17,999
- ఇన్ బిల్ట్ అమెజాన్ అలెక్సాతో విడుదల



**సాక్షి, న్యూఢిల్లీ:** చైనాకు చెందిన మొబైల్ హ్యాండ్‌సెట్స్ తయారీ కంపెనీ 'షావోమీ' తాజాగా 'రెడ్‌మి నోట్ 8, 8 ప్రో' పేరిట రెండు సరికొత్త స్మార్ట్‌ఫోన్లను భారత మార్కెట్లో విడుదలచేసింది. ఇన్ బిల్ట్ అమెజాన్ అలెక్సాతో విడుదలైన ఈ స్మార్ట్‌ఫోన్లు.. గూగుల్ అసిస్టెన్స్, అలెక్సాతో పనిచేస్తుందని కంపెనీ వివరించింది. ఒకేసారి రెండు ఫీచర్లతో అందుబాటులోకి వచ్చిన తొలి మొబైల్స్ ఇవే కాగా, వీటిలో రెడ్‌మి నోట్ 8 మొత్తం రెండు వేరియంట్లలో అందుబాటులోకి వచ్చింది. 6.39 అంగుళాల డిస్‌ప్లే కలిగిన ఈ మోడల్‌లో 6జీబీ/64జీబీ ధర రూ. 9,999.. 6జీబీ/128జీబీ ధర రూ.12,999గా నిర్ణయించింది. మరో మోడల్ 8 ప్రో మూడు వేరియంట్లలో విడుదలైంది. 6.53 అంగుళాల డిస్‌ప్లే కలిగిన ఈ మోడల్ ధరల శ్రేణి రూ. 14,999 నుంచి రూ. 17,999గా ఉన్నాయి. ప్రపంచంలోనే తొలిసారిగా 64 మెగాపిక్సెల్ కెమెరా సెన్సార్, హెలియో జీ90టీ చిప్‌సెట్‌తో విడుదలైన అధునాతన స్మార్ట్‌ఫోన్లు ఇవేనని సంస్థ ఇండియా హెడ్ మనుకుమార్ జైన్ అన్నారు. అక్టోబరు 21 నుంచి కొత్త మోడళ్లు వినియోగదారులకు లభ్యంకానున్నాయని వెల్లడించారు.

## బిగ్ 'సి' దసరావళి తొలి డ్రా

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** మల్టీ బ్రాండ్ మొబైల్స్ రిటైల్ చైన్ బిగ్ 'సి' దసరావళి తొలి లక్కీ డ్రా విజేతలను ప్రకటించింది. సంస్థ ఫౌండర్ ఎం.బాలు చౌదరి, డైరెక్టర్లు స్వప్న కుమార్, బాలాజీ రెడ్డి ఈ వివరాలను బుధవారం వెల్లడించారు. మొత్తం 20 మందిని లక్కీ డ్రాలో ఎంపిక చేశారు. వీరిలో 10 మందికి మారుతీ ఆల్టో 800 కార్లు, 10 మందికి బజాజ్ ప్లాటినా బైక్‌లను బహుమతిగా అందిస్తారు. అక్టోబరు 29 వరకు ఉండే ఈ ఆఫర్ కింద మొత్తం 30 మారుతి ఆల్టో కార్లు, 30 బజాజ్ ప్లాటినా బైక్‌లను కస్టమర్లు గెలుచుకోవచ్చు. అలాగే 10% హెచ్‌డీఎఫ్‌సీ క్యాష్ బ్యాక్, సులభ వాయిదాల్లో మొబైల్ కొన్నవారికి ఒక ఈఎంఐ ఉచితం, 30% పేటీఎం క్యాష్‌బ్యాక్ అందుకోవచ్చు. ప్రతి మొబైల్ కొనుగోలుపై కచ్చితమైన బహుమతి ఉంది.



విజేతలను ప్రకటిస్తున్న స్వప్న కుమార్, బాలు చౌదరి, బాలాజీ రెడ్డి (ఎడమ నుంచి)

## ద్రవ్యలోటును అదుపులో ఉంచాలి!

**ఐఎంఎఫ్ చీఫ్ ఎకనమిస్ట్ గీతా గోపీనాథ్**




**వాషింగ్టన్:** ప్రభుత్వ ఆదాయాలు–వ్యయాలకు సంబంధించి నికర వ్యత్యాసం ద్రవ్యలోటును భారత్ అదుపులో ఉంచుకోవాల్సిన అవసరం ఉందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ చీఫ్ ఎకనమిస్ట్ గీతా గోపీనాథ్ సూచించారు. అయితే దేశ ఆదాయ అంచనాలు కొంత సానుకూలంగానే ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు. 2018లో భారత్ వృద్ధి రేటు 6.8 శాతం అయితే, 2019లో 6.1%గానే ఉంటుందని, 2020లో 7 శాతానికి పెరుగుతుందని ఐఎంఎఫ్ మంగళవారం వెలువరించిన తన అవుట్‌లుక్‌లో పేర్కొంది. ఈ నేపథ్యంలో గోపీనాథ్ విలేకరులతో మాట్లాడారు. నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ విభాగం, వినియోగ, లఘు చిన్న మధ్య తరహా పరిశ్రమల రుణాల వంటి అంశాల్లో ఒడిదుడుకులు, సవాళ్లను భారత్ ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంక్ వార్షిక సమావేశాల నేపథ్యంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.

## ఫోన్‌తోనూ ఎన్‌ఎఫ్‌సీ చెల్లింపులు: ఎస్‌బీఐ కార్డ్




**న్యూఢిల్లీ:** పాయింట్ ఆఫ్ సేల్స్ (పీవోఎస్) టెర్మినల్స్‌లో మొబైల్ ఫోన్ ద్వారా సులభతరంగా చెల్లింపులు చేసే సదుపాయాన్ని ఎస్‌బీఐ కార్డ్ అందుబాటులోకి తెచ్చింది. నియర్ ఫీల్డ్ కమ్యూనికేషన్ (ఎన్‌ఎఫ్‌సీ) టెక్నాలజీని ఉపయోగించే ఈ విధానంలో.. పీవోఎస్ మెషీన్‌పై మొబైల్ ఫోన్‌ను ఒకసారి తాకిస్తే చాలు చెల్లింపు ప్రక్రియ పూర్తి చేయొచ్చని సంస్థ తెలిపింది. ప్రత్యేకంగా క్రెడిట్ కార్డు వెంట ఉండక్కర్లేదని, పిన్ నంబరు బాదరబందీ ఉండదని పేర్కొంది.

## ఎక్సైడ్ నుంచి ఈ-రిక్షా 'నియో'



**కోల్‌కతా:** వాహనాలకు అవసరమైన బ్యాటరీలను ఉత్పత్తి చేసే ఎక్సైడ్ ఇండస్ట్రీస్.. 'ఎక్సైడ్ నియో' పేరుతో తొలి బ్రాండెడ్ ఎలక్ట్రిక్ రిక్షాను బుధవారం ఆవిష్కరించింది. రియర్ వ్యూ కెమెరా, ఎల్‌సీడీ ఇన్‌స్ట్రుమెంటేషన్ ప్యానెల్, ఏబీఎస్ రూఫింగ్, అధిక నాణ్యత గల ఫ్రంట్ ప్యానెల్, మెరుగైన భద్రతతో ఈ అధునాతన రిక్షా అందుబాటులోకి రానుందని కంపెనీ ఎండీ అండ్ సీఈఓ గౌతమ్ ఛటర్జీ అన్నారు. ఈ ఏడాది డిసెంబర్ నుంచి లిథియం–అయాన్ బ్యాటరీల తయారీని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు.

## నాలుగో రోజూ లాభాలే...

- హెచ్చుతగ్గుల్లో సూచీలు
- సెన్సెక్స్ 93 పాయింట్లు ప్లస్...

స్టాక్ మార్కెట్ లాభాలు వరుసగా నాలుగో ట్రేడింగ్ సెషన్‌లోనూ కొనసాగాయి. ఆర్థిక, ఇంధన, ఐటీ రంగ షేర్ల జోరుతో సెన్సెక్స్, నిఫ్టీలు బుధవారం లాభాల్లో ముగిశాయి. అయితే ట్రేడింగ్ ఆద్యంతం సెన్సెక్స్, నిఫ్టీలు లాభ, నష్టాల మధ్య దోబూచులాడాయి. రోజంతా 249 పాయింట్ల రేంజ్‌లో కదలాడిన సెన్సెక్స్ చివరకు 93 పాయింట్ల లాభంతో 38,599 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 36 పాయింట్లు పెరిగి 11,464 పాయింట్ల వద్దకు చేరింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 17 పైసలు పుంజుకోవడం కలిసివచ్చింది.

**249 పాయింట్ల రేంజ్‌లో సెన్సెక్స్...**

ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగానే ఉన్నప్పటికీ, విప్రో, ఏసీసీ తదితర కంపెనీల క్యూ2 ఫలితాలు పటిష్టంగా ఉండటంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలపడింది. ప్రపంచ మార్కెట్లు ఫ్లాట్‌గా ఉన్నా, మన మార్కెట్ వరుసగా నాలుగో రోజు లాభపడిందని శాంక్టమ్ వెల్త్ మేనేజ్‌మెంట్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ సునీల్ శర్మ తెలిపారు. కంపెనీల ఫలితాల సీజన్ అంచనాల కంటే మెరుగ్గానే ఉందని అంతేకాకుండా భవిష్యత్తు అంచనాలపై కంపెనీల యాజమాన్యాలు ఆశావహ ప్రకటనలు చేయడం సానుకూల ప్రభావం చూపుతోందని పేర్కొన్నారు.



**20,000 కోట్ల డాలర్ల కంపెనీగా రిలయన్స్!**

రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు 20,000 కోట్ల డాలర్ల మార్కెట్ క్యాప్ గల తొలి కంపెనీగా అవతరించే సత్తా ఉందని బ్యాంక్ ఆఫ్ అమెరికా మెరిల్ లించ్ తెలిపింది. ప్రస్తుతం 12,200 కోట్ల డాలర్ల మార్కెట్ క్యాప్ గల ఈ కంపెనీ రెండేళ్లలో ఈ ఘనత సాధించగలదని ఈ సంస్థ అంచనా వేస్తోంది. మైక్రోసాఫ్ట్ భాగస్వామ్యంతో ఎస్‌ఎమ్‌ఈ ఎంటర్‌ప్రైజ్ స్పేస్‌లోకి ప్రవేశించడం, జియో ఫైబర్ బిజినెస్.. తదితర అంశాలతో రిలయన్స్ ఈ ఘనత సాధించనున్నదని పేర్కొంది.

## బోర్డ్ సమావేశాలు



జీ ఎంటర్‌టైన్మెంట్ ఎంటర్‌ప్రైజెస్, ఎల్‌అండ్ టీ ఇన్ఫోటెక్, టీవీఎస్ మోటార్, పీవీఆర్, చెన్నై పెట్రోలియమ్ కార్పొ, దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ (డీహెచ్‌ఎఫ్‌ఎల్), సౌత్ ఇండియన్ బ్యాంక్, సైయంట్

## బులియన్ రూ.లలో

| | | | |
|---|---|---|---|
| **హైదరాబాద్** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,440 | | |
| బంగారం (22 క్యారెట్లు) | 36,610 | | |
| వెండి (కిలో) | 48,700 | | |
| **ప్రొద్దుటూరు** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,100 | | 0 |
| బంగారం (22 క్యారెట్లు) | 35,320 | ▲ | 80 |
| వెండి (కిలో) | 46,300 | ▼ | 500 |
| **విశాఖపట్నం** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,480 | | 0 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,720 | | 0 |
| వెండి (కిలో) | 47,000 | | 0 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,580 | ▼ | 180 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,610 | ▼ | 170 |
| వెండి (కిలో) | 48,300 | | |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

## ముడిచమురు... (బ్యారల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 53.44 (రాత్రి 11.30కు) | $ 52.81 (మంగళవారం ముగింపు) |
| బ్రెంట్ | 59.45 (రాత్రి 11.30కు) | $ 58.74 (మంగళవారం ముగింపు) |

## కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 17-10-2019

| | |
|---|---|
| విశాఖ | 420-00 |
| చిత్తూరు | 403-00 |
| వరంగల్ | 393-00 |
| చెన్నై | 410-00 |
| ముంబై | 445-00 |
| **16-10-2019 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 390-00 |
| రిటైల్ (ఒక గుడ్డుకు) | 4.50 |
| విజయవాడ | 405-00 |
| నమక్కల్ | 400-00 |
| గోదావరి | 405-00 |
| బెంగళూరు | 415-00 |
| కోల్‌కతా | 435-00 |
| ఢిల్లీ | 419-00 |

# నాసా కొత్త స్పేస్ సూట్

**చంద్రుడి మీద నడిచేందుకు అమెరికా అంతరిక్ష సంస్థ నాసా కొత్త అంతరిక్ష సూటును తయారుచేసింది. ఎక్స్‌ట్రావెహిక్యులర్ మొబిలిటీ యూనిట్ (ఎక్స్‌ఈఎమ్‌యూ)గా పిలిచే దీని ఫొటోను బుధవారం విడుదల చేసింది. ఇది అచ్చం మానవుడి శరీరంలా కనిపించే చిన్న అంతరిక్ష వాహనం.**




'ఆర్టెమిస్ మిషన్'లో భాగంగా నాసా చంద్రుడి దక్షిణ ధృవం మీదకు మనుషులను పంపి అక్కడ 2009లోనే కనుగొన్న నీరు, మంచు జాడలపై పరిశోధనలు కొనసాగిస్తుంది. మానవ మనుగడకు అవకాశాలు వెతకడంతోపాటు, నీరు($H_2O$)లోని హైడ్రోజన్, ఆక్సిజన్‌ను విడదీసి రాకెట్ ఇంధనంగా వాడుకోవడంపైనా పరిశోధనలు సాగించనుంది.

# ఆకలి భారతం

- గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌లో అట్టడుగుకి పడిపోతోన్న భారత్
- ఎత్తుకు తగ్గ బరువులేని పిల్లల శాతం.. ప్రమాదకర స్థాయిలో

**న్యూఢిల్లీ:** భారత్‌లో ఆకలి తీవ్రత పెరిగింది. ప్రపంచ ఆకలి సూచీలో మన దేశం అట్టడుగు స్థానానికి చేరువలో ఉన్నట్టు అంతర్జాతీయ అధ్యయనం తేల్చింది. 2019 గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌లో 117 ప్రపంచ దేశాల్లో మన దేశం 102వ స్థానానికి దిగజారిందని వెల్లడించింది. మన కన్నా పేదరికంలో ఉన్న, అత్యంత వెనుకబడి ఉన్న దేశాలైన నేపాల్, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లకన్నా మనదేశం వెనుకబడి ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఐరిష్ సహాయ సంస్థ కన్సర్న్ వరల్డ్‌వైడ్, జర్మన్ సంస్థ వెల్ట్ హంగర్ హిల్ఫ్ సంయుక్తంగా తయారుచేసిన ఈ నివేదిక భారత్‌లో ఆకలి తీవ్రమైందని హెచ్చరించింది. దేశంలోని ప్రతి ఐదుగురు చిన్నారుల్లో ఒకరు ఎత్తుకు తగ్గ బరువు లేరని, ఇతర దేశాలకంటే అతి తక్కువ బరువుతో ఉన్నారంది. 2008–12 మధ్య బరువు తక్కువ ఉన్న పిల్లల శాతం దేశంలో 16.5 శాతం ఉండగా, 2014–18కి మధ్య 20.8 శాతానికి దిగజారింది. 2030 కల్లా ఆకలిని జయించేవైపు దేశం కృషి చేస్తోందని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఈ గణాంకాలు మరింత ఆందోళన రేకెత్తిస్తున్నాయి. 2000 సంవత్సరంలో మొత్తం 113 దేశాల్లో భారత్ 83 స్థానంలో ఉండగా, 2018లో మొత్తం 119 దేశాల జాబితాలో 103 స్థానంలో ఉంది.

## ప్రపంచ ఆకలి సూచీ 2019

| ర్యాంక్ (అత్యంత పేలవం) | దేశం | స్కోర్ |
|---|---|---|
| 117 | సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ | 53.6 |
| 116 | యెమెన్ | 45.9 |
| 115 | చాద్ | 44.2 |
| 114 | మడగాస్కర్ | 41.5 |
| 113 | జాంబియా | 38.1 |
| 112 | లైబీరియా | 34.9 |
| 111 | హైతీ | 34.7 |
| 110 | తిమోర్-లిస్తే | 34.5 |
| 109 | జింబాబ్వే | 34.4 |
| 108 | అఫ్గానిస్తాన్ | 33.8 |
| 102 | భారత్ | 30.3 |
| 94 | పాకిస్తాన్ | 28.5 |
| 88 | బంగ్లాదేశ్ | 25.8 |
| 73 | నేపాల్ | 20.8 |
| 66 | శ్రీలంక | 17.1 |




## నాలుగు అంశాల ఆధారంగా రేటింగ్...

గ్లోబల్ హంగర్ ఇండెక్స్ కేటగిరీలో మన దేశం 30.3 స్కోరుతో ఉంది. ఈ స్కోరుని నాలుగు సూచీలపై ఆధారపడి నిర్ణయిస్తారు. పౌష్టికాహార లోపం, ఎత్తుకు తగ్గ బరువు లేకుండా ఉండడం, వయసుకి తగ్గ ఎత్తు ఎదగకపోవడం, శిశు మరణాలు.



## నివేదిక ముఖ్యాంశాలు

- దేశంలో కేవలం 6 నుంచి 23 నెలల మధ్య వయసున్న వారిలో 9.6 శాతం మందికి మాత్రమే 'కనీస ఆహార అవసరాలు'తీరుతున్నాయి.
- భారత్‌లో కొత్తగా మరుగుదొడ్ల నిర్మాణం జరుగుతున్నప్పటికీ ఇంకా బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన జరుగుతున్నట్టు ఈ అధ్యయనం గుర్తించింది. ఈ పరిస్థితి ప్రజల ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోందనీ, దానివల్ల పిల్లల్లో ఎదుగుదల లోపాలు తలెత్తుతున్నాయంది.
- బెలారస్, ఉక్రెయిన్, టర్కీ, క్యూబా, కువైట్ సహా మొత్తం 17 దేశాలు ఈ సూచీలో 5 కన్నా తక్కువ ర్యాంకుతో ఉన్నత స్థానంలో ఉన్నాయి.
- నిత్యం ఘర్షణ వాతావరణం ఉండే, తీవ్రమైన వాతావరణ మార్పులతో సతమతమౌతోన్న యెమన్, జిబౌటి దేశాలు సైతం భారత్ కన్నా మెరుగ్గా ఉన్నాయి.
- పొరుగు దేశాలైన నేపాల్(73), శ్రీలంక(66), బంగ్లాదేశ్(88), మయన్మార్(69), పాకిస్తాన్ (94) స్థానంలో ఉండి ఆకలి తీవ్రతను ఎదుర్కొంటున్నాయి.
- చివరకు చైనా (25) సైతం భారత్ కన్నా మెరుగైన స్థానంలో ఉంది.

## క్లుప్తంగా...

### ఇద్దరిని కడతేర్చిన ఉగ్రవాదులు

**శ్రీనగర్:** కశ్మీర్‌లో ఆంక్షల సడలింపుతో ఉగ్రవాదులు రెచ్చిపోతున్నారు. బుధవారం వేర్వేరు చోట్ల జరిగిన రెండు ఘటనల్లో ఉగ్రవాదులు ఓ పండ్ల వ్యాపారి, వలస కార్మికుడిని పొట్టనబెట్టుకున్నారు. సోపియాన్ జిల్లాలో పంజాబ్‌కు చెందిన ఓ యాపిల్ పండ్ల వ్యాపారి చరణ్‌జీత్ సింగ్, మరో వ్యక్తి సంజీవ్ మీద ముగ్గురు నలుగురు ఉగ్రవాదులు బుధవారం కాల్పులు జరిపారు. ఇద్దరినీ పుల్వామా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చరణ్ జీత్ సింగ్ మరణించాడు. ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చి ఇటుకల బట్టీలో పనిచేస్తున్న సేతిసాగర్‌పై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మరోవైపు, కశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లాలో ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి.

### బుద్ధుని జాడలు స్మరిస్తూ..

**న్యూఢిల్లీ:** భారత్, నేపాల్‌లో ఉన్న బుద్ధునికి సంబంధించిన చారిత్రక ప్రదేశాలను సందర్శించేలా భారతీయ రైల్వే మొదటిసారిగా 'బుద్దిస్ట్ సర్క్యూట్'రైలును నడపనుంది. అక్టోబర్ 19 నుంచి 26 వరకు ఈ రైలు ఆయా దివ్యప్రదేశాలను చుడుతూ పరుగులు తీయనుంది. బుద్ధుడు జన్మించిన లుంబిని, అతడు జ్ఞానోదయం పొందిన బోధ్‌గయ, మొదటి ఉపన్యాసం చేసిన సారనాథ్, ఆ మహనీయుడు మోక్షం పొందిన కుషినగర్ తదితర ప్రాంతాలను ఈ ప్యాకేజీలో భాగంగా సందర్శించవచ్చని ఐఆర్‌సీటీసీ తెలిపింది. భారతీయులకు ఏసీ ఫస్ట్ క్లాస్‌కోసం రూ. 1,23,900, ఏసీ టూటైర్‌లో జంటకు 1,01,430 రూపాయలు ఖర్చవుతుంది.

### కారులో శవంతో పోలీస్‌స్టేషన్‌కు..

**శాన్‌ఫ్రాన్సిస్కో:** అమెరికాలో నివసిస్తున్న భారత సంతతి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శంకర్ నాగప్ప హంగుడ్(53) దారుణానికి తెగబడ్డాడు. తన కుటుంబంలోని ఒకరిని హత్య చేసిన అతడు.. మృతదేహాన్ని కారులో తీసుకెళ్లి పోలీసులకు లొంగిపోయాడు. అలాగే మరో ముగ్గురిని సైతం హత్య చేశానని, తన అపార్ట్‌మెంట్‌లో వారి మృతదేహాలు ఉన్నాయని పోలీసులకు తెలిపాడు. అతడు చెప్పిన వివరాల మేరకు అపార్ట్‌మెంట్‌కు వెళ్లి చూడగా మూడు మృతదేహాలు కనిపించాయి. పోలీసులు నాగప్పను అరెస్ట్ చేశారు. హత్య చేసిన తర్వాత నాగప్ప అందులో ఓ మృతదేహంతో తన అపార్ట్‌మెంట్ నుంచి 350 కిలోమీటర్లు కారులో ప్రయాణించి ఉత్తర కాలిఫోర్నియా పోలీస్ స్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడని పేర్కొన్నారు.

# అయోధ్య వాదనలు పూర్తి

- హిందూ, ముస్లిం వర్గాల వాదనలు విన్న సీజేఐ నేతృత్వంలోని రాజ్యాంగ బెంచ్
- తీర్పు రిజర్వ్ లో.. నవంబర్ 17 లోపు ప్రకటించే అవకాశం
- నవంబర్ 17న సీజేఐ పదవీవిరమణ • చివరి రోజు కోర్టు హాల్లో వాడివేడి వాదనలు
- రామజన్మభూమి మ్యాప్‌ను చించేసిన సీనియర్ న్యాయవాది రాజీవ్ ధావన్



**న్యూఢిల్లీ:** వివాదాస్పద అయోధ్యలోని రామజన్మభూమి– బాబ్రీమసీదు స్థల యాజమాన్య హక్కులకు సంబంధించిన కేసు విచారణ సుప్రీం కోర్టులో బుధవారంతో ముగిసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గొగోయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ముందు గత 40 రోజులుగా వరుసగా ఈ కేసులో హిందు, ముస్లిం వర్గాల తరపు లాయర్లు తమ వాదనలు వినిపించారు. 'ఇంక చాలు' అంటూ బుధవారం సాయంత్రం జస్టిస్ గొగొయ్ తుది వాదనలు వినడం ముగించారు. తీర్పును రిజర్వ్‌లో ఉంచారు. అయితే, రాజకీయంగా అత్యంత సున్నితమైన ఈ కేసులో తీర్పును జస్టిస్ గొగొయ్ పదవీ విరమణ చేయనున్న నవంబర్ 17లోపు ప్రకటించే అవకాశముంది. మధ్యవర్తిత్వం ద్వారా సామరస్య పూర్వక పరిష్కారం కనుగొనడంలో హిందూ, ముస్లిం వర్గాలు విఫలమైన నేపథ్యంలో ఈ ఆగస్ట్ 6వ తేదీ నుంచి జస్టిస్ గొగొయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసు విచారణ ప్రారంభించిన విషయం తెలిసిందే. 1950లో ఏర్పడినప్పటి నుంచి సుప్రీంకోర్టు చరిత్రలో ఎక్కువ కాలం కొనసాగిన కేసు విచారణల్లో ఇది రెండోది కావడం విశేషం. మొదటి కేసు 1973 నాటి చరిత్రాత్మక కేశవానంద భారతి కేసు. రాజ్యాంగ మౌలిక స్వరూప నిర్ధారణకు సంబంధించిన ఆ కేసు విచారణ 68 రోజులు కొనసాగింది. ఆధార్ రాజ్యాంగబద్ధతకు సంబంధించిన కేసు విచారణ 38 రోజులు జరిగింది.

**విచారణ సందర్భంగా హైడ్రామా**

విచారణ చివరి రోజు కోర్టులో కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. చివరి రోజు హిందూ, ముస్లిం వర్గాల తరపు న్యాయవాదులు ఆవేశంగా తమ వాదనలు వినిపించారు. హిందూ మహాసభ తరఫు వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ కోర్టుకు అందించిన రామజన్మభూమి మ్యాప్‌ను కోర్టుహాల్లోనే ముస్లింల తరపున వాదించిన సీనియర్ న్యాయవాది రాజీవ్ ధావన్ చించేయడంతో వాతావరణం కొంత సీరియస్‌గా మారింది. బాబ్రీమసీదు గుమ్మటం(1992లో కూల్చివేతకు గురైన డోమ్) కింది భాగమే నిజానికి రాముడి జన్మస్థలం అనే విషయాన్ని నిర్ధారించేందుకు ఒక మ్యాప్‌ను, భారతీయ, విదేశీ రచయితలు రాసిన కొన్ని పుస్తకాలను సాక్ష్యాధారాలుగా అఖిల భారత హిందూ మహాసభలోని ఒక వర్గం తరపు న్యాయవాది వికాస్ సింగ్ ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. వీటినేం చేసుకోవాలంటూ ధర్మాసనాన్ని ప్రశ్నించారు. దానికి జస్టిస్ రంజన్ గొగొయ్.. 'కావాలనుకుంటే ముక్కలుగా చింపేసుకోవచ్చు' అని సమాధానమిచ్చారు. అప్పటికే వికాస్‌సింగ్ వాదనతో తీవ్రంగా విబేధించి ఉన్న ముస్లిం వర్గాల తరపు లాయర్ రాజీవ్ ధావన్.. సీజేఐ మాటతో.. సీజేఐ అనుమతి తీసుకుని తన దగ్గరున్న ఆ మ్యాప్‌ను అక్కడే ముక్కలుగా చింపేశారు. అయితే, ఆ ఘట్టం అక్కడితో ముగియలేదు. లంచ్ బ్రేక్ తరువాత.. తాను ఆ మ్యాప్‌ను చింపేసిన విషయం వైరల్‌గా మారిందని ధర్మాసనం దృష్టికి రాజీవ్ ధావన్ తీసుకువచ్చారు. 'నేనే కావాలని ఆ మ్యాప్‌ను చింపేశాననే ప్రచారం జరుగుతోంది' అని చెప్పారు. 'మీ అనుమతితోనే నేను ఆ పని చేశానన్న విషయం మీరు స్పష్టం చేయాల్సి ఉంది' అని సీజేఐని కోరారు. 'ఆ పేపర్లను చించే ముందు మీ అనుమతి కోరాను. అవసరం లేకపోతే చించేయండి అని మీరు చెప్పారు' అని సీజేఐకి ధావన్ గుర్తుచేశారు. దానికి సీజేఐ.. 'మీరు చెప్పేది కరెక్టే.. ప్రధాన న్యాయమూర్తి అనుమతితోనే ఆ మ్యాప్‌ను రాజీవ్ ధావన్ చించేశారనే వివరణ కూడా ప్రచారం కావాలి' అని స్పష్టం చేశారు.



### మరోసారి మధ్యవర్తిత్వ అంశం

చివరి రోజు విచారణ సందర్భంగా.. సమస్య పరిష్కారం కోసం మరోసారి మధ్యవర్తిత్వ అంశాన్ని పరిశీలించాలన్న వాదన కూడా తెరపైకి వచ్చింది. గతంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎఫ్ఎమ్ఐ కలీఫుల్లా, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు పండిట్ రవిశంకర్, ప్రముఖ మధ్యవర్తి శ్రీరామ్ పంచు సభ్యులుగా ఉన్న మధ్యవర్తిత్వ కమిటీ అయోధ్య వివాదానికి ఒక సామరస్యపూర్వక పరిష్కారం కోసం విఫల యత్నం చేసింది. ఆ కమిటీ కూడా తమ రిపోర్ట్‌ను బుధవారం సీల్డ్‌కవర్లో కోర్టుకు సమర్పించింది. అయోధ్యలోని వివాదాస్పద 2.77 ఎకరాల భూమిని సున్నీ వక్ఫ్ బోర్డు, నిర్మోహి అఖాడా, రామ్‌లల్లాలకు సమానంగా పంచుతూ 2010లో అలహాబాద్ హైకోర్టు తీర్పునిచ్చిన అనంతరం.. ఆ తీర్పును నిరసిస్తూ సుప్రీంకోర్టులో 14 వ్యాజ్యాలు దాఖలైన విషయం తెలిసిందే.



## నవంబర్ 18 నుంచి పార్లమెంట్!

**న్యూఢిల్లీ:** పార్లమెంటు శీతాకాలు సమావేశాలు నవంబర్ 18న ప్రారంభమయ్యే అవకాశాలున్నట్లు ప్రభుత్వవర్గాలు సంకేతాలిచ్చాయి. డిసెంబర్ 13 వరకు జరిగే అవకాశముందన్నాయి. పార్లమెంటు తేదీల ఖరారుపై పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్ కమిటీ బుధవారం కమిటీ అధ్యక్షుడు, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నివాసంలో భేటీ అయింది. సమావేశాల తేదీలపై వచ్చే వారంలో అధికారిక నిర్ణయం వెలువడే అవకాశముంది.

### పెద్దల సభలో ఇక సులువే!

విపక్ష పార్టీల ఎంపీల రాజీనామాలతో ఎన్డీయే ప్రభుత్వానికి రాజ్యసభలోనూ సానుకూల పరిస్థితి నెలకొంటోంది. బుధవారం కాంగ్రెస్‌కు మరో ఎంపీ దూరమయ్యారు. శీతాకాల సమావేశాలు మొదలయ్యేలోపు విపక్షాల నుంచి మరి కొందరూ రాజీనామా చేస్తారని బీజేపీ వర్గాలు అంటున్నాయి. కర్ణాటకకు చెందిన కాంగ్రెస్ ఎంపీ కేసీ రామమూర్తి బుధవారం పార్టీకి, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో రాజ్యసభలో ఆ పార్టీ సభ్యుల సంఖ్య 45కి తగ్గింది. 243 (ఇద్దరు నామినేటెడ్ సభ్యులను మినహాయించి) సభ్యుల రాజ్యసభలో ఎన్డీయేకు 106 మంది సభ్యుల మద్దతుంది. మిత్ర పక్షాలుగా భావించే అన్నాడీఎంకేకు 11 మంది, బీజేడీకి ఏడుగురు సభ్యులున్నారు. దీంతో రాజ్యసభలో బిల్లులను విపక్షాలు అడ్డుకునే పరిస్థితులు ఉండవని భావిస్తున్నారు.

# 'కిమ్' కర్తవ్యం?

- ఎత్తైన మంచుపర్వతంపై ఉ. కొరియా అధినేత కిమ్ గుర్రపు స్వారీ
- ప్రపంచం విస్తుపోయే గొప్ప కార్యం సిద్ధంగా ఉందన్న స్థానిక పత్రికలు

**సియోల్:** కొరియన్లకు పవిత్రమైన స్థలం ఉత్తరకొరియాలోని అత్యంత ఎత్తయిన మంచుకొండల మధ్య శ్వేతవర్ణపు అశ్వంపై రాచరికపు రీవిని ఒలకబోస్తోన్న ఉత్తర కొరియా నాయకుడు కిమ్ జాంగ్ ఉన్ చిత్రాలు మీడియాలో హఠాత్తుగా దర్శనమిచ్చాయి. ఆ దేశపు కీలక నిర్ణయాల సమయంలో గతంలో కూడా కిమ్ ఇలాగే చేయడంతో ఈ చిత్రాల వెనుక మతలబేమిటనేది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. గోధుమ రంగు పొడవాటి కోటులో మంచుకొండల మధ్య కిమ్ పోజిచ్చిన స్థలం, ఆయన స్వారీ చేస్తోన్న తెల్లటి గుర్రం కిమ్ కుటుంబ రాచరికపు అధికారదర్పాన్ని ప్రదర్శిస్తున్నాయి. 2,750 మీటర్ల ఎత్తులో ఉన్న ఈ మంచుకొండల ప్రాంతానికి కిమ్ రావడం ఇది తొలిసారి కాదు. గతంలో దేశ రాజకీయాలను మలుపుతిప్పే అరుదైన నిర్ణయాలు తీసుకునే సందర్భాల్లో ఈ స్థలాన్ని సందర్శించే అలవాటు కిమ్‌కి ఉంది. మౌంట్ పీక్టూ కిమ్ జాంగ్ ఉన్ తండ్రి నివాస స్థలమే కాకుండా ఉత్తర కొరియా విప్లవంలో ఈ స్థలానికి చారిత్రక ప్రాధాన్యత సైతం ఉన్నట్టు బుధవారం విడుదల చేసిన కేసీఎన్ఏ రిపోర్టు వెల్లడించింది. దక్షిణ కొరియాతో దౌత్య సంబంధాలపై ప్రకటన చేయడానికి కొన్ని వారాల ముందు 2017లో నూతన సంవత్సరం సందర్భంగా మౌంట్ పీక్టూని కిమ్ సందర్శించారు. ఆ సందర్భంగా దక్షిణకొరియాతో దౌత్యసంబంధాలకు సంబంధించిన అంశాలను సూచనప్రాయంగా చెప్పారు. అలాగే 2018లో దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జేయీ ఇన్‌తో కలిసి ఈ ప్రాంతాన్ని సందర్శించారు. అణ్వస్త్ర ప్రయోగానికి సంబంధించిన బటన్ ఎప్పుడూ తన టేబుల్‌పైన సిద్ధంగా ఉంటుందని కిమ్ గతంలో ప్రకటించిన విషయం తెలిసిందే. సుదూర లక్ష్యాలను చేరే క్షిపణులను, అణ్వాయుధ పరీక్షలను తలపెట్టబోమన్న కిమ్ వాగ్దానాన్ని ఆయన పునరాలోచించవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అమెరికాతో ఉత్తరకొరియా చర్చలు ప్రస్తుతం ప్రతిష్టంభనలో ఉన్నవిషయం తెలిసిందే.



# చిదంబరం మళ్లీ అరెస్ట్

**తీహార్ జైల్లోనే అదుపులోకి తీసుకున్న ఈడీ**



**న్యూఢిల్లీ:** ఐఎన్ఎక్స్ మీడియా మనీ ల్యాండరింగ్ కేసులో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసులో కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి పి. చిదంబరానికి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. తీహార్ జైల్లో ఉన్న ఆయనను ఈ సారి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అరెస్ట్ చేశారు. ముగ్గురు అధికారులతో కూడిన ఈడీ బృందం ఉదయం 8:15 గంటలకే తీహార్ జైలుకి చేరుకున్నారు. దాదాపుగా రెండు గంటల సేపు అక్కడే చిదంబరాన్ని విచారించారు. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో మనీ ల్యాండరింగ్‌పై గుచ్చి గుచ్చి ప్రశ్నించారు. ఆ తర్వాత ఆయనని అరెస్ట్ చేస్తున్నట్టుగా ప్రకటించారు. ప్రివెన్షన్ ఆఫ్ మనీ ల్యాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ) కింద ఆయనను అరెస్ట్ చేసినట్టు తెలిపారు. 14 రోజుల కస్టడీ విచారణ కోసం చిదంబరాన్ని అప్పగించాలంటూ కోర్టుని కోరారు. గతంలో ఎన్నోసార్లు చిదంబరాన్ని ఈడీ ప్రశ్నించినప్పటికీ ఆయనను అరెస్ట్ చేయలేదు. ఎందుకంటే చిదంబరాన్ని అరెస్ట్ చేయవద్దనీ, ఆయనను బలవంత పెట్టే ఎలాంటి చర్యలకు పాల్పడవద్దని గతంలో కోర్టు ఆదేశాలు ఉండేవి. అయితే చిదంబరాన్ని విచారించవచ్చునని అవసరమైతే అరెస్ట్ కూడా చేయవచ్చునంటూ ట్రయల్ కోర్టు మంగళవారమే అనుమతినిచ్చింది. దీంతో ఈడీ తన విచారణలో కొత్త అంశాలను రాబట్టడానికి సకల సన్నాహాలు చేస్తోంది. చిదంబరాన్ని ఈడీ కస్టడీకి అప్పగించడానికి కోర్టు అనుమతిస్తే అన్ని కోణాల నుంచి విచారణకు ఈడీ అధికారులు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా విదేశీ పెట్టుబడుల అంశం చుట్టూనే విచారణ సాగుతుందని ఈడీ కార్యాలయం అధికారులు తెలిపారు. ఈడీ బృందం ప్రశ్నించడానికి వచ్చినప్పుడు జైలు పరిసరాల్లో చిదంబరం భార్య నళిని, కుమారుడు కార్తీ కూడా కనిపించారు.

# వర్లిలో కుమార సంభవమే!






**మ**హారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ దక్షిణ ముంబైలో అందరి దృష్టి వర్లి నియోజకవర్గంపై పడింది. ఠాక్రే వంశం నుంచి తొలిసారిగా ప్రత్యక్షంగా ఎన్నికల బరిలో యువ సేనాని ఆదిత్య ఠాక్రే దిగడంతో ఈ సీటుపై చర్చ సాగుతోంది. ఆయన గెలుపుపై కాకుండా మెజార్టీ ఎంత వస్తుందన్న దానిపై చర్చ సాగుతోంది. వర్లి ఎప్పట్నుంచో శివసేనకు కంచుకోట. శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేకు ఈ నియోజకవర్గంపై మంచి పట్టు ఉంది. బీజేపీ–సేన కూటమి గెలిస్తే ఆదిత్య ఉపముఖ్యమంత్రి అవుతారన్న

### ఆదిత్య మెజార్టీపైనే అందరి దృష్టి

ప్రచారం కొనసాగుతోంది. ఇక ఆదిత్యపై పోటీకి దిగిన ఎన్సీపీ అభ్యర్థి సురేశ్ మానె దళిత నాయకుడు. ఆయన స్థానిక నేత. పక్కా లోకల్ అన్న ప్రచారంతోనే ఆదిత్యకు పోటీ ఇవ్వడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

**వర్లి ఒక మినీ మహారాష్ట్ర**

ఈ నియోజకవర్గం మినీ మహారాష్ట్రను తలపిస్తుంది. ఒకప్పుడు వస్త్ర పరిశ్రమకు పెట్టింది పేరైన వర్లి గత కొద్ది ఏళ్లలో రూపురేఖలు మారాయి. ఆకాశహర్మ్యాలు, అధునాతన వాణిజ్య భవనాలు వచ్చాయి. వాటి పక్కనే మురికివాడల్లో ప్రజలూ ఉన్నారు. చాల్స్ (ఇరుకు గదులుండే నాలుగైదు అంతస్తుల భవంతుల)లో ఉద్యోగులు ఉన్నారు. భిన్న కులాలు, మతాలు, విభిన్న భాషలు ఇలా ఈ ఒక్క నియోజకవర్గం మహారాష్ట్రకు నమూనాలా ఉంటుంది. మరాఠీ, గుజరాతీ, పంజాబీ, తెలుగు వారితోపాటు ఉర్దూ మాట్లాడే ముస్లింలు ఎక్కువగా ఉన్నారు. ఇలా భిన్న తరహా ఓటర్లను ఆకర్షించడం సులభమేమీ కాదు. దానికి తగ్గట్టుగానే ఆదిత్య ప్రచారంలో ముందున్నారు. 'సలాం వర్లి' అంటూ వివిధ ప్రాంతీయ భాషల్లో భారీ కటౌట్లు ఉంచి మరాఠీయేతరుల్ని ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఆరే కాలనీలో వందల భారీ వృక్షాల నరికివేత, ముంబై నైట్ లైఫ్ అంశాలను పదే పదే ప్రస్తావిస్తున్నారు. మరోవైపు, ఆదిత్యకు బాలీవుడ్ హీరో సంజయ్‌దత్ మద్దతుపలికారు.

**ఆదిత్యకు కలిసొచ్చేవి**

- బాల్ ఠాక్రే వారసత్వం
- సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటూ యువ ఓటర్లను ఆకట్టుకునే వ్యూహం
- ముంబై లైఫ్ వంటి అంశాల ప్రస్తావన
- అభివృద్ధి మంత్రం

**సురేశ్ మానెకు అనుకూలమివీ..**



- దళిత కార్డు
- లోకల్ ఇమేజ్
- ఇంటింటికీ తిరుగుతూ ప్రజలతో అనుసంధానం
- వివిధ భాషల వారిని ఆకట్టుకునే ప్రయత్నాలు

**గతంలో ఫలితాలు ఇలా..**

- 1990 నుంచి ఎన్నికల ఫలితాలను చూస్తే సేన ఒక్కసారి మాత్రమే ఓటమి పాలైంది.
- 1990 నుంచి 2004 ఎన్నికల వరకు శివసేన నుంచి దత్తాజీ తనవాందే ఈ నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు.
- 2009 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్సీపీ అభ్యర్థి సచిన్ అహిర్ గెలుపొందారు. రాజ్ ఠాక్రేకు చెందిన ఎంఎన్ఎస్ ఓట్లు భారీగా చీల్చడంతో ఎన్సీపీ అభ్యర్థికి లాభం చేకూరింది.
- 2014లో శివసేన అభ్యర్థి సునీల్ షిండే గెలుపొందారు.

# సిగ్గుతో చావండి

- 370 ఆర్టికల్ రద్దుకి మద్దతునివ్వకుండా నీచ రాజకీయాలా ?
- ఎన్నికల ప్రచారంలో విపక్షాలపై ధ్వజమెత్తిన మోదీ



**అకోలా/జల్నా:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారం తుది దశకు చేరుకోవడంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాటల్లో పదును పెంచారు. కశ్మీర్ 370 ఆర్టికల్ రద్దుని మోదీ, షాలు ప్రచార ఎత్తుగడగా మార్చుకోవడంపై విమర్శలు వెల్లువెత్తడంతో విపక్షాల నోరు మూయించే క్రమంలో మోదీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బుధవారం నాడు అకోలా, జల్నా జిల్లాల్లో ప్రధాని ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. 'కశ్మీర్‌కు, మహారాష్ట్రకి ఏమిటి సంబంధమని ఎలా అంటారు ? వారికెంత ధైర్యం ? ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నందుకు వాళ్లకు సిగ్గు అనిపించడం లేదా ? డూబ్ మరో డూబ్ మరో (సిగ్గుతో చావండి) అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ పరివార్ భక్తినే (ఒక కుటుంబానికి విధేయత చూపించడం) రాష్ట్ర భక్తిగా (జాతీయ భావం) భావిస్తోందని నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ పార్టీ పనైపోయిందని కొనఊపిరితో కొట్టు మిట్టాడుతోందని తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ, ఎన్సీపీ పొత్తుపైన కూడా ప్రధాని తీవ్ర విమర్శలు చేశారు. ఆ రెండు పార్టీలది అవినీతి పొత్తు అని నిందించారు. కాంగ్రెస్ హయాంలో రాష్ట్రం కొన్ని దశాబ్దాలు వెనక్కి వెళ్లిపోయిందని విమర్శించారు. ఆ రెండు పార్టీల ఓటు బ్యాంకు రాజకీయాలతో సామాన్య ప్రజలకే నష్టం జరిగిందని అన్నారు.



ఇక్కడ ఈ మార్మట్ ముఖచిత్రం ఏమిటి? భయానికి బిత్తరపోవడానికి మధ్య కొట్టుమిట్టాడుతున్నట్లు ఉంది కదూ.. చూడ్డానికి మనకు ఫన్నీగా కనిపిస్తున్నా.. తనను తినేయడానికి వచ్చిన నక్కను చూసి ఈ మార్మట్(ఎలుక జాతికి చెందినది) ఇక్కడ భయపడి చచ్చింది మరి. ఒక్కసారిగా వెనుక నుంచి దాడి చేయడానికి రావడంతో షాక్‌కు గురై బిత్తరపోయిన దృశ్యమిది.. ఇలాంటివి కెమెరా కన్నుకు చిక్కడం అరుదు. అందుకే ఈ ఫొటో ప్రతిష్టాత్మక వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్ పురస్కారాన్ని గెలుచుకుంది. 100 దేశాల నుంచి 48 వేల ఎంట్రీలు రాగా.. ఈ చిత్రం విజేతగా నిలిచింది. టిబెట్‌కు చెందిన యాంగ్‌కింగ్ బాబో దీన్ని క్లిక్‌మనిపించారు. హాస్యం, హర్రర్‌కు సంబంధించి ఇదో పవర్‌ఫుల్ సందర్భమని అవార్డుల జ్యూరీ వ్యాఖ్యానించింది. మొత్తం 19 విభాగాల్లో విజేతలను ప్రకటించారు. శుక్రవారం లండన్‌లోని నేచురల్ హిస్టరీ మ్యూజియంలో ఆ చిత్రాలను ప్రదర్శనకు ఉంచనున్నారు.

## జీన్స్ ప్యాంటులో 652 గ్రాముల బంగారం

### స్వాధీనం చేసుకున్న డీఆర్ఐ



శంషాబాద్: జీన్స్ ప్యాంటులో అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని డీఆర్ఐ అధికారులు పట్టుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి షార్జా నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఇండిగో విమానంలో లక్నోకి చెందిన ప్రయాణికుడు అక్రమంగా బంగారం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో అధికారులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడు ధరించిన ప్యాంటులో నడుము, కాళ్ల కింది భాగం వద్ద 652.95 గ్రాముల బంగారం బయటపడింది. బంగారాన్ని పేస్ట్‌లా మార్చి ప్లాస్టిక్ కవర్లలో ఉంచి జీన్స్ ప్యాంటులో దాచుకొని తీసుకొచ్చాడు. తీసుకొచ్చిన బంగారాన్ని ఎయిర్‌పోర్టు బయట అరైవల్ వద్ద ఉన్న మరో వ్యక్తికి అప్పగించేందుకు స్నేహితుడితో ఒప్పందం కుదుర్చుకున్నట్లు విచారణలో తెలిసింది. దీంతో అరైవల్ దగ్గర ఉన్న వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నారు. బంగారం విలువ రూ.24.61 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు.

## 33 డాక్టరేట్లతో గిన్నిస్ రికార్డ్

### మూడోసారి రికార్డుకెక్కిన హైదరాబాద్ వైద్యుడు



సాక్షి, హైదరాబాద్: ఒక వ్యక్తి తన జీవిత కాలంలో ఒకటి, రెండు లేదా మూడు పీహెచ్‌డీలు చేస్తాడు. అయితే హైదరాబాద్‌కు చెందిన వైద్యుడు సాగి సత్యనారాయణ 33 డాక్టరేట్ డిగ్రీలు చేసి మూడోసారి గిన్నిస్ రికార్డులో స్థానం దక్కించుకున్నారు. అందులో 22 పీహెచ్‌డీలు, ఆరు డీలిట్ (డాక్టర్ ఆఫ్ లిటరేచర్)లు, 5 డాక్టర్ ఆఫ్ సైన్స్‌లు ఉన్నాయి. భారత్‌తో పాటు అమెరికా, బ్రిటన్ వంటి విదేశాల నుంచి కూడా అవార్డులు అందుకున్నారు. స్పిరిచ్యువాలిటీ, ఆస్ట్రాలజీ, జనరల్ అండ్ క్లినికల్ సైకాలజీ, మెడికల్ సైన్సెస్, లిటరేచర్, బ్రహ్మజ్ఞానం (అల్టిమేట్ విజడమ్) తదితర అంశాలపై ఆయన ఈ పట్టాలను అందుకున్నారు. 2012 డిసెంబర్ నుంచి 2013 మధ్య కాలంలో 72 పుస్తకాలు రచించడంతో 2016 జనవరి 28న తొలిసారిగా గిన్నిస్ రికార్డులోకి ఎక్కారు. 2006 ఏప్రిల్ నుంచి 2012 జనవరి మధ్య అత్యధికంగా 125 పుస్తకాలు రచించడంతో 2016 ఆగస్టు 28న రెండోసారి గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కారు. ఈ నెలలో మూడోసారి గిన్నిస్ రికార్డులో ఆయన పేరు నమోదైంది.

# మరమ్మతులకూ పనికిరావు

- సచివాలయ భవనాలపై హైకోర్టులో వాదించిన ప్రభుత్వం
- కొత్త భవనాల్ని కూల్చడం ఎందుకని ప్రశ్నించిన ధర్మాసనం
- విచారణ 21వ తేదీకి వాయిదా



సాక్షి, హైదరాబాద్: సచివాలయ భవనాలు వినియోగానికి యోగ్యంగా లేవని, మరమ్మతులు చేసేలా కూడా లేవని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. అగ్ని ప్రమాదాలు జరిగితే నివారణ చర్యలు తీసుకునేందుకు అనువుగా లేదని పేర్కొంది. అన్ని హంగులతో వచ్చే వందేళ్లకు యోగ్యంగా ఉండేలా అదే ప్రదేశంలో కొత్త సచివాలయ భవనాల్ని నిర్మించాలని విధాన నిర్ణయం తీసుకుందని చెప్పింది. కూల్చివేతపై రోడ్లు, భవనాల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ నేతృత్వంలోని సాంకేతిక నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికను ప్రభుత్వం ధర్మాసనం ముందుంచింది. సచివాలయ భవనాల్ని కూల్చరాదంటూ రిటైర్డు ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు టి.జీవన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి ఇతరులు దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాలను బుధవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఇప్పుడున్న భవనాలు మరమ్మతులు చేసేందుకు కూడా వీలుగా లేవని సాంకేతిక కమిటీ నివేదికలో ఉందని ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ జె.రామచంద్రరావు చెప్పారు. అన్ని ప్రభుత్వ శాఖలు ఒక క్రమపద్ధతిలో ఒకే చోట ఉండేలా చేయాలని, అందుకే కొత్తగా సచివాలయ భవనాల్ని నిర్మించాలని మంత్రి వర్గం నిర్ణయం తీసుకుందని తెలిపారు. పది లక్షల అడుగుల విస్తీర్ణంతో గ్రీనరీతో కొత్తగా నిర్మాణం చేయాలని భావిస్తున్నట్లు వివరించారు. కొత్తగా నిర్మాణం చేయాలన్నది ప్రభుత్వ విధాన నిర్ణయమని, విధాన నిర్ణయాల్లో కోర్టులు జోక్యం చేసుకునేందుకు వీల్లేదని సుప్రీంకోర్టు పలు కేసుల్లో ఉత్తర్వులు ఇచ్చిందని చెప్పారు. ధర్మాసనం కల్పించుకుని.. ఎన్ని బ్లాకుల్లో అగ్ని ప్రమాదాలు జరిగాయని ప్రశ్నించింది. ఏ, జే, ఎల్, హెచ్ బ్లాకుల్లో అగ్నిప్రమాదాలు జరిగాయని అదనపు ఏజీ జవాబు చెప్పారు. దాదాపు 130 ఏళ్ల క్రితం నాటి జీ బ్లాక్ కూల్చేస్తామంటే సబబుగానే ఉంటుందని, అగ్నిప్రమాదం జరిగితే బయటపడేందుకు ఒకే వైపు దారి ఉన్న సీ బ్లాక్‌ను కూల్చేస్తామంటే కూడా అర్థం ఉందని, అయితే 50 ఏళ్లకుపైగా వినియోగానికి యోగ్యంగా ఉన్న హెచ్, డీ వంటి బ్లాకుల్ని కూల్చేస్తామనడం ఎందుకని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ భవనాల చుట్టూ ఖాళీ స్థలం కూడా బాగానే ఉందని, వాస్తవంగా చెప్పాలంటే సెట్‌బ్యాక్ కంటే ఎక్కువ స్థలం నాలుగు వైపులా ఉందని ధర్మాసనం గుర్తు చేసింది. నిపుణుల కమిటీ నివేదికను ఆ భవనాలకు నష్టం లేకుండా ప్రణాళిక అమలు చేయవచ్చు కదా? అని ప్రశ్నించింది. దీనికి అదనపు ఏజీ బదులిస్తూ.. ఏడేళ్ల క్రితం నిర్మించిన భవనాల్లో 1.4 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం ఉందని, పది లక్షల విస్తీర్ణంలో కొత్తగా నిర్మాణం చేయాలనేది సంకల్పమని తెలిపారు. ఇప్పుడున్న సచివాలయం 9.16 లక్షల చదరపు అడుగులని నివేదికలో వివరించారని, కొత్తగా పది లక్షల చదరపు అడుగులు నిర్మిస్తే అదనపు నిర్మాణం తక్కువే కదా అని మళ్లీ ప్రశ్నించింది. తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది.

# కీలక శాఖల్లో అభివృద్ధి సంస్కరణలు

- సీఈజీఐఎస్‌తో ఆర్థిక, ప్రణాళిక శాఖల ఒప్పందం
- మంత్రి హరీశ్ సమక్షంలో సంతకాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలను పెంచడమే లక్ష్యంగా కీలక శాఖల్లో అభివృద్ధి సంస్కరణలను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. దీనికి అవసరమైన రోడ్ మ్యాప్‌లు తయారు చేసి సంస్కరణల ఫలితాలు అధ్యయనం చేసేందుకు సెంటర్ ఫర్ ఎఫెక్టివ్ గవర్నెన్స్ ఆఫ్ ఇండియన్ స్టేట్స్ (సీఈజీఐఎస్)తో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక శాఖలు ఎంవోయూ కుదుర్చుకున్నాయి. ఆర్థిక మంత్రి హరీశ్‌రావు, ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ బి.వినోద్ కుమార్‌ల సమక్షంలో బుధవారం హైదరాబాద్‌లో త్రైపాక్షిక ఒప్పందంపై ఆయా శాఖలు, సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. దీని ప్రకారం ఆర్థిక, సామాజిక అభివృ ద్ధి, ప్రజాధన వ్యయంలో నైపుణ్యం పెంపు లక్ష్యంగా చతుర్ముఖ వ్యూహం అవలంబించనున్నారు. కీలక శాఖల్లో సంస్కరణలకు రోడ్‌మ్యాప్‌లు తయారు చేసి వాటి ఫలితాలను బేరీజు వేయడంలో ఇరు పక్షాలు పనిచేయనున్నాయి. కార్యక్రమంలో ఆర్థిక సలహాదారు జీఆర్‌రెడ్డి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, సీఈజీఐఎస్ వ్యవస్థాపకుడు కార్తీక్ మురళీధరన్ పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలతో మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో వినోద్‌కుమార్







| Models | Hexa | Nexon | Tiago | Tigor | Harrier |
|---|---|---|---|---|---|
| క్యాష్ ఆఫర్ | ₹50,000* | ₹25,000* | ₹25,000* | ₹30,000* | |
| ఎక్స్ఛేంజ్ బోనస్ | ₹50,000* | ₹25,000* | ₹15,000* | ₹25,000* | ₹50,000* |
| కార్పొరేట్ డిస్కౌంట్ | ₹15,000* | ₹7,500* | ₹5,000* | ₹12,000* | ₹15,000* |
| సెలెక్ట్ ఛాసిస్‌పై ఆఫర్ | ₹50,000* | ₹30,000* | ₹25,000* | ₹50,000* | |
| అత్యధిక లాభాలు (వరకు)* | ₹1,65,000* | ₹87,500* | ₹70,000* | ₹1,17,000* | ₹65,000* |


Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com